అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శనివారం 15-02-2025
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 357 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



బరాబర్ సుంకాలేస్తాం
మోడీకి తెగేసి చెప్పిన ట్రంప్

భారత్‌కు యుద్ధ విమానాలు, చమురు విక్రయం

త్వరలోనే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం

మోడీతో చర్చల అనంతరం ట్రంప్ ప్రకటన

చైనా సరిహద్దులో ఘర్షణలు నిలిచిపోవాలన్న ప్రధాని

వాషింగ్టన్ : భారత్‌పైనా బరాబర్ సుంకాలేస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. భారత్ ఎంత మిత్ర దేశమైనా పన్నుల విషయంలో తగ్గబోమని మోడీ ముందే తేల్చి చెప్పారు. వైట్‌హౌస్‌లో భేటీ అనంతరం నేతలిరువురూ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత్ సహా ఇతర దేశాలపై విధిస్తున్న పన్నులను ట్రంప్ సమర్థించుకున్నారు. భారత్ తమపై ఎంత శాతం పన్ను విధిస్తే.. తాము అంతే వసూలు చేస్తామన్నారు. అమెరికా ప్రజల కోసం ఇదే సరైన చర్య అని అన్నారు. యూరప్ దేశాలు తమ ఉత్పత్తులపై భారీగా పన్నులు వేస్తున్నాయంన్నారు. చైనాపై భారీగా పన్నులు విధిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. 2030 నాటికి భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మోడీ పర్యటన రోజునే భారత్‌పై టారీఫ్‌ల పెంపును ట్రంప్ బలంగా నొక్కి చెప్పారు. కొన్ని గంటల ముందే అన్ని దేశాలపై సుంకాలను అమలు చేస్తూ ఫైల్‌పై సంతకం చేశారు. భారతీయ మార్కెట్లలో ప్రవేశించడానికి అసమంజసంగా ఉన్న అధిక సుంకాలు తమకు ప్రధాన సమస్యగా ఉన్నాయని ట్రంప్ పేర్కొన్నారు. కాగా సుంకాల విషయంలో రెండు దేశాల మధ్య స్పష్టత రాకపోవడం గమనార్హం. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకునే దిశగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోడీ చర్చల క్రమంలో భారత్‌కు ఎఫ్-35 యుద్ధ విమానాలను, చమురును విక్రయించేందుకు అమెరికా అంగీకరించింది. ఈ సంవత్సరం నుండే భారత్‌కు సైనిక అమ్మకాలు పెంచుతామని సమావేశం తర్వాత ట్రంప్ ప్రకటించారు. వాటిలో భాగంగా ఎఫ్-35 ఫైటర్ జెట్లను సరఫరా చేస్తామని చెప్పారు. అంతేకాక భారత్‌కు ఇంధనాన్ని విక్రయిస్తామని తెలిపారు. రెండు దేశాల మధ్య వాణిజ్య లోటును భర్తీ చేసేందుకు అమెరికా నుండి చమురు, గ్యాస్‌ను భారత్ దిగుమతి చేసుకుంటుందని అన్నారు. వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిపేందుకు రెండు దేశాలు అంగీకరించాయని ట్రంప్ చెప్పారు. త్వరలోనే కొత్త రక్షణ ఫ్రేమ్‌వర్క్ కూడా కార్యరూపం దాలుస్తుందని ప్రకటించారు. ముంబయిపై జరిగిన 26/11 ఉగ్ర దాడిలో కీలక నిందితుడిగా ఉన్న తహావర్ రాణాను భారత్‌కు అప్పగించేందుకు అమెరికా ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. ఈ ఏడాది నుండే భారత్‌కు అనేక బిలియన్ డాలర్ల విలువ కలిగిన సైనిక విక్రయాలను పెంచడం ప్రారంభిస్తామని అన్నారు. మోడీతో జరిగిన సమావేశం వివరాలను తెలియజేస్తూ ఇప్పటికే రక్షణ భాగస్వామ్యాన్ని విస్తరించుకున్నామని, ఆర్థిక సంబంధాలను కూడా బలోపేతం చేసుకుంటామని ట్రంప్ చెప్పారు. మంచి విశ్వాసానికి సంకేతంగా వాణిజ్య సంబంధాలకు మరింత న్యాయాన్ని జోడిస్తామని, పరస్పరం ఇచ్చి పుచ్చుకునే వైఖరిని అవలంబిస్తామని ట్రంప్ ...3లో

అదానీపై కేసు గురించి ట్రంప్‌తో చర్చించారా?

అమెరికాలో మోడీకి జర్నలిస్ట్ సూటి ప్రశ్న

నేతల భేటీలో వ్యక్తిగత అంశాలు ప్రస్తావనకు రావన్న ప్రధాని

మిత్రుడి అవినీతిని కప్పిపుచ్చే చర్యగా ప్రతిపక్షాల విమర్శ

వివరాలు 3లో

మోడీ బీసీ కాదు
గుజరాత్‌కు సీఎం అయ్యాక ఆయన కులాన్ని బీసీల్లో చేర్చారు

అగ్రకులంలో పుట్టారు...అందుకే ఆయన మనసు బీసీలకు వ్యతిరేకం

మోడీ, కేడీ బీసీలను మోసం చేస్తున్నారు...

వారిపై ఒత్తిడి పెరగడం వల్లే కులగణనపై తప్పుడు ప్రచారం

తప్పుడు లెక్కలు రాయదల్చుకుంటే నా సామాజికవర్గాన్ని ఎక్కువ రాసుకోలేనా?

కోర్టు కూడా తప్పు పట్టలేనంతగా పక్కాగా లెక్కలున్నాయి



కేంద్రానికి దమ్ముంటే దేశవ్యాప్తంగా కుల గణన చేయాలి : కులగణన, ఎస్సీవర్గీకరణ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'ప్రధాని మోడీ పుట్టుకతో బీసీ కాదు. ఆయన లీగల్లీ కన్వర్టెడ్. గుజరాత్‌కు ముఖ్యమంత్రి అయ్యాక ఆయన కులాన్ని బీసీల్లో చేర్చారు. ప్రధాని అగ్రకులంలో పుట్టారు. ఈ విషయం గురించి ఆషామాషీగా చెప్పడం లేదు. అన్ని తెలుసుకునే ఆయన కులం గురించి మాట్లాడుతున్నాను. సర్టిఫికేట్స్‌లోనే మోడీ బీసీ.. కానీ ఆయన మనసంతా బీసీ వ్యతిరేకం' అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ ప్రకాశంహాల్‌లో కులగణన, ఎస్సీవర్గీకరణపై టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో ముఖ్యమంత్రి మాట్లాడారు. కేంద్రానికి దమ్ముంటే దేశవ్యాప్తంగా జనగణనతోపాటు కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. అప్పుడు కేంద్ర లెక్కలు, కాంగ్రెస్ ప్రభుత్వ లెక్కలను సరిపోల్చి చూద్దామని సవాల్ విసిరారు. కులగణన సర్వేలో పాల్గొనని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను బహిష్కరణ చేయాలని పిలుపునిచ్చారు. ఈ తీర్మానాన్ని అందరూ బలపరచాలని కోరారు. బీఆర్ఎస్ మా ప్రభుత్వ సర్వేను తప్పుల తడకని చెప్పే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కుల గణన నివేదికను తప్పు అంటూ మోడీ, కేడీ (కేసీఆర్) బీసీలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనను విజయవంతంగా నిర్వహించడంతో ప్రధాని మోడీపై ఒత్తిడి వస్తుందనే భయంతో మన సర్వేను తప్పుడు సర్వే అంటూ బీజేపీ నేతలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సర్వేలో ఎక్కడ తప్పు ఉందో చెప్పాలని బీఆర్ఎస్, బీజేపీ నాయకులను బీసీలు నిలదీయాలని సూచించారు. ఆ పార్టీల నేతల మాటలు వింటే బీసీలకు తీరని నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆ ఇండ్ల ముందుకు మేలుకొలుపు డప్పు

కులగణనలో పాల్గొనని కేసీఆర్ కుటుంబానికి తెలంగాణ సమాజంలో నివసించే హక్కు లేదని ఈ సందర్భంగా సీఎం వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా సర్వేలో పాల్గొనేలా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఇంటి ముందుకు మేలుకొలుపు డప్పు కొట్టండని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రతి పనిపై బీజేపీ, బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం ఐదు కేటగిరీల కింద కుల గణన వివరాలు సేకరించామన్నారు. కుల గణన తుది నివేదిక ప్రకారం రాష్ట్రంలోని బీసీ జనాభా 56.33 శాతం ఉందని వెల్లడించారు. గతంలో సర్వే చేసి వివరాలు వెల్లడించకుండా దాచిన వారు ఇప్పుడు తమను విమర్శిస్తున్నారని బీఆర్ఎస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఇప్పటిదాకా ఎందుకు వెల్లడించలేదని సీఎం ప్రశ్నించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా పటిష్టంగా, శాస్త్రీయంగా కుల గణన సర్వే చేయించామని తెలిపారు.

ప్రణాళిక ప్రకారమే ముందుకుపోతాం

కులగణనపై ప్రణాళిక ప్రకారమే ముందుకెళామని సీఎం స్పష్టం చేశారు. మైనార్టీల లెక్క ఎలా తీశారని కొందరు ప్రశ్నిస్తున్నారనీ, ...11లో

105 ఇంటిగ్రేటెడ్ గురుకులాల పనులు
రెండేండ్లలో పూర్తి చేయాలి

స్థలాల గుర్తింపునకు సంబంధించి వారంలో నివేదిక అందించాలి

కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు చేపట్టాలి

అనువైన స్థలం లేకుంటే ప్రత్యామ్నాయం చూడాలి

స్థలాలున్న చోట పనులను వెంటనే ప్రారంభించాలి : అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

వివరాలు 10లో

ఆదాయం, ఉపాధి వనరుగా
పర్యాటకం

సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో ప్రోత్సాహకాలు

అటవీ, ఐటీ, టీజీఐఐసీ, మెడికల్, స్పోర్ట్స్ విభాగాలతో సమన్వయం చేసుకోవాలి : సమీక్షలో ముఖ్యమంత్రి

వివరాలు 10లో

సహకార సంఘాల
గడువు పొడిగింపు

పీఏసీఎస్‌ల పదవీకాలం మరో ఆరు నెలలు పెంపు

రాష్ట్రప్రభుత్వ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గ గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 904 సహకార సంఘాల కాలపరిమితి, 9 డీసీసీబీ చైర్మెన్ల పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పాలకవర్గ పదవీకాలానికి ఆరు నెలల ముందే ఎన్నికల ప్రక్రియ మొదలవుతుంది. ఫిబ్రవరి 15 నాటికే గడువు ముగుస్తున్నా ఇంత వరకు రాష్ట్ర ...11లో

దివాలా తీసిన డబుల్ ఇంజిన్ సర్కార్
రాష్ట్రపతి పాలన పరిష్కారం కాదు

శాంతిస్థాపనకు అవసరమైన సంప్రదింపులు జరపాలి 11లో..

ప్రజల ప్రజాస్వామిక హక్కులకు రక్షణ కల్పించాలి : మణిపూర్‌పై సీపీఐ (ఎం) వ్యాఖ్య

కేంద్రానిది జుమ్లా బడ్జెట్
వర్గపోరాటాలకు మళ్లీ అవకాశం



మాట్లాడుతున్న డి. పాపారావు

ఈజీ మనీ కల్చర్ ప్రమాదం

విద్యా,వైద్యం,పీడీఎస్‌లకు కేటాయింపులు పెరగాలి

ఆర్థిక సర్వే ఒకలా.. బడ్జెట్ మరోలా : 'కేంద్ర బడ్జెట్-కార్మికవర్గంపై ప్రభావం'

సీఐటీయూ సెమినార్‌లో వక్తలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ సర్కారు 2025-26 ఏడాదికిగాను ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను ఆదుకునేదిగా లేదని వక్తలు వ్యాఖ్యానించారు. అదొక 'జుమ్లా' బడ్జెట్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు వత్తాసు పలికిందనీ, పేదలను నిర్లక్ష్యం చేసిందని నిరసన తెలిపారు. విద్యా, వైద్యం, పీడీఎస్‌లకు నిధుల కేటాయింపు తగినంతగా లేదని అభిప్రాయపడ్డారు. ఆర్థిక సర్వే ఒకలా ఉంటే, బడ్జెట్‌లో కేటాయింపులు మరోలా ఉన్నాయని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'కేంద్ర బడ్జెట్-కార్మికవర్గంపై ప్రభావం' అనే అంశంపై సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సెమినార్ జరిగింది. దీనికి ...12లో

మిర్చీకి కనీస మద్దతు ధర
రూ. 25 వేలు ఇవ్వాలి
సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ






నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మిర్చి పంటకు కనీస మద్దతు ధర రూ.25 వేలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'రాష్ట్రంలో రైతులు పండించిన మిర్చికి ధర దారుణంగా పడిపోతున్నది. క్వింటాల్‌కు రూ25,000 వుండాల్సిన పరిస్థితి నుంచి రూ.12,000లకు తగ్గించి వ్యాపారులు రైతులకు గిట్టుబాటు లేకుండా చేస్తున్నారు. ఫలితంగా మిర్చి రైతుల ఆత్మహత్యలు ప్రారంభమయ్యాయి. ఖమ్మం జిల్లాలో ఇద్దరు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఒక రైతు ...11లో

నూతన సీఈసీగా జ్ఞానేశ్ కుమార్?



18న పదవీ విరమణ చేయనున్న రాజీవ్ కుమార్

17న సమావేశం కానున్న సెలక్షన్ కమిటీ

వివరాలు 11లో

తునికాకు సేకరణకు
ఆదేశాలివ్వాలి

ఇప్పటివరకూ టెండర్లు పిలవకపోవడం దారుణం

మంత్రి సీతక్క జోక్యం చేసుకోవాలి

ఫిబ్రవరి మొదటి వారంలో కొమ్మకొడితేనే నాణ్యమైన ఆకు

17న ఐటీడీఏలు, డీఎఫ్ఓ కార్యాలయాల ఎదుట నిరసనలు : వ్యవసాయ కార్మిక సంఘం రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

వివరాలు 11లో

పేదల బతుకు పోరాటాన్ని గుర్తించలేకపోయారు
ఉచితాల పట్ల జస్టిస్ గవాయ్ వ్యాఖ్యలపై బృందా కరత్ లేఖ

న్యూఢిల్లీ : పెచ్చరిల్లుతున్న నిరుద్యోగం, ప్రమాదకరమైన పని పరిస్థితులు, తక్కువ వేతనాలు వంటి సమస్యలు ఎదుర్కొంటూ భారతదేశంలో కార్మిక వర్గం తమ మనుగడ కోసం సాగిస్తున్న పోరాటాన్ని గుర్తించడంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ విఫలమయ్యారని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ విమర్శించారు. ఉచితాలు వద్దని, దానివల్ల ప్రజలు సోమరిపోతులుగా మారిపోతారంటూ న్యాయమూర్తి గవాయ్ వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బృందాకరత్ శుక్రవారం గవాయ్‌కు బహిరంగ లేఖ రాశారు. ఈ వ్యాఖ్యలతో, ప్రభుత్వం నుండి సామాజిక ప్రయోజనాలు అందుకునే వారిపై సమాజ అభిప్రాయాలు మారిపోయే పరిస్థితులు ఎదురవుతాయని పేర్కొన్నారు. దేశ రాజధానిలో పట్టణ ప్రాంత నిరాశ్రయులకు రాత్రుళ్ళు షెల్టర్లు కొరతపై దాఖలైన పిటిషన్లు విచారిస్తూ బుధవారం జస్టిస్ గవాయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అపరిమితమైన ఉచితాలు నిరుపేదలను ఎలాంటి పనీపాటా చేయని సోమరిపోతుల్లా మార్చేస్తాయని, వారు పని వెతుక్కోవడానికి కూడా ఎలాంటి చొరవ తీసుకోరని వ్యాఖ్యానించారు.

ఈ వ్యాఖ్యలు దేశంలో చెమటోడ్చి పనిచేసే మహిళలకు ఎలాంటి న్యాయం చేవని బృందా కరత్ అన్నారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు నేరుగా నగదు బదిలీ చేసే పథకం గురించి ప్రస్తావిస్తూ ఆమె, మహిళలకిచ్చే ఇటువంటి స్టయిఫండ్‌ను సామాజిక నష్టపరిహారంగా పరిగణించాలని, అంతేకానీ ప్రభుత్వమిచ్చే ఉచితంగా పరిగణించరాదని సూచించారు. సగటున భారతీయ మహిళలు రోజు ఇంట్లో ఏడున్నర గంటలు పనిచేస్తున్నారని, ఇదంతా కూడా జీతం బత్తెం లేని పనేనని అంటే మొత్తంగా వారానికి దాదాపు 50 గంటలైందని చెప్పారు. బయటచేసే పనికి ఆ మహిళలకు వేతనం వస్తుందని, కానీ ఇంట్లో చేసేపని వల్ల ఆమె పనిగంటలు పెరుగుతాయంతేనని అన్నారు. 2023-24లో ఎస్‌బిఐ చేసిన సర్వే ప్రకారం, మహిళలకు ఎలాంటి చెల్లింపులు లేని ఆ పనికి గనక డబ్బులిచ్చినట్లైతే, ఏడాదికి ఏకంగా 22లక్షల కోట్ల రూపాయిలు అయ్యేదని బృందా కరత్ ఆ లేఖలో పేర్కొన్నారు. అంటే ఇది ఆ ఏడాది జీడిపిలో దాదాపు 7శాతంగా వుంది. ఇలా మహిళలు చేసే పనికి సామాజికంగా ఎలాంటి గుర్తింపు ...2లో





వేగంగా
తెలంగాణ అభివృద్ధి


తలసరి ఆదాయం రూ.3.56 లక్షలు

రికార్డు స్థాయిలో వరి ఉత్పత్తి, భూగర్భ జలవనరుల పెరుగుదల

హైదరాబాద్ పరిసరాల్లో పూల సాగును ప్రోత్సహించాలి 2లో..

నాబార్డ్ స్టేట్ ఫోకస్ పేపర్ ఆవిష్కరణలో ఉప ముఖ్యమంత్రి భట్టి

గుమ్మడిదలను మరో లగచర్ల చేయొద్దు



ప్రజాభిప్రాయానికి భిన్నంగా డంపింగ్ యార్డు పెట్టొద్దు

అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం

గ్రామాల్లేని ప్రాంతంలో పెట్టండి

దీక్షల్లో పాల్గొని మాట్లాడిన మాజీ మంత్రి హరీశ్‌రావు

వివరాలు 11లో

వేగంగా తెలంగాణ అభివృద్ధి

రికార్డు స్థాయిలో వరి ఉత్పత్తి, భూగర్భ జలవనరుల పెరుగుదల

- తలసరి ఆదాయం రూ.3.56 లక్షలు
- హైదరాబాద్ పరిసరాల్లో పూల సాగును ప్రోత్సహించాలి
- నాబార్డ్ స్టేట్ ఫోకస్ పేపర్ ఆవిష్కరణలో ఉప ముఖ్యమంత్రి భట్టి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) రూ.15.02 లక్షల కోట్లు, వృద్ధిరేటు 14.5 శాతం ఉందని వివరించారు. రాష్ట్రంలో ప్రతి వ్యక్తి తలసరి ఆదాయం రూ.3.56 లక్షలుగా ఉందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో నాబార్డ్ స్టేట్ ఫోకస్ పేపర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అభివృద్ధి అనేది కేవలం సంఖ్యల ద్వారా మాత్రమే కాకుండా రైతులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలతోపాటు గ్రామీణ ప్రాంతాలను ఏ విధంగా అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నామనేదే మెరుగైన ప్రయాణమని అన్నారు. ఈ ప్రయాణంలో నాబార్డ్ కీలక భాగస్వామిగా ఉందనీ, రాబోయే రోజుల్లో మరింత ప్రోత్సాహం అందించాలని కోరారు. వ్యవసాయ రంగానికి రుణ సహాయం, రైతు ఉత్పత్తిదారుల సంస్థలను బలోపేతం చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని సూచించారు. డిజిటల్ బ్యాంకింగ్ రంగాన్ని విస్తరించాలని కోరారు. నాబార్డ్ సహకారంతో రాష్ట్రంలో భూగర్భ జలాలు పెరిగి రైతులు అనేక పంటలు పండించే స్థాయికి చేరుకున్నారని వివరించారు. నీటి కొరత ఉన్న జిల్లాలను గుర్తించి నాబార్డ్ తన సహకారాన్ని మరింత విస్తరించాలని కోరారు. నీటిని ఆదా చేసే డ్రిప్పు, స్ప్రింక్లర్ల ద్వారా సాగు చేయడంతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. విపరీతమైన ఎండ ఉన్నా ఇజ్రాయిల్ అద్భుతమైన వ్యవసాయ వృద్ధిని సాధించిందని గుర్తు చేశారు.

లక్ష ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు

ఎడిబుల్ ఆయిల్ దిగుమతులపై ఆధారపడకుండా ఉండడానికి దేశంలో లక్ష ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా పెట్టుకున్నామని భట్టి విక్రమార్క అన్నారు. ఆయిల్ పామ్ సాగులో మలేషియా ప్రపంచంలోనే మొదటిస్థానంలో ఉందన్నారు. తెలంగాణలోనూ ఆయిల్ పామ్ సాగును బలోపేతం చేయాలని కోరారు. మామిడి, పసుపు, మిర్చి, చిరుధాన్యాలు వంటి విలువైన పంటలకు తెలంగాణ పేరుగాంచిందని వివరించారు. కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సహించడం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రైతులకు శిక్షణ ఇవ్వడం వంటి పనులను నాబార్డు చేపట్టాలని కోరారు. మహారాష్ట్రలో ఆల్ ఫోన్స్ రకం మామిడిని సాగు చేస్తున్నారని చెప్పారు. ఇది ఎగుమతిలో ఒక మోడల్‌గా ఉందన్నారు. మహారాష్ట్ర తరహా భూమి, ఇతర వనరులు తెలంగాణలో ఉన్న నేపథ్యంలో ఆల్ ఫోన్స్ రకం మామిడి సాగుకు రైతులను ప్రోత్సహించాలని సూచించారు.

పదేండ్లపాటు శాస్త్రీయ సాగు నిర్లక్ష్యం

గత పదేండ్లపాటు పాలించిన వారు రాష్ట్రంలో శాస్త్రీయమైన సాగును నిర్లక్ష్యం చేశారని భట్టి విక్రమార్క విమర్శించారు, తిరిగి ఆ రంగంవైపు వ్యవసాయ శాఖ, నాబార్డు అధికారులు దృష్టి సారించాలని కోరారు. గ్రీన్ హౌస్, పాలీ హౌస్, డ్రిప్, స్ప్రింక్లర్‌ల ద్వారా పంటల సాగుకు ప్రోత్సాహం అందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ బ్యాంకింగ్, మొబైల్ క్రెడిట్ వ్యవస్థలను విస్తరించాలని సూచించారు. స్వయం సహాయక బృందాల(ఎస్‌హెచ్‌జీ)ను బలోపేతం చేయాలని కోరారు. డిజిటల్ బ్యాంకింగ్ రంగంలో కెన్యా ఎం-పెసా ద్వారా మార్పు తెచ్చిందని వివరించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా లక్షల సంఖ్యలో ఉపాధి, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. గ్రీన్ పవర్ ఉత్పత్తికి సహకారం అందించి సుస్థిరమైన అభివృద్ధి సాధనకు నాబార్డు ముందుకు రావాలని కోరారు. రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ పంపు సెట్లు ప్రస్తుతం ఉచిత విద్యుత్ పథకం ద్వారా కొనసాగుతున్నాయని వివరించారు, వాటిని క్రమంగా సోలార్ పంపుసెట్లుగా మార్చేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు. దాని మూలంగా ఆర్థికంగా లాభం పొందడమే కాకుండా, వాతావరణ కాలుష్యాన్ని పెద్ద సంఖ్యలో తగ్గించేందుకు అవకాశముంటుందని చెప్పారు. గ్రీన్ పవర్ ఉత్పత్తిలో జర్మనీ ప్రపంచ లీడర్‌గా ఉందన్నారు. ఈ రంగంలో భారత్‌లో తెలంగాణ లీడర్‌గా ఎదిగేందుకు నాబార్డు సహకారం అందించాలని కోరారు. కొత్త విద్యుత్ పాలసీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. స్వయం సహాయక బృందాల ద్వారా వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తికి ఇంధన శాఖ అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారని అన్నారు. స్వయం సహాయక బృందాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఆర్థిక చేయూతను అందించాలన్నారు. అటవీ హక్కుల చట్టం ద్వారా గిరిజన ప్రాంతాల్లో రైతులకు సాగు భూములు అందజేశామని వివరించారు. ఆ భూముల్లో పామాయిల్, అవకాడో, వెదురు వంటి పంటల సాగును ప్రోత్సహించాలని అన్నారు. దీంతో అటవీ విస్తీర్ణాన్ని కాపాడుకునే అవకాశముంటుందని చెప్పారు.

రైతు, చేనేత కార్మికుల సంక్షేమానికి సర్కారు కట్టుబడి ఉంది

- ఉద్యాన పంటలకు ప్రోత్సాహం : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతులు, చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో వ్యవసాయ, చేనేత, హస్త కళల శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై ఆయన చర్చించారు. వ్యవసాయ రంగానికి గత రాష్ట్ర బడ్జెట్‌లో పెద్ద మొత్తంలో కేటాయింపులు చేసినట్టు తెలిపారు. ఆ విధానాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఉద్యాన పంటల విస్తీర్ణం పెంపుదలపై దృష్టి సారించాలని సూచించారు. సాధారణ పంటలతో పోలిస్తే ఉద్యాన పంటలతో వచ్చే ఆదాయం మూడు రేట్లు ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పూలు, కూరగాయలు, పామాయిల్ వంటి ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

చేనేత కార్మికులకు సబ్సిడీపై నూలు, విద్యుత్ సౌకర్యం వంటి పథకాలు కొనసాగించాలని సూచించారు. వారికి ఇచ్చిన మాట మేరకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్రంలో టెక్స్‌టైల్ పార్కుల అభివృద్ధికి కావాల్సిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్‌రావు, చేనేత శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్, ఆర్థిక శాఖ జాయింట్ డైరెక్టర్ హరిత, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల విద్యార్థిని కిడ్నాప్

- కిడ్నాపర్‌ను చితకబాది.. పోలీసులకు అప్పగింత

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)



కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలో సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థిని కిడ్నాప్ కలకలం రేపింది. బోర్లం గురుకుల బాలికల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని సుశీత నాన్న ఆరోగ్యం బాగలేదని.. పెదనాన్న కుమారుడు సంజయ్ భార్గవ్ బొర్లం గురుకుల పాఠశాలకు వెళ్లి మాయమాటలు చెప్పి బైక్‌పై హైదరాబాద్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించాడు. గాంధారి మండలం మొండి సడక్ వద్ద ద్విచక్రవాహనంలో పెట్రోల్ అయిపోవడంతో సంజయ్ పెట్రోల్ కోసం బంక్‌కు వెళ్లాడు. విద్యార్థిని వారి కుటుంబ సభ్యులకు ఫోన్ చేయడంతో.. 'సంజయ్ ప్రవర్తన బాగాలేదు. అతని వెంట నువ్వు వెళ్లొద్దు' అని సూచించారు. మొండి సడక్ వద్ద ఉన్నట్టు బాలిక చెప్పడంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. బాలికను కిడ్నాప్ చేస్తున్నట్టు అనుమానం వచ్చి చితక బాది పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు ముఖ్య కారణం హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యమేనని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

చిల్కూరు రంగరాజన్‌కు 'ఐలు' పరామర్శ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) , తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రతినిధి బందం శుక్రవారం చిల్కూరు బాలాజీ ఆలయ పూజారి సీఎస్ రంగరాజన్‌కు సంఘీభావం తెలిపారు. వీరరాఘవరెడ్డి, అతని గూండాలు రంగరాజన్‌పై అక్రమంగా డబ్బులు డిమాండ్ చేసి దాడి చేయడాన్ని ఖండించారు. తమ మాట వినకుంటే తీవ్ర పరిణామాలుంటాయని బెదిరించాడని 'ఐలు' బృందానికి రంగరాజన్ వివరించారు. పూజారిపై జరిగిన దాడిని ఐలు తీవ్రంగా ఖండిస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేందుకు అర్చకుడికి తన సహాయాన్ని అందజేస్తానని హామీ ఇచ్చింది ఈ ఆందోళనలో అవసరమైనప్పుడు ఐలు న్యాయ సహాయం చేయాలని అర్చకుడు అభ్యర్థించారు. ఏఐఎల్‌యూ మత సామరస్యానికి నిలువెత్తు నిదర్శనమనీ, చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోరాదని బృందం అభిప్రాయపడింది. ఐలు తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కె. పార్ధసారథి నేతత్వంలోని ప్రతినిధి బందంతోపాటు హైదరాబాద్ కమిటీ కార్యదర్శి సి రామచంద్రారెడ్డి, మాధవ రెడ్డి, సుదర్శన్, అలీ హైదర్ తదితరులు కూడా పాల్గొన్నారు.

పేదల బతుకు పోరాటాన్ని గుర్తించలేకపోయారు

(మొదటిపేజీ తరువాయి)

వుండడం లేదన్నారు. పైగా ఆ మహిళలు ఏమీ పనిచేయడం లేదంటూ అవమానిస్తారని అన్నారు. న్యాయమూర్తి కూడా అలాంటి వ్యాఖ్యలే చేసి ఇటువంటి భావనకు తోడ్పడడం విచార కరమని అన్నారు. ఉచిత రేషన్ గురించి ప్రస్తావిస్తూ, ప్రపంచం లోకెల్లా భారతదేశం అతిపెద్ద పోషకాహార లోపం కలిగిన దేశమని అన్నారు. ఈ కారణంగానే ప్రజలు, సంఘాలు రేషనింగ్ వ్యవస్థలో అదనపు వస్తువులు చేర్చాలని కోరుతూ వుంటారన్నారు. అందుబాటు ధరల్లో మరింత ఎక్కువగా ప్రోటీన్ అందేలా, పోషకాహారం సమకూరేలా చూడాలని భావిస్తు వుంటారని ఆ లేఖ పేర్కొంది. అయినా సరే, ఎవరూ కూడా కేవలం ఉచిత రేషన్‌లపైనే బతకలేరని చివరగా ఆమె వ్యాఖ్యానించారు.

బైక్‌ను ఢీకొట్టిన ట్రాలీ ఆటో.. | ఇద్దరు సీఆర్‌పీలు మృతి



నవతెలంగాణ-చేగుంట

ఓ ట్రాలీ ఆటో.. బైక్‌ను ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలంలోని చిన్న శివనూర్ గ్రామ శివారులో శుక్రవారం జరిగింది. ఈ రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న రమేష్ నాయక్ (40) అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడ్డ మరో వ్యక్తి ఎర్రం శ్రీనివాస్‌ను(40) ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మరణించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వీరిద్దరూ చేగుంట మానవ వనరుల కార్యాలయంలో సీఆర్‌పీలుగా కొనసాగుతున్నారని తెలిపారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం పెడుతున్న పని ఒత్తిడి కారణంగానే చేగుంట మండలానికి చెందిన ఇద్దరు సీఆర్పీలు రమేష్ నాయక్, ఎర్రోళ్ల శ్రీనివాస్ మృతి చెందారని, వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీఆర్పీ జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గట్టయ్య, రాజు డిమాండ్ చేశారు. రోజువారీ టార్గెట్లు పెడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను మానసికంగా హింసిస్తున్నారని, దాంతో ఒత్తిడికి లోనవుతున్నట్టు తెలిపారు. ఈ విధానాన్ని పూర్తిగా తొలగించి సీఆర్పీలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.



యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ప్రమాదం | ఐదుగురు కార్మికులకు తీవ్ర గాయాలు

నవతెలంగాణ- దామరచర్ల

నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలో ఉన్న యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో శుక్ర వారం వేడి బూడిద పడి ఐదుగురు కార్మికులకు తీవ్రగాయాలయ్యాయి. కార్మికులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వీర్లపాలెం వద్ద గల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ప్లై యాష్ యంత్రం జామ్ అయింది. దానిని కార్మి కులు క్లీన్ చేస్తుండగా వేడిగా ఉన్న బూడిద వారిపై పడింది. దాంతో ఐదుగురికి తీవ్ర గాయాల య్యాయి. వీర్లపాలెం గ్రామ పంచాయతీకి చెందిన రూపావత్ లింగ, దుబ్బతండా గ్రామ స్తులు పాతులోతు రూప్లా, రూపావత్ హతీరాం, వీరప్పగూడెం గ్రామస్తుడు సైదా, అడవిదేవుల పల్లి గ్రామస్తుడు వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాల య్యాయి. వారిని మిర్యాలగూడ ఏరియాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిరిగినట్టు విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. తక్షణమే విచారణ నిర్వహించి సంబంధిత కాంట్రాక్టర్‌తో పాటు అధికారులపై చర్యలు తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం

- గ్రానైట్ డీసీఎం వ్యాను బోల్తా
- ఇద్దరు మృతి, ఎనిమిది మందికి తీవ్రగాయాలు
- ఖమ్మం జిల్లాలో ఘటన



నవతెలంగాణ-ముదిగొండ

జాతీయ రహదారిపై గ్రానైట్ నాపరాళ్ల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్ బోల్తా పడిన ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మం జిల్లా ముదిగొండ శివారు హైవేపై జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం సమీపాన ఉన్న ఓ గ్రానైట్ పరిశ్రమ నుంచి శుక్రవారం ఉదయం గ్రానైట్ నాపరాళ్లను డీసీఎం వ్యాన్‌లో లోడ్ చేసుకొని, డ్రైవర్‌తో సహా 10 మంది కూలీలు ఖమ్మం-కోదాడ హైవేపై, ఖమ్మం వైపు బయలుదేరారు. ముదిగొండ డీసీఎం ఓవర్ లోడ్ వల్ల శివారు ప్రాంతంలో టైరు వీల్ తిరగడంతో వాహనం పల్టీ కొట్టింది. గ్రానైట్ రాళ్ల కూలీల మీద పడటంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. మృతి చెందిన వారిలో గుండాల మండలం కొమరారం గ్రామానికి చెందిన బానోతు హుస్సేన్ (30), డోర్నకల్ మండలం అన్నారం గ్రామానికి చెందిన గుగులోతు వీరన్న (28) ఉన్నారు. కూలీలు రామదాసు, కర్ణ, అశోక్, కుమార్, సుందర్, రవి, వినోద్‌లకు కాళ్లు, చేతులు సహ శరీర భాగాలకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ముదిగొండ పోలీసులు సంఘటనా స్థలానికి చేరు కొని క్షతగ్రాతులను 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్ప త్రికి తరలించారు. వీరందరూ ఖమ్మం ఇండస్ట్రీయల్ ఏరియాలో నివాసం ఉంటూ కూలీలుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ రోడ్డు ప్రమాదం వారి కుటుంబాల్లో విషాదం నింపింది. ఘటనపై కేసు నమోదు చేసినట్టు సీఐ ఓ మురళి తెలిపారు.

డీసీఎం బోల్తా ఘటనపై మంత్రి పొంగులేటి, ఎంపీ రామసహాయం దిగ్భ్రాంతి

డీసీఎం బోల్తా పడిన ఘటనపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన కుటుంబాలకు సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులను ఆదేశించారు.

బరాబర్ సుంకాలేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. అక్రమ వలసలు కూడా తమ మధ్య చర్చకు వచ్చాయని, ఇవి కేవలం భారత్‌కే పరిమితం కాలేదని మోడీ చెప్పారని అన్నారు. మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు తామిద్దరం కృషి చేస్తామని తెలిపారు.

వాణిజ్య లోటును పూడ్చుకుంటాం

చమురు, గ్యాస్ అమ్మకాలతో వాణిజ్య లోటును సులభంగా పూడ్చుకోగలమని ట్రంప్ అన్నారు. దీనిపై తాను, మోడీ ఓ ముఖ్యమైన ఒప్పందం కుదుర్చుకున్నామని ఆయన చెప్పారు. భారత్‌కు చమురు, గ్యాస్ సరఫరా చేసే ప్రపంచ దేశాల జాబితాలో అమెరికాది ప్రథమ స్థానం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 'భారత్‌తో అమెరికా వాణిజ్య లోటు సుమారు 100 బిలియన్ డాలర్లకు చేరింది. గత నాలుగు సంవత్సరాల కాలంలో చోటుచేసుకున్న అసమానతలపై చర్చించి పరిష్కారాన్ని సాధించాలని నేను, మోడీ అంగీకారానికి వచ్చాం. వీటిపై ఇప్పటికే చర్చించి ఉండాల్సింది. కానీ అలా జరగలేదు' అని ట్రంప్ వివరించారు.

2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు...అంటే 500 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని మోడీ వివరించారు. పరస్పర ప్రయోజనకర వాణిజ్య ఒప్పందంపై రెండు దేశాల బృందాలు త్వరలోనే అంగీకారానికి వస్తాయని చెప్పారు. ఇంధన భద్రత కోసం చమురు, గ్యాస్ వాణిజ్యంపై దృష్టి సారిస్తామని, ఇంధన మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు అణు ఇంధనాన్ని కూడా పెంచుతాయని అన్నారు. చిన్న మాడ్యులర్ రియాక్టర్లపై సహకారాన్ని పెంచుకునే విషయంపై కూడా ట్రంప్‌తో చర్చించానని తెలిపారు. కాగా అణు సహకారంపై ట్రంప్ కూడా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దీనివల్ల లక్షలాది మంది భారతీయులకు సురక్షితమైన, స్వచ్ఛమైన విద్యుత్ అందు బాటు ధరలో లభిస్తుం దని చెప్పారు.

ఉగ్రవాదంపై ఉమ్మడి పోరు

ఉగ్రవాదంపై పోరు విషయంలో భారత్, అమెరికా దేశాలు కలిసి కట్టుగా వ్యవహరి స్తాయని మోడీ చెప్పారు. సీమాం తర ఉగ్రవాదాన్ని అంతం చేయాలంటే పటిష్ట చర్యలు అవసరమని తాము అభిప్రాయ పడ్డామని అన్నారు. ముంబయి ఉగ్ర దాడి నిందితుడైన రాణా అప్పగింత అంశాన్ని ఆయన ప్రస్తావించారు. భారత్‌లో మారణకాండ సాగించిన వ్యక్తిని అప్పగిస్తున్నందుకు ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలిపారు.




సాంకేతిక సహకారంపై...

వ్యూహాత్మకమైన, విశ్వసనీయ భాగస్వామిగా భారత రక్షణ సన్నద్ధతల్లో అమెరికా ముఖ్య పాత్ర పోషిస్తోందని మోడీ తెలిపారు. రాబోయే కాలంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉమ్మడిగా అభివృద్ధి చేసుకుంటామని, ఉత్పత్తి చేస్తామని, బదిలీ చేస్తామని చెప్పారు. 21వ శతాబ్దం సాంకేతికతోనే ముడిపడి ఉన్నదని అంటూ ఈ రంగంలో రెండు దేశాల మధ్య సన్నిహిత సహకారం ప్రజాస్వామిక విలువలపై విశ్వాసంతో, నూతన దిశగా ముందుకు సాగుతోందని అన్నారు. ఖనిజాలు, ఔషధాల విషయంలో బలమైన సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేసుకునే విషయంపై రెండు దేశాలు దృష్టి సారిస్తాయని మోడీ చెప్పారు. అంతరిక్ష సహకారం విషయంలో కూడా తమ మధ్య సన్నిహిత సహకారం నెలకొని ఉన్నదని అంటూ ఇస్రో, నాసా మధ్య పరస్పరం మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. భారతీయ ఉపగ్రహంపై రెండు దేశాలు త్వరలోనే అంతరిక్షంలోకి వెళతాయని చెప్పారు.

చైనాతో సంబంధాలపై...

భారత్-చైనా సరిహద్దులో ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయని, అవి ఆగిపోవాల్సిన అవసరం ఉన్నదని మోడీ చెప్పారు. ఈ విషయంలో తన సాయం అవసరమైతే చేస్తానని అన్నారు. 'మాకు చైనాతో మంచి సంబంధాలు ఉంటాయని అనుకుంటున్నాను. కోవిడ్ వచ్చే వరకూ దేశాధ్యక్షుడు క్సీతో బాగానే సంబంధాలు నెరిపాను. అప్పటి వరకూ మేము బాగా సన్నిహితంగా గడిపాం. ప్రపంచంలో చైనా ఓ ముఖ్య పాత్ర పోషిస్తోందని నేను విశ్వసిస్తున్నాను. ఉక్రెయిన్, రష్యా యుద్ధ నివారణకు వారు కృషి చేసి ఉండవచ్చు. భారత్-చైనా సరిహద్దులో ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. అవి కొనసాగుతూనే ఉన్నాయని అనుకుంటున్నా. ఈ విషయంలో నేనేమైనా చేయగలిగేది ఉంటే చేస్తా. ఎందుకంటే ఘర్షణలు ఆగిపోవాలి. అవి చాలా కాలం నుండి కొనసాగుతున్నాయి. హింస జరుగుతోంది. చైనా, రష్యా, భారత్...మేమందరం కలిసి ముందుకు సాగగలం. అది చాలా ముఖ్యం' అని మోడీ వివరించారు. అంతకుముందు ట్రంప్ ఓవల్ కార్యాలయంలో మోడీని కలిశారు. ఆయనతో కరచాలనం చేసి హత్తుకున్నారు. ప్రధాని మోడీని 'దీర్ఘకాల స్నేహితుడి'గా అభివర్ణించారు.



అంతర్జాతీయ అంశాలపై...

ఇండో-పసిఫిక్‌లో శాంతి, సుస్థిరత, సౌభాగ్యాన్ని పెంచేందుకు భారత్, అమెరికా కలసికట్టుగా కృషి చేస్తాయని మోడీ తెలిపారు. ఈ విషయంలో క్వాడ్ ప్రత్యేక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. భారత్-మధ్య ప్రాచ్య యూరప్ ఆర్థిక కారిడార్‌ను కూడా ఆయన ప్రస్తావిస్తూ ఈ ప్రాంతంలో ఆర్థిక కారిడార్ల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. చరిత్రలోనే అతి పెద్ద వాణిజ్య రహదారిని నిర్మించేందుకు సహకరిస్తామని తెలిపారు. ఈ రహదారి భారత్ నుండి ఇజ్రాయిల్, ఇటలీ, అమెరికా వరకూ ఉంటుందని చెబుతూ ఓడరేవులు, రైల్వేలు, సముద్ర గర్భంలోని కేబుల్స్ ద్వారా భాగస్వాములను కలుపుతామని వివరించారు. దీనిపై పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుందని అన్నారు.

అమెరికా చేతిలో భారత్

ఆయుధాలు, యుద్ధ విమానాల కొనుగోలుకే రూ.కోట్లు వ్యయం

రక్షణ రంగం మీదే దృష్టి.. మిగతా రంగాలపై చిన్న చూపు

యూఎస్‌లో పాలన ఎవరిదైనా.. మోడీ సర్కారు తీరు మాత్రం ఇదే

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ సర్కారు అమెరికా చేతిలో పావుగా మారుతున్నది. 2014లో కేంద్రంలో తొలిసారిగా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి.. అమెరికా నుంచి ఆయుధాలు, యుద్ధవిమానాల వంటివి కొనుగోలు చేయటంపైనే ప్రధానంగా దృష్టిని సారించింది. ఇందుకోసం వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేస్తోంది. రక్షణ రంగం పైనే దృష్టి పెట్టిన మోడీ సర్కారు.. ఇతర రంగాలను విస్మరిస్తున్నదని ఆరోపణలూ వినిపిస్తున్నాయి.

వాస్తవానికి అమెరికా ఆర్థిక వ్యవస్థ ఆధారపడేది ఆయుధ ఎగుమతుల పైనే. ప్రపంచంలో ఏవేని రెండు దేశాల మధ్య యుద్ధం జరిగే పరిస్థితి ఏర్పడినా, ఘర్షణ వాతావరణం వచ్చినా..అక్కడ వెంటనే అమెరికా దిగిపోతుంది. ఆయా దేశాల సార్వభౌమత్వానికి భంగం కలిగేలా వ్యవహరిస్తుంది. ఉక్రెయిన్-రష్యా, ఇజ్రాయిల్-పాలస్తీనా.. వంటి దేశాల మధ్య యుద్ధాలు జరుగుతున్న పరిస్థితుల్లో అమెరికా వ్యవహరించిన తీరే ఇందుకు నిదర్శనం. భారత్-పాక్ దేశాల విషయంలోనూ అమెరికా ఈ విధంగానే వ్యవహరిస్తోంది. రెండు దేశాలకూ ఆయుధాలను విక్రయిస్తూ తన ఖజానాను నింపుకుంటోంది. కేంద్రంలో మోడీ సర్కారు వచ్చిన తర్వాత భారత్ అమెరికా ఊబిలో చిక్కుకున్నది. ముఖ్యంగా, పొరుగు దేశాలతో భారత్‌కు సఖ్యత లేదనే చెప్పాలి. ప్రత్యేకించి, పాక్‌ను.. మోడీ ప్రభుత్వం శత్రుదేశంగా చూపెడుతూ ఎన్నికలలో రాజకీయంగా లబ్ది పొందుతోంది. అమెరికాకు అన్ని రంగాల్లో పోటీ ఇస్తున్న చైనాతో పాటు బంగ్లాదేశ్, శ్రీలంక, మాల్దీవులతోనూ భారత్‌కు సరైన సంబంధాలు లేవనే చెప్పాలి. ఇవన్నీ అమెరికాకు కలిసి వచ్చే అంశాలు అని విశ్లేషకులు చెప్తున్నారు. ఇటీవల అమెరికా పర్యటనలో బంగ్లాదేశ్ విషయాన్ని ప్రధాని మోడీకే వదిలేస్తున్నానన్న ట్రంప్ వ్యాఖ్యలూ చర్చనీయాంశంగా మారాయి.



అమెరికాలో అధ్యక్షుడిగా ఎవరు వచ్చినా.. ఆయుధాల కొనుగోలు విషయంలో మోడీ సర్కారు తీరు మారలేదు. ఒబామా నుంచి ట్రంప్ వరకు.. ఇలా అమెరికా నుంచి ఆయుధాలు, యుద్ధ విమానాలను భారత్ సమకూర్చుకున్నది. స్టాక్‌హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రి) ప్రకారం.. 2019-23 మధ్య ప్రపంచంలోనే భారత్(9.8 శాతం) అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుగా ఉన్నది. ఇందులో 13 శాతం యూఎస్ వాటానే కావటం గమనార్హం.

విశ్వగురు ఊహించలే..

నిన్న మొన్నటి వరకూ ఏదేశమేగినా.. ఎందుకాలిడినా..అంతా నా మాటే అనుకుంటున్న (విశ్వగురు) ప్రధాని మోడీకి యూఎస్ పర్యటన నిరాశజనకంగా మారిందనే చర్చ నడుస్తోంది. అమెరికా అధ్యక్షుడైన ట్రంప్ స్వరం గతానికి భిన్నంగా వ్యక్తం కావటంతో ప్రధాని మోడీకి చిరునవ్వే కరువైనట్టు స్పష్టమైంది. ఫ్రాన్స్ టూర్ నుంచి యూఎస్‌లో మోడీ అడుగుపెడుతున్నారు కదా... మా సమస్యలు పరిష్కారమవుతాయని అక్కడి భారతీయులు భావించారు. హెచ్ 1 బీ వీసాలు, అక్రమ వలసలపై ట్రంప్‌తో మోడీ మాట్లాడుతారను కున్నారు. కానీ ట్రంప్ మోడీకి ఎలాంటి ఛాన్స్ ఇవ్వకుండా పలు అంశాలపై తెగేసిచెప్పటంతో ప్రధాని షాక్‌కు గురైనట్టు ఇండో అమెరికన్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. భారత్‌పై సుంకాల విషయం గురించి..బారాబర్ సుంకాలేస్తామని ట్రంప్ తెగేసిచెప్పటం గమనార్హం.

అక్రమవలసదారులంటూ భారతీయులను రెండు విడుతలుగా పంపిన అమెరికా, ఇంకా ఏరివేత కార్యక్రమాన్ని విస్తృతం చేసింది. అటు యూకే సైతం అక్రమవలసలపై వేటు వేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో మోడీ నోరువిప్పుతారని అక్కడి భారతీయులు ఆసక్తిగా ఎదురుచూశారు. ట్రంప్‌పై వత్తిడి తేలేమని గమనించిన మోడీ .. అక్రమ వలసదారులను భారత్‌కు తీసుకు వస్తామని చెప్పుకోక తప్పలేదు. ఎలాగో అమెరికాలో ఆందోళనలో ఉన్న భారతీయుల సంగతి పట్టించు కోవటంలేదు కాబట్టి.. కనీసం అదానీ ఇష్యూ మాట్లాడితే సరిపోతుందనేలా టూర్ సెట్ అయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



భారత్‌తో ఉన్న ఆయుధడీల్ పై సంతకాలు చేశాక..ఓ అల్బమ్‌ను మోడీ చేతిలో పెట్టి..ఇక సెలవ్ అన్నట్టుగా ట్రంప్ వ్యవహరించిన తీరు బీజేపీ వర్గాల్లో సైతం చర్చనీయాంశంగా మారింది.

అదానీపై కేసు గురించి ట్రంప్‌తో చర్చించారా?

మిత్రుడి అవినీతిని కప్పిపుచ్చే చర్యగా ప్రతిపక్షాల

వాషింగ్టన్ : దేశాన్ని ఒక కుదుపు కుదిపేసిన అదానీ గ్రూపు సంస్థల కుంభకోణంపై అమెరికాలో నమోదైన కేసు గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దాటవేత వైఖరి అవలంబించారు. అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్‌తో జరిగిన సమావేశంలో గౌతమ్ అదానీ కేసును ప్రస్తావించారా? ఈ కేసులో చర్యలు తీసుకోవాలని ఆయనను అడిగారా?'....అని చర్చల అనంతరం జరిగిన మీడియా సమావేశంలో మోడీని ఒక జర్నలిస్టు ప్రశ్నించగా..ద్వైపాక్షిక చర్చల్లో వ్యక్తిగత అంశాలు ప్రస్తావనకు రావని దాటవేశారు. 'ఆసియాలోని సంపన్నుల్లో ఒకరు, ప్రధాని నరేంద్ర మోడీకి సన్నిహితుడిగా భావించే అదానీకి వ్యతిరేకంగా అమెరికాలో దాఖలైన కేసు గురించి ట్రంప్‌తో చర్చించారా అని మిమ్మల్ని అడగవచ్చా? ఈ కేసు విషయంలో చర్య తీసుకోవాల్సిందిగా మీరు అధ్యక్షుడిని అడిగారా?' అని ఆ విలేకరి ప్రధానిని ప్రశ్నించారు. దీనికి మోడీ స్పందిస్తూ 'గౌతమ్ అదానీ వ్యవహారం వ్యక్తిగతమైన అంశం. రెండు దేశాల నేతల మధ్య జరిగే సమావేశంలో అలాంటి వ్యక్తిగత అంశాలు చర్చకు రావు. భారత్ ప్రజాస్వామిక దేశం, వసుధైక కుటుంబం మన సంస్కృతి. ఈ ప్రపంచాన్నం తటినీ ఒక కుటుంబంగా చూస్తాం. ప్రతి భారతీయుడూ నా వారేనని నమ్ముతాం' అని ఇలా ఏవేవో చెప్పుకుంటూ వెళ్లిన మోడీ..ఇరు దేశాల ద్వైపాక్షిక చర్చల్లో వ్యక్తిగత అంశాలు ప్రస్తావనకు రావని ముక్తాయింపు ఇచ్చారు.

అవినీతిని కప్పి పుచ్చుకోవడమే : రాహుల్

విదేశాల్లో అదానీ అవినీతి కప్పిపుచ్చేందుకే మోడీ ఇదంతా చేశారని ప్రతిపక్షాలు విమర్శించాయి. "దేశంలో దీని గురించి ప్రశ్నిస్తే మౌనం, విదేశాల్లో ప్రశ్నిస్తే వ్యక్తిగత అంశం. అమెరికాలో కూడా అదానీ అవినీతిని కప్పిపుచ్చడానికి ప్రధాని ప్రయత్నిస్తున్నారు. మోడీకి మిత్రుడి జేబు నిండడమే జాతి నిర్మాణమైనపుడు దేశ సంపదను దోపిడీ చేస్తూ ఆయన తీసుకునే లంచాలు, ముడుపులు వ్యక్తిగత అంశాలే అవుతాయి." అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. అదానీతో గల స్నేహాన్ని అమెరికాలో మోడీ ప్రదర్శించారని ఆప్ వ్యాఖ్యానించింది. బలవంతంగా పత్రికా సమావేశంలో పాల్గొనాల్సి రావడంతో మోడీకి కోపం, అసహనం పెరిగాయని తృణమూల్ కాంగ్రెస్ వ్యాఖ్యానించింది.

ట్రంప్ రావడంతో పరిస్థితి మారింది

భారత్‌లో సౌర విద్యుత్ కాంట్రాక్టులకు సంబంధించి వెలుగులోకి వచ్చిన 250 మిలియన్ డాలర్ల ముడుపుల కేసు, సెక్యూరిటీల కుంభకోణంలో గౌతమ్ అదానీ, ఆయన వ్యాపార సంస్థకు చెందిన పలువురు ఎగ్జిక్యూటివ్‌లపై అమెరికా అధికారులు గత సంవత్సరం నవంబర్ 20న అభియోగాలు మోపారు. అమెరికా న్యాయ శాఖ మోపిన అభియోగాల్లో గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీ, ఇతర భాగస్వాముల పేర్లు ఉన్నాయి. అమెరికా పెట్టుబడి దారులను అదానీ గ్రూప్ తప్పు దోవ పట్టించిందని, పెద్ద ఎత్తున లాంచాలు ఇవ్వజూపిందని ప్రాసి క్యూషన్ ఆరోపించింది. సౌర విద్యుత్ కాంట్రాక్టులు పొందేం దుకు అదానీ, ఆయన భాగస్వా ములు 265 మిలియన్ డాలర్లు (సుమారు రూ.2,236 కోట్లు) ఇచ్చేందుకు కుట్ర పన్నారని వివరించింది. అయితే ఈ ఆరో పణలను అదానీ గ్రూప్ తోసి పుచ్చింది. వాటికి ఆధారాలే లేవని తెలిపింది. కాగా జో బైడెన్ అమెరికా అధ్యక్షుడుగా ఉన్నప్పుడు ఈ కేసు నమోదైంది. అయితే ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. అదానీ కేసుకు వర్తించే విదేశీ అవినీతి చర్యల చట్ట నిబంధనల అమలును ట్రంప్ ప్రభుత్వం నిలిపివేసింది. ఆ తర్వాత అదానీపై అభియోగాలు మోపా లన్న అప్పటి బైడెన్ ప్రభుత్వ 'ప్రశ్నించదగిన' నిర్ణయాలను ఆరుగురు అమెరికా కాంగ్రెస్ సభ్యులు విమర్శించారు. వీటిని సమీక్షించాలని కొత్తగా నియమితులైన అటార్నీ జనరల్ పమేలా బాండీని కోరారు.

ముచ్చటగా మూడుసార్లే...

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి ప్రమాణస్వీకారం చేసిన తర్వాత మోడీ ఆ దేశంలో పర్యటించడం ఇదే మొదటిసారి. శ్వేతసౌధంలో నాలుగు గంటల పాటు ఇరువురి మధ్య జరిగిన చర్చల్లో పలు ద్వైపాక్షిక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. పరస్పర ప్రయోజనమున్న ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై వారు చర్చించారు. స్వదేశంలో పాత్రికేయుల సమావేశాలకు ఆమడ దూరంలో ఉండే మోడీ, అమెరికా పర్యటన సందర్భంగా ట్రంప్‌తో కలిసి విలేకరులతో ముచ్చటించారు. గత 16 సంవత్సరాలలో మోడీ విలేకరుల సమావేశానికి హాజరవడం ఇది కేవలం మూడోసారి మాత్రమే. అవన్నీ విదేశీ గడ్డపై జరిగిన సమావేశాలే కావడం గమనార్హం. 2015 నవంబరులో బ్రిటన్ ప్రధాని డేవిడ్ కామెరూన్, 2023 జూన్‌లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, తాజాగా అధ్యక్షుడు ట్రంప్‌తో కలిసి విలేకరులతో ముచ్చటించారు.

2016-25 మధ్య యూఎస్, భారత్ మధ్య చోటు చేసుకున్న పరిణామాలను చూస్తే..

2016
వార్షిక నేషనల్ డిఫెన్స్ ఆథరైజేషన్ యాక్ట్‌లో భారత్‌ను మేజర్ డిఫెన్స్ పార్ట్‌నర్‌గా గుర్తించారు. ఇది భారత్‌కు ఆయుధాల అమ్మకాన్ని వేగవంతం చేస్తుంది.

2017
ఎనిమిదేండ్ల నిష్క్రియాత్మకత తర్వాత క్వాడ్(క్వాడ్రిలాటరల్ సెక్యూరిటీ డైలాగ్) పునరుద్ధరణకు దారి తీసేలా యూఎస్, జపాన్, ఇండియా, ఆస్ట్రేలియాలు మధ్య మనీలాలో చర్చలు జరిగాయి. పసిఫిక్‌లో చైనా ప్రభావాన్ని ఎదుర్కోవటానికి క్వాడ్ అనే ఒక మిలిటరీ కోఆపరేషన్ ఇనిషియేటివ్ ఏర్పాటైంది.

2018
హిందూ, పసిఫిక్ మహాసముద్రాల కనెక్టివిటీ పెరుగుదలను గుర్తిస్తూ యూఎస్ పసిఫిక్ కమాండ్ (యూఎస్‌పీఏసీఓఎం) ను యూఎస్ ఇండో పసిఫిక్ కమాండ్ (యూఎస్ఐఎన్‌డీపీఏసీఓఎం)గా పేరు మారుస్తున్నట్టు మే 30న యూఎస్ డిఫెన్స్ సెక్రెటరీ జేమ్స్ మాటీస్ ప్రకటించారు. ఆసియాపై ఒక వ్యూహాత్మక చర్యలో భాగంగా భారత్‌ను ఆకర్షించేందుకు అమెరికా ఇలా చేసిందన్నది నిపుణుల విశ్లేషణ.

2019
భారత్-పాక్‌ల మధ్య సరిహద్దు ఘర్షణలు చర్చనీయాంశంగా మారాయి. యూఎస్‌తో పాటు ఇతర దేశాల నుంచి ఈరెండు దేశాలకు దశాబ్దాలుగా జరుగుతున్న ఆయుధ వాణిజ్య ప్రభావం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. అదే ఏడాది జమ్మూకాశ్మీర్ ప్రత్యేక హోదాను మోడీ సర్కారు రద్దు చేసి.. పాక్‌తో ఘర్షణ వాతావరణాన్ని సృష్టించింది. పెద్ద ఎత్తున ఆర్మీని దించింది. ఆ ప్రాంతంలో ఇంటర్నెట్ షట్‌డౌన్‌ను విధించింది. ఫోన్ సర్వీసులను నిలిపివేసింది.

2020
ఫిబ్రవరి 25 భారత ప్రధాని మోడీతో న్యూఢిల్లీలో పర్యటించిన అప్పటి అమెరికా అధ్యక్షుడు 3 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధ ఒప్పందాలను ప్రకటించారు. 2017-20 మధ్య భారత్‌కు 7.9 బిలియన్ డాలర్ల విలువైన ఫారిన్ మిలిటరీ సేల్స్(ఎఫ్ఎంఎస్)ను ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ కాంగ్రెస్‌కు తెలిపింది.

2021
హార్పూన్ జాయింట్ కామన్ టెస్ట్ సెట్ (జేసీటీఎస్)ను 82 మిలియన్ డాలర్లకు అమ్మే అవకాశమున్నదని బైడెన్ యంత్రాంగం కాంగ్రెస్‌కు ఆగస్టు 2న తెలిపింది. ఆరు పీ-8ఐ పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్, సంబంధిత ఎక్విప్‌మెంట్‌ను 2.42 బిలియన్ డాలర్ల అంచనా ధరకు విక్రయించనున్నట్టు వివరించింది.

2022
సెక్యూరిటీ అసిస్టెన్స్ మానిటర్ క్రోడీకరించిన సమాచారం ప్రకారం.. 2022 ఆర్థిక సంవత్సరంలో అమెరికా నుంచి భారత్‌కు డెలివరీ అయిన మొత్తం ఆయుధాల విలువ 564 మిలియన్ డాలర్లకు పైనే. రష్యా ఆయుధాలపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు భారత్‌కు అమెరికా 500 మిలియ్ డాలర్ల మిలిటరీ ఎయిడ్ ప్యాకేజీని ప్రకటించింది.

2023
జీ20 సమ్మిట్‌లో భాగంగా భారత్‌లో పర్యటించిన బైడెన్.. జీఈ ఎఫ్-414 జెట్ ఇంజిన్ల ఉత్పత్తి కోసం చర్చలు, రెండో మాస్టర్ షిప్ రిపేర్ అగ్రిమెంట్ ముగింపును తెలియజేశారు. 31 ఎంక్యూ-9బీ కొనుగోలు అభ్యర్థన లేఖ జారీని ఆయన ఆహ్వానించారు.
జూన్ 23 మోడీ వాషింగ్టన్‌లో పర్యటించారు. భారత్‌లో జీఈ ఎఫ్-414 జెట్ ఇంజిన్లు, హెచ్ఏఎల్ యుద్ధ విమానం ఎంకె 2 తయారీకి ఒప్పందాలను ప్రకటించారు.

2024
30 రేడియో సిస్టమ్‌లు, ఇతర ఎక్విప్‌మెంట్, ఎంహెచ్-60ఆర్ మల్టీ మిషన్ హెలికాప్టర్‌కు సపోర్ట్‌ను 1.17 బిలియన్ డాలర్లకు విక్రయించే అవకాశమున్నదని కాంగ్రెస్‌కు బైడెన్ యంత్రాంగా తెలిపింది. అలాగే, 175 మిలియన్ డాలర్ల విలువ చేసే 53 ఎంకె54ఎంఓడీ0 లైట్‌వెయిట్ టోర్పెడోలను విక్రయించనున్నట్టు వివరించారు.



2025
ప్రధాని మోడీతో సమావేశం అనంతరం.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. భారత్‌కు యూఎస్ మిలిటరీ సేల్స్‌ను పెంచుతుందని చెప్పారు. ఆశ్చర్యకరంగా.. భారత్‌కు ఎఫ్-35 యుద్ధ విమానాలు ఆఫర్ చేశారు.

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

- రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి నిధులు కేటాయించాలి
- మిర్చి రైతులకు ధర లేక నష్టపోతున్నారు
- క్వింటాకు కనీసం రూ.25 వేలు అమలు చేయాలి
- ఫార్మా రైతులపై ప్రభుత్వ ప్రతాపం వద్దు

పేదలకు ఇండ్ల స్థలాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేసి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి అధిక నిధులు కేటాయించాలని కోరారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరి స్మారక కేంద్రంలో నిర్వహించిన సీపీఐ(ఎం) జిల్లా విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ జనాభాకు అనుగుణంగా 42 శాతం రిజర్వేషన్లపై వచ్చే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు పెట్టి అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం వెంటనే ఆ దిశగా ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. తద్వారా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.



రాష్ట్రంలో మిర్చి రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.25 వేలు పలికిన క్వింటా మిర్చి ధర ప్రస్తుతం మార్కెట్‌లో రూ. 10 వేలకు పడిపోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కనీసం క్వింటాకు రూ.25వేలు చెల్లించి మిర్చి రైతులను ఆదుకోవాలన్నారు. రంగారెడ్డి జిల్లాలో అమలు చేస్తున్న ఫార్మా కోసం మరింత భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంటున్నదనీ, రైతుల అంగీకారం లేకుండా భూములు తీసుకునే హక్కు సర్కారుకు లేదని తెలిపారు. ఫార్మాను రద్దు చేస్తామని గత ఎన్నికల్లో చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని రద్దు చేయకపోగా, ఇప్పుడు భూసేకరణ చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దనీ, ఒకవేళ కాదని ప్రభుత్వం ముందుకు సాగితే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పేదలకు ఇండ్ల స్థలాల కోసం ఇచ్చిన భూములను రామోజీ తన ఆధీనంలో పెట్టుకొని పేదలను అడ్డుకుంటున్నారనీ, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని పేదలందరికీ ఇండ్ల స్థలాలు చూపించాలని తెలిపారు. లేకుంటే ఆ భూముల్లో ఎర్రజెండాలు పాతి అక్కడే గుడిసెలు వేసి నివాసం ఉంటామన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లను వెంటనే మంజూరు చేయాలని తెలిపారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి అధిక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులను రద్దు చేశారన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ అమలు చేస్తామని గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసిందనీ, వెంటనే దానిని నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. అనేక హామీల అమలు కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పార్టీ నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పి. యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్, సామెల్, రామ్‌చందర్, నరసింహ, కందుకూరి జగన్, జగదీశ్, జిల్లా నాయకులు జంగయ్య అలంపల్లి నరసింహ, బుగ్గ రాములు, జగన్, బాలరాజ్, దేవేందర్, పెంటయ్య, శేఖర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ

రాజకీయపరమైన స్వతంత్రం ఎంత ఉన్నా
అది ఆకలితో అలమటించే వారిని సంతోషపెట్టలేదు - విఐ లెనిన్

శనివారం 15 ఫిబ్రవరి 2025
www.navatelangana.com

సంపాదకీయం

కార్పొరేట్లకు రెడ్ కార్పెట్



చట్టాలన్నీ ఉన్నోళ్ల చుట్టాలేననేది మనం తరచూ వింటున్న మాటే కాదు, పదే పదే నిజమవుతున్న మాట కూడా. అయితే చీకట్లో దీపంలా ఈ చట్టాలను ప్రజాపక్షం చేస్తున్న ఘటనలూ లేకపోలేదు. కానీ ఇలాంటివి బహు అరుదు. ప్రగతిశీల, వామపక్ష శక్తుల పాలనలో తప్ప బూర్జువా పార్టీల పాలనలో వాటిని చూడలేం. ఇటీవల వెలువడిన తాజా వార్తలు కొన్ని దీన్ని మరోసారి రుజువు చేస్తున్నాయి. అందులో మొదటిది.. అమెరికాలో విదేశీ అవినీతి కార్యకలాపాల చట్టం (ఎఫ్‌సీపీఏ-1977) అమలును నిలిపివేయడం. రెండవది, ఒక సౌర విద్యుత్ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం ఏకంగా సరిహద్దు భద్రతా నిబంధనలనే సవరించడం. మూడవది, శ్రీలంకలోని పవన విద్యుత్ ప్రాజెక్టుల నుంచి అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ వైదొలగడం. ఈ మూడు వార్తలూ భారత అపర కుబేరుడు అదానీకి సంబంధించినవే కావడం గమనార్హం.

సౌర విద్యుత్ కాంట్రాక్టుల కోసం ఆంధ్రా, ఒడిశా, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, జమ్మూకశ్మీరు అధికారులకు అదానీ గ్రీన్ సంస్థ రూ.2,100 కోట్లు ముడుపులుగా ఇచ్చిందని.. లంచాల వ్యతిరేక చట్టాలకు కట్టుబడి ఉంటామని ఇచ్చిన హామీని అతిక్రమించి ఈ ప్రాజెక్టుల కోసం అమెరికాలో రుణసేకరణ చేసిందని.. గతేడాది నవంబరులో జో బైడెన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అమెరికా న్యాయశాఖ గుర్తించడం, ఆమేరకు తమ విదేశీ అవినీతి కార్యకలాపాల చట్టం కింద కేసులు నమోదు చేయడం తెలిసిందే. కానీ అమెరికా తాజా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్..ఏ చట్టం కింద అదానీని ప్రాసిక్యూట్ చేయాల్సివుందో ఆ చట్టం అమలునే ఇప్పుడు నిలిపివేశారు. ఈ కేసులతో స్వదేశంలో, విదేశాల్లో తీవ్ర ఇరకాటంలో పడిన అదానీకి భారీ ఊరట కలిగించారు. సరిగ్గా మోడీ అమెరికా పర్యటనకు ముందే ఈ చర్య చోటుచేసుకోవడంతో.. ఇది ప్రధాని ఆప్తమిత్రుడైన అదానీ కోసం ట్రంప్ ఇచ్చిన "అడ్వాన్స్ గిఫ్ట్" అంటూ వెల్లువెత్తుతున్న విమర్శలు సత్యదూరమేమీ కాదు. నరేంద్ర దామోదర మోడీ, డొనాల్డ్ ట్రంపుల "అపూర్వ మైత్రి" కారణంగా అదానీకి లభించిన ఈ ఉపశమనం... పొట్టకూటికోసం అమెరికా వెళ్లిన అసంఖ్యాకులైన వలసదారులకు లభించకపోవడం వైచిత్రి!

> కేవలం ఒక వ్యక్తి కోసం చట్టాల అమలును నిలిపివేయడం, భద్రతా నిబంధనలనే సవరించడం సంపన్నుల కోసం తప్ప సామాన్యుల కోసం సాధ్యమవుతుందా? మిశ్రమ ఆర్థికవ్యవస్థతో మొదలైన స్వతంత్ర భారత ప్రస్థానం.. కార్పొరేట్లకు రెడ్ కార్పెట్ స్వాగతాలు పలికే దశకు చేరుకుంది. దేశానికి కీలకమైన రంగాల్లో ఒకప్పుడు ప్రభుత్వమే కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు ప్రపంచీకరణ, సరళీకరణ పేరుతో పూర్తిగా ఆ కాడిని పక్కన పడేశాక బడా కార్పోరేట్లదే రాజ్యమైపోయింది. కోటానుకోట్ల పెట్టుబడులతో దేశ ఆర్థికవ్యవస్థను, ప్రభుత్వాలనే శాసించే స్థాయికి అవి విస్తరించాయి.

ఇదిలావుంటే భారత ప్రభుత్వమేమైనా తక్కువతిందా... ఇదే అదానీకి చెందిన సౌర విద్యుత్ ప్రాజెక్టు కోసం సరిహద్దు భద్రతా నిబంధనలనే సవరించేసింది! ఈ విషయమై 'గార్డియన్' పత్రిక ఓ కథనాన్ని ప్రచురించింది. అదానీ సంస్థ ప్రపంచంలోనే అతిపెద్ద సౌర విద్యుదుత్పత్తి ప్లాంటును గుజరాత్ లోని ఖావ్‌డాలో నిర్మిస్తోంది. 2020 లో ప్రధాని మోడీ స్వయంగా ఈ ప్రాజెక్టును ఆవిష్కరించారు. అయితే, రక్షణ శాఖ నిబంధనల ప్రకారం దేశసరిహద్దు నుంచి పది కిలోమీటర్ల వరకు ఎలాంటి భారీ ప్రాజెక్టులు, నిర్మాణాలు, రోడ్లు నిర్మించడానికి వీల్లేదు. కానీ ఈ ఖావ్‌డా ప్రాజెక్టు పాకిస్థాన్ సరిహద్దుకు కేవలం కిలోమీటరు దూరంలోనే ఉంది. అయినప్పటికీ అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాలే ఉండటంతో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అనుమతులను, భూములను కేటాయించటమేగాక.. కఠినమైన జాతీయ భద్రతా నిబంధ నలను కూడా సవరించాయని 'గార్డియన్' తన కథనంలో పేర్కొంది. ఇలా కేవలం ఒక వ్యక్తి కోసం చట్టాల అమలును నిలిపివేయడం, భద్రతా నిబంధనలనే సవరించడం సంపన్నుల కోసం తప్ప సామాన్యుల కోసం సాధ్యమవుతుందా? మిశ్రమ ఆర్థికవ్యవస్థతో మొదలైన స్వతంత్ర భారత ప్రస్థానం.. కార్పొరేట్లకు రెడ్ కార్పెట్ స్వాగతాలు పలికే దశకు చేరుకుంది. దేశానికి కీలకమైన రంగాల్లో ఒకప్పుడు ప్రభుత్వమే కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు ప్రపంచీకరణ, సరళీకరణ పేరుతో పూర్తిగా ఆ కాడిని పక్కన పడేశాక బడా కార్పోరేట్లదే రాజ్యమైపోయింది. కోటానుకోట్ల పెట్టుబడులతో దేశ ఆర్థికవ్యవస్థను, ప్రభుత్వాలనే శాసించే స్థాయికి అవి విస్తరించాయి. ఈ తిమింగలాల ధాటిని తట్టుకుని నిలబడగల దమ్మూధైర్యం ప్రభుత్వాలకు లేకపోగా వారి కనుసన్నల్లో మెలుగుతూ వారి అనుకూల విధానాలతో "జీ హుజూర్" అంటున్నాయనడానికి ఇవి తార్కాణాలు.

ఇక మూడవది ఇందుకు భిన్నమైనది. శ్రీలంకలోని పవన విద్యుత్ ప్రాజెక్టుల నుంచి వైదొలుగుతున్నట్టు అదానీ గ్రూపు వెల్లడించింది. లంచాలు ముట్టజెప్పి విద్యుత్ ఒప్పందాలు చేసుకుందని అదానీ గ్రూపుపై అమెరికాలో కేసులు నమోదవ డమేగాక, ఈ ప్రాజెక్టుల కోసం భారత ప్రధాని మోడీ గత శ్రీలంక ప్రభుత్వాలను పరోక్షంగా ప్రభావితం చేశారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ దేశ నూతన అధ్యక్షుడు, వామపక్ష నేత దిసనాయకే ప్రభుత్వం అదానీ సంస్థతో విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు ప్రకటించింది. అవినీతిని నిర్మూలించి, దేశాన్ని వృద్ధి పథంలో నడిపిస్తాననే హామీకి అనుగుణంగా అదానీ ప్రాజెక్టులపై సమీక్ష ప్రారంభించింది. ఇది అదానీ గ్రూప్‌నకు ఊహించని భారీ ఎదురుదెబ్బ. అందుకే అదానీ గ్రూపు తాజాగా శ్రీలంకలో విద్యుత్ ప్రాజెక్టుల నుంచి వైదొలగాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. అయినా అదానీ గ్రూప్ కంపెనీలు ప్రతిపాదిస్తున్న ఖర్చులో దాదాపు మూడింట రెండొంతుల ధరకే చిన్నచిన్న పునరుత్పాదన ఇంధన సంస్థలు విద్యుత్తును అందిస్తుంటే.. అదానీతో అంటకాగడానికి అదేమీ మోడీ సర్కారు కాదు కదా..! ప్రజాపక్షం వహించే ఏ ప్రభుత్వమూ అలా చేయదని శ్రీలంక ప్రభుత్వం నిరూపించింది. చట్టాలు అసంఖ్యాకులైన ప్రజల ప్రయోజనం కోసమా? లేక గుప్పెడుమంది పెట్టుబడిదారుల కోసమా? అన్నది వాటిని ఉపయోగించే పాలకపార్టీల వర్గస్వభావాన్ని, విధానాలను బట్టి ఉంటుందనడానికి ఇదో నిదర్శనం.

కార్మికవర్గం - కార్మికవర్గ పార్టీ



డా॥ కె.హేమలత

మోడీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం 2025 ఏప్రిల్‌లో కార్మిక కోడ్(లేబర్‌కోడ్)లను ప్రకటించేందుకు ఏర్పాట్లు ప్రారంభించింది. 2019లో రెండోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం వెంటనే "కార్మిక చట్టాల సంస్కరణలను"దాని అత్యంత ప్రాధాన్యతలలో ఒకటిగా గుర్తించింది. ప్రస్తుతం ఉనికిలో ఉన్న 29 కార్మిక చట్టాల్ని నాలుగు లేబర్‌కోడ్‌లుగా విలీనం చేసి, తనకున్న ఆధిక్యతనుపయోగించి 2019-20లో పార్లమెంట్‌లో వాటిని ఆమోదించింది. కానీ కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక, స్వతంత్ర అఖిల భారత సమాఖ్యలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కార్మిక వర్గ తీవ్ర ప్రతిఘటన కారణంగా, ప్రభుత్వం, లేబర్‌కోడ్‌లను ప్రకటించి, ఇప్పటికీ అమలు చేయలేకపోయింది. మూడోసారి అతితక్కువ పార్లమెంట్ స్థానాలతో అధికారంలోకి వచ్చినప్పటికీ, మోడీ ప్రభుత్వం లేబర్‌కోడ్‌లను అమలును వేగవంతం చేయడానికి ముందుకెళ్తోంది. మోడీ ప్రభుత్వం మనుగడ సాగించడానికి ఊతమిస్తున్న టీడీపీ, జేడీ(యు)లాంటి ప్రాంతీయ పార్టీలు ఈ ప్రభుత్వ చర్యలకు మద్దతిస్తున్నాయి.అందుకే బీజేపీ ప్రభుత్వం కార్మికవర్గ వ్యతిరేకతను విస్మరించి, కార్మికుల ప్రాథమిక హక్కుల్ని కాలరాసే ధైర్యం చేస్తోంది.

"కార్మిక చట్ట సంస్కరణలు" నయా ఉదారవాద విధానాల్లో ఒక ప్రధానమైన భాగమనీ, 1991 కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధానాలను అధికారికంగా అమలు చేసిన నాటినుండి ఇవి ప్రభుత్వ ఎజెండాలో ఉంటున్నాయని గమనించాల్సిన అవసరం ఉంది. కేంద్రంలో వరుసగా ఉన్న కాంగ్రెస్ లేదా బీజేపీ ప్రభుత్వాలు పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాల కోసం కార్మికులు కష్టపడి సాధించుకున్న కార్మిక హక్కుల్ని లేకుండా చేసేందుకు కార్మికచట్టాల్ని సవరించడానికి ప్రయత్నిస్తున్నాయి. యాజమాన్యాలకు "నియామకం, తొలగింపు"ను సులభతరం చేయడానికి, రోజుకు పన్నెండు గంటల వరకు పనిని పెంచడానికి, లేబర్‌కోడ్‌లను అధికారికంగా ప్రకటించడానికి ముందే కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం మినహా, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో పాటు కొన్ని ప్రాంతీయ పార్టీల నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామిక వివాదాల చట్టాన్ని,ఫ్యాక్టరీ చట్టాన్ని సవరించాయి.

కార్మిక చట్ట సంస్కరణలపై వ్యతిరేకత

కేవలం వామపక్ష పార్టీలు మాత్రమే పార్లమెంట్ లోపల, బయట కూడా కార్మిక వ్యతిరేక కార్మిక చట్ట సంస్కరణల్ని, నయా ఉదార వాద విధానాలను వ్యతిరేకిస్తున్నాయి. గడచిన మూడు దశాబ్దాల కాలంలో ఈ విధానాలకు వ్యతిరేకంగా ఉమ్మడి కార్మికోద్యమం నిర్వ హించిన 22 సాధారణ సమ్మెలతో సహా కార్మిక వర్గ పోరాటాలకు, వామపక్షాలు ముఖ్యంగా సీపీఐ(ఎం)అండగా నిలిచాయి.పార్టీ 24వ అఖిల భారత మహాసభల సందర్భంగా ఇటీవలే విడుదల చేయబడిన రాజకీయ ముసాయిదా తీర్మానం, నయా ఉదారవాద పాలనలో పెరిగిన కార్మిక వర్గ దోపిడీని ప్రత్యేకంగా ప్రస్తావించింది."కార్మిక వర్గం కష్టపడి సాధించుకున్న హక్కులపై దాడిని" కూడా అది గుర్తించింది. అదే విధంగా ఐక్య కార్మిక సంఘాల పోరాటబలంతో అపఖ్యాతి పాలైన నాలుగు లేబర్ కోడ్ల అమలు నిలిచి పోయినప్పటికీ,మోడీ ప్రభుత్వం, అనేక రాష్ట్ర ప్రభుత్వాలు వాటి విధానాల ద్వారా కార్మికుల నియామకపు విధానాల్లో దోపిడీతో కూడిన మార్పుల్ని ఖాయం చేసిన విషయాన్ని కూడా ముసాయిదా గుర్తించింది. నయా ఉదారవాద విధానాల్లో ప్రధాన భాగంగా ఉన్న ఒప్పంద కార్మిక నియామక (కాంట్రాక్టరైజేషన్ ఆఫ్ లేబర్) ప్రక్రియ, సంఘటిత ఉత్పాదక కార్మిక శక్తిలో కాంట్రాక్ట్ కార్మికుల పెరుగుదలతో తీవ్రమైంది.

కార్మికులకు ప్రమాదకరమైన పని పరిస్థితులకు దారితీసే విధంగా, సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కుపై దాడి చేయడం, ఓవర్ టైం లేకుండా ఏకపక్షంగా పని గంటలు పెంచడం, కనీస వేతనాలను నిర్ధారించకపోవడం ద్వారా సులభ వ్యాపారం పేరుతో బూర్జువా పార్టీల నాయకత్వంలోని ప్రభుత్వాలు పెద్ద పెద్ద కంపెనీలకు ఏ విధంగా మద్దతిస్తున్నాయో రాజకీయ ముసాయిదా తీర్మానం ఎత్తిచూపింది.కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు ఉదాహరణగా: స్కీం వర్కర్లు, అంగన్వాడీ ఉద్యోగులు, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికుల లాంటి వారు ఎక్కువగా మహిళలే ఉన్నారు, కానీ వీరిని కనీసం కార్మికులుగా గుర్తించడం లేదని కూడా రాజకీయ ముసాయిదా తీర్మానం ఎత్తిచూపింది.



సీపీఐ(ఎం) రాజకీయ ముసాయిదా తీర్మానం, కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడానికి, సంఘటిత రంగంలోని కాంట్రాక్ట్ కార్మికులకు, ఉత్పాదక, వ్యూహాత్మక పరిశ్రమల్లోని కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిటీలు, కార్యకర్తలకు పిలుపునిచ్చింది. ప్రత్యామ్నాయ విధానాల కోసం నిరంతర ప్రజా, వర్గ పోరాటాలను నిర్మించాలనీ, జీవనోపాధి హక్కు,లాభదాయకమైన ఉపాధి, న్యాయమైన వేతనాలు, గృహవసతి, సామాజిక భద్రత, సార్వత్రిక వృద్ధాప్య పెన్షన్, సమానపనికి సమాన వేతనంతో పాటు మహిళలకు సమాన హక్కులు, మహిళలపై జరుగుతున్న నేరాలకు కఠిన చర్యలు, రహస్య బ్యాలెట్ ద్వారా కార్మిక సంఘాల గుర్తింపు, యాజమాన్యంలో కార్మికులకు ప్రాతినిధ్యం, ముఖ్యంగా నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయడంపై దృష్టి పెట్టాలని కూడా ముసాయిదా దిశానిర్దేశం చేసింది. నయా ఉదారవాద ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ప్రచారాలు, పోరాటాలు నిర్వహించాలని, గ్రామీణ, పట్టణ పేదలు, కార్మిక వర్గం, వారి జీవనోపాధి సమస్యలపై పోరాటాలు తీవ్రతరం చేయాలని, ప్రజాస్వామ్యంపై జరిగే నిరంకుశ దాడికి, హిందూత్వ మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రచారం, పోరాటాలు నిర్వహించాలని రాజకీయ ముసాయిదా తీర్మానం ప్రతిపాదించింది. పెద్ద పెట్టుబడిదారుల లాభాల కోసం దోపిడీని పెంచడానికి ఉద్దేశించ బడిన నయా ఉదారవాద విధానాలను, లేబర్ కోడ్ లను వ్యతిరేకించడంలో సీపీఐ(ఎం) స్పష్టమైన వైఖరిని, కార్మికులు నేడు నాలుగు కార్మిక కోడ్‌ల అమలును ప్రతిఘటించడానికి పెద్దపోరాటానికి సిద్ధమవుతున్న తరుణంలో వారికి తెలియజేయాల్సిన అవసరం ఉంది. ఉమ్మడి కార్మిక సంఘాల వేదిక మార్చి 18న ఢిల్లీలో ఒక జాతీయ సదస్సును నిర్వహించి, దేశ వ్యాప్తంగా సాధారణ సమ్మె తేదీని ప్రకటించాలని నిర్ణయం తీసుకుంది. ప్రచారానికి, సమ్మెకు ఇచ్చే మద్దతు వల్ల కార్మిక వర్గంలో పార్టీని, పాలనలో ప్రస్తుత కార్పోరేట్, మతోన్మాదాల బంధం దూకుడుగా అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా జరిగే ప్రజా పోరాటాలను బలోపేతం చేస్తుంది.

> తెలంగాణ రాష్ట్ర పార్టీ మహాసభ సందర్భంగా నిధుల కోసం ఇచ్చిన పిలుపునకు కార్మికుల స్పందన మంచి ఉదాహరణ. పార్టీ మహాసభ జరిగిన సంగారెడ్డిలో బహుళజాతి కంపెనీలతో పాటు కొన్ని పరిశ్రమల్లో కార్మిక సంఘాలకు నాయకత్వం వహిస్తున్న పార్టీ నాయకులు కార్మికుల ప్రతిస్పందనకు పొంగిపోయారు. పార్టీ బ్యానర్లు ప్రదర్శిస్తూ సమావేశాల్లో పార్టీ విధానాలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల పార్టీ వైఖరి, పాలకవర్గాల కార్మికవర్గ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాల గురించి వివరించారు. ఇంతకు ముందు ఒక్కరోజు వేతనం లేదా వెయ్యి, రెండు వేల రూపాయల విరాళాలిచ్చిన కార్మికులు ఈ మహాసభ సందర్భంగా ఐదు వేల నుంచి పది వేలు, కొందరు తమ నెల వేతనాన్ని కూడా ఇచ్చారు. పారిశ్రామిక ప్రాంతంలో 30నుంచి 40 మంది కార్మికులు 38 రోజుల పాటు ఇంటింటికీ నిధి వసూలు చేసే కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

మార్క్సిజం, లెనినిజాలకు కట్టుబడిన కార్మిక వర్గ పార్టీగా కార్మికవర్గానికి, పెట్టుబడిదారీ సమాజపు స్వతస్సిద్ధమైన దోపిడీ లక్షణం, పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభ సమయంలో దాని తీవ్రత గురించి పార్టీ అవగాహన కల్పించాలి. ప్రత్యామ్నాయ విధానాలతో పాటు ప్రత్యామ్నాయ సమాజాన్ని, సోషలిస్టు వ్యవస్థలు ఎలా ఉంటాయో తెలియజెప్పి, వీటిని సాధించడంలో కార్మికవర్గం తన పాత్రను పోషించేట్టు ప్రేరేపించాలి.

కార్మికుల్లో జరిగిన ప్రచారానికి స్పందన

కార్మిక వర్గం తన తక్షణ ఆర్థిక డిమాండ్ల పట్ల మాత్రమే ఆసక్తిగా ఉంటుంది, రాజకీయాల పట్ల ముఖ్యంగా వామపక్షాలంటే విముఖత కలిగి ఉంటుందనే అభిప్రాయం ఉంది. ఈ అవగాహన వల్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ విధానాలతో కార్మికుల్ని సంప్ర దించకుండా నిరుత్సాహపడుతున్నారు. అయితే ఇది వాస్తవం కాదని వివిధ రంగాల్లో, పలు సందర్భాల్లో ఇటీవలి కొన్ని అనుభవాలు తెలియ జేస్తున్నాయి. అధికారంలోని బూర్జువా పార్టీలనుసరిస్తున్న విధానాలతో అసంతృప్తితో ఉన్న కార్మికులకు ప్రత్యామ్నాయ విధానాలు లేకపోవడం వల్ల నిరాశ చెందుతున్నారు.కానీ వారిని కలిసి, వారి సమస్యలపై పార్టీ వైఖరిని వివరించినప్పుడు చాలా మంది ఆసక్తి చూపుతూ,పార్టీ పిలుపులకు స్పందిస్తున్నారు.

తెలంగాణ రాష్ట్ర పార్టీ మహాసభ సందర్భంగా నిధుల కోసం ఇచ్చిన పిలుపునకు కార్మికుల స్పందన మంచి ఉదాహరణ. పార్టీ మహాసభ జరిగిన సంగారెడ్డిలో బహుళజాతి కంపెనీలతో పాటు కొన్ని పరిశ్రమల్లో కార్మిక సంఘాలకు నాయకత్వం వహిస్తున్న పార్టీ నాయకులు కార్మికుల ప్రతిస్పందనకు పొంగిపోయారు. పార్టీ బ్యానర్లు ప్రదర్శిస్తూ సమావేశాల్లో పార్టీ విధానాలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల పార్టీ వైఖరి, పాలకవర్గాల కార్మికవర్గ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాల గురించి వివరించారు. ఇంతకు ముందు ఒక్కరోజు వేతనం లేదా వెయ్యి, రెండు వేల రూపాయల విరాళాలిచ్చిన కార్మికులు ఈ మహాసభ సందర్భంగా ఐదు వేల నుంచి పది వేలు, కొందరు తమ నెల వేతనాన్ని కూడా ఇచ్చారు. పారిశ్రామిక ప్రాంతంలో 30నుంచి 40 మంది కార్మికులు 38 రోజుల పాటు ఇంటింటికీ నిధి వసూలు చేసే కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఇతర పార్టీల వారికి దగ్గరగా ఉండే కొందరు యూనియన్ నాయకులు, ఆ పార్టీకి చెందిన చురుకైన కార్యకర్తలు ఉదారంగా విరాళాలివ్వడమే కాకుండా వారి గ్రామాల్లో పార్టీ కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాలు మోస్తూ నిధి వసూలులో భాగస్వాములయ్యారు.

జపాన్ బహుళజాతి కంపెనీ తోషిబాలో గుర్తింపు సంఘ ఎన్నికల్లో యూనియన్ అధ్యక్షునిగా ఎన్నికైన మన పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పార్టీ రాష్ట్ర మహాసభ కోసం నిధులు ఇవ్వాలని అభ్యర్థిస్తూ ఒక లేఖ రాశాడు. ఆ అభ్యర్థనకు ప్రతిస్పందిస్తూ 3600 మంది శాశ్వత, కాంట్రాక్ట్ కార్మికుల్లో మూడువేల మంది ఇరవై లక్షల రూపాయలు మహాసభ కోసం విరాళమిచ్చారు. చిన్న కంపెనీ అయిన చార్మినార్ బ్రివరీస్‌లో కేవలం 114 మంది శాశ్వత కార్మికులు ఒక్కొక్కరు పది వేల నుండి యాభై వేల రూపాయల వరకు మొత్తం 21 లక్షల విరాళం ఇచ్చారు. ఇటీవలే ఒప్పందం పై సంతకాలు అయిన సినర్జీలో కార్మికులు వారి నెల వేతనంపై పెరిగిన వేతనాన్ని విరాళంగా ప్రకటించి మొత్తం 19 లక్షల విరాళమిచ్చారు. దీనికి అదనంగా వారు ఓవర్ టైం పని చేసి, అందుకు వారు పొందిన అదనపు వేతనాన్ని మొత్తం ఐదు లక్షల విరాళం అందించారు. క్రౌన్, మహీంద్రా అండ్ మహీంద్రా, యునైటెడ్ బ్రివరీస్ లాంటి ఇతర అనేక కంపెనీల కార్మికులు కూడా ఇదే విధంగా స్పందించారు.సంఘటిత రంగంలోని కార్మికులు మాత్రమే కాక,స్కీం వర్కర్లు, అసంఘటిత రంగ కార్మికులు కూడా పెద్ద మొత్తంలో విరాళాలు అందజేశారు. అనేకమంది ఆశాలు నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించారు.పార్టీ కార్యకర్తల నేతృత్వంలో ప్రతీ కార్మిక సంఘం నుండి నిధి వసూలు చేయాలనే లక్ష్యం పూర్తిగా నెరవేరడం గమనించదగిన విషయం. కర్నాటక, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని ఐటీ ఉద్యోగుల సంఘం నుండి కూడా ఇలాంటి అనుభవాన్నే గమనించవచ్చు.

దేశవ్యాప్తంగా తమ డిమాండ్లపై మిలిటెంట్ పోరాటాల్లో భాగస్వాములవుతున్న అంగన్వాడీ ఉద్యోగులు, ఆశాలు కూడా ఇదే రీతిలో ప్రతిస్పందిస్తున్నారు. వారి పోరాటాలు, కృషికి అందిస్తున్న పార్టీ మద్దతు, పార్టీ విధానాల గురించి వారిలో అవగాహన కల్పిస్తుంది. దేశంలో ఉన్న మొత్తం కార్మికుల సంఖ్యతో పోల్చితే కార్మికుల జీవనోపాధి, వారి జీవన పరిస్థితులపై నయా ఉదారవాద విధానాల ప్రభావానికి వ్యతిరేకంగా జరుగుతున్న మిలిటెంట్ ఉద్యమాల్లో భాగస్వాములవుతున్న కార్మికుల సంఖ్య కచ్చితంగా తక్కువగానే ఉంటుంది. కానీ అవి కార్మికవర్గంలో పార్టీని బలోపేతం చేయడానికి, శ్రామిక జీవుల అనుకూల వర్గ శక్తుల పరస్పర సంబంధాల్ని మార్చే అవకాశాల్ని సూచిస్తాయి. పార్టీ 24వ మహాసభ రాజకీయ ముసాయిదా తీర్మానాన్ని యూనియన్ కార్యకర్తల్లోకి, సాధారణ కార్మికుల్లోకి విస్తృతంగా తీసుకుని వెళ్లాలి. సాధారణ ప్రజల్ని ప్రభావితం చేసే వివిధ అంశాలపై పార్టీ వైఖరిని, దాని విధానాల్ని అర్థం చేసుకునే విధంగా వారికి సహాయపడాలి.


("పీపుల్స్ డెమోక్రసీ" సౌజన్యంతో)

అనువాదం : బోడపట్ల రవీందర్, 9848412451

బంజారాల మార్గదర్శి సంత్ శ్రీ సేవాలాల్

బంజారాల మార్గదర్శి, ఆధ్యాత్మిక గురువు, తాత్వికవేత్త సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి నేడు. ఒకప్పుడు కొన్ని ప్రాంతాలకే పరిమితమైన ఆయన జయంతి ఉత్సవాలను బంజారా జాతి ప్రజలు నేడు గల్లీ నుంచి ఢిల్లీ దాకా జరుపుకుంటున్నారు. ప్రతిష్టాత్మకమైన ఐఐటి, ఎన్ఐటి వంటి విద్యాసంస్థల్లో, విదేశాల్లో చాలాచోట్ల ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతిని జరుపుతూ ప్రతియేటా కోటి రూపాయలు ఉత్సవాలకు కేటాయిస్తున్నది. బంజారా ప్రభుత్వ ఉద్యోగులకు ఉత్సవాల్లో పాల్గొనడానికి స్పెషల్ హాలిడేను ప్రకటిస్తున్నది. అయితే సేవాలాల్ గురించి, ఆయన బంజారాలకు చేసిన బోధనల గురించి నేటితరం వారు తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది.

సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 1739 ఫిబ్రవరి 15న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని రాంజీ నాయక్ తండా గుత్తి, బళ్లారి ప్రాంతంలో భీమా నాయక్,ధర్మిబాయి దంపతులకు జన్మించాడు న్యాయాన్ని, నిజాయితీని, ధర్మబద్ధమైన జీవితాన్ని ప్రజల్లో ప్రోత్సహించారు. బంజారాలు మంచి మార్గంలో నడవాలని, దుర్మార్గాన్ని పాటించాలని ఉద్బోధించారు. అలాగే కుల, మత భేదాలను తొలగించి సమానత్వాన్ని కోరారు. బంజారా ప్రజల అభ్యున్నతికి ప్రత్యేకంగా తన బోధనలను



అంకితమిచ్చారు. సమాజం అభివృద్ధి చెందాలంటే కష్టపడి పనిచేయాలని, అందుకు నిరంతరం ప్రయత్నించాలనే సందేశాన్ని ఇచ్చారు. మానవులు స్వశక్తితో జీవించాలి, శ్రమకే అధిక ప్రాముఖ్యత ఉంటుందని ఆయన హితబోధనలో సారాంశం. ప్రజలకు ఆరోగ్యం, జీవనోపాధి సాధించడానికి, దానికి అవసరమైన కృషి మేధస్సు, తెలివితేటల ద్వారా పొందు పర్చుకోవాలన్నారు. వృద్ధులు, అనాథలు, అవసరమైన వారికి సహాయం చేయాలని ఉపదేశించారు.

నేడు బంజారాల్లో ఉన్న ప్రధాన సమస్యలు భూములపై హక్కు లేకపోవడం, విద్యావిషయాల్లో అనుకున్నస్థాయి లేకపోవడం. ఇవన్నీ కూడా సేవాలాల్ చేసిన బోధనల ద్వారా స్ఫూర్తి పొందుతూ సాధించుకోవాలి. ఎందుకంటే, చాలా రాష్ట్రాల్లో కొంతమంది జంబారాలు తీవ్ర నిరాధారణకు గురవుతున్నారు. వారి అస్తిత్వం కోసం పోరాడుతున్నారు. వారికి మౌలికమైన సమస్య భూమి, సాగు చేసుకుంటున్న భూములకు హక్కుపత్రాలిచ్చే వరకు పాలకులపై పోరాడాలి. అలాగే గోర భోలిని ఎనిమిదో షెడ్యూల్ చేర్చాలని, సేవాలాల్ మహరాజ్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, ఆయన విగ్రహాన్ని పార్లమెంట్ ముందు ప్రతిష్టించాలని బంజారాలు ఎంతోకాలంగా డిమాండ్ చేస్తున్నారు.వాటిని అమలు చేసేలా పాలకులపై ఒత్తిడి తీసుకురావాలి.

సంత్ సేవాలాల్ మహరాజ్ బోధనలు కేవలం బంజారా సమాజానికే కాకుండా, సమాజంలోని ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలుస్తాయి. ఆయన బోధనల్లో ఉన్న సత్యాలు నేటికీ ప్రాసంగికంగా ఉంటాయి.ఏకజాత్, ఏకవత్, ఏకసత్ నినాదంతో బంజారాలు మరింత ముందుకెళ్లి తమ హక్కులను కాపాడుకుంటూ సంస్కృతిని పరిరక్షించుకోవాలి. "స్వయం శ్రద్ధ, కృషి, న్యాయం ద్వారా మాత్రమే మానవ సమాజాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లగలము" అని చెప్పిన మహరాజ్ ఆశయాలను నెరవేర్చేందుకుగాను ఆయన చెప్పిన మార్గాలను అనుసరించాలి. విద్య, ఆర్థికాభివృద్ధి, సాంస్కృతిక పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, ఆయన ఆశయాల్ని సాకారం చేయాలి.

- ఎ.శంకర్‌నాయక్, 911071664

సహన హిందూమతం- విద్వేష హిందుత్వం



టి.హరికృష్ణ
9494037288

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకులు శ్రీ రంగరాజన్‌పై ఈనెల ఏడున కొందరు వ్యక్తులు ఆయన ఇంట్లోకి చొరబడి దాడి చేశారు. తమని తాము శ్రీరాముని వంశానికి చెందినవారమని చెప్పుకున్న ఆ గుంపు, 'రామరాజ్య స్థాపన కోసం మాకు ఆర్థికంగా సహాయం చేయాలని, మేము ఏర్పాటు చేసుకున్న శ్రీరామ సైన్యంలోకి ఇక్ష్వాకు వంశస్తులను ఎంపిక చేయించాలని' రంగరాజన్‌ని డిమాండ్ చేసి, దానికి ఆయన నిరాకరించి నందుకు ఆయనపై భౌతిక దాడి చేశారు. హిందూత్వ భావజాలానికి ప్రతినిధులుగా వ్యవహరించే వారంతా ఇలాంటి దాడులు గతంలో ఎన్ని జరిగినా నోరు మెదపలేదు, కానీ ఈరోజు రంగరాజన్ పైన జరిగిన దాడిని మాత్రం ముకుమ్మడిగా ఖండిస్తూ వస్తున్నారు కానీ,నిజానికి ఇది మొదటి దాడి కాదు, ఇలా విద్వేషంతో జరుగుతున్న దాడుల పరంపరలో చివరిది కూడా కాకపోవచ్చు. ఒకప్పుడు ఉత్తర భారతదేశంలో మాత్రమే ఇలాంటి మూక దాడులు జరిగేవి. అవి క్రమంగా దక్షిణభారతానికి కూడా దిగుమతి అయిపోతున్నాయి. హిందూధర్మ పరిరక్షణ కోసం, హిందూరాష్ట్ర స్థాపన కోసం తాము చేసే ప్రయత్నానికి సహకరించమని పలువురు హిందువులు గౌరవంగా చూసే, పేరు ప్రఖ్యాతులు గల వ్యక్తి పైన దాడి చేయడం ఈ ఘటనలో కొత్త అంశం.

ఎవరైనా హిందూ మతాన్ని అగౌరవ పరుస్తున్నారని, మతానికి నష్టం కలిగిస్తున్నారని ఆరోపించి, అలా నష్టం కలిగించిన వారిని శిక్షించే పని కూడా తామే చేయడం ఇప్పటివరకు చూశాం. ఇటీవల తుక్కుగూడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులపై జరిగిన దాడి కూడా మత విశ్వాసాలను ఆయన గౌరవించలేదన్న ఆరోపణ మీదనే. ఇప్పుడు మాత్రం హిందూ ధర్మాన్ని మనసా వాచా కర్మణా ఆచరించే అర్చకుడి పైనే దాడి జరిగిందంటే ఉన్మాద స్థితిలో ఉన్న మనుషులు ఏం చేయగలరో గ్రహించవచ్చు. ఆ ఉన్మాదం తమ సొంత మార్గం, తమ సొంత ఆలోచన, తమకున్న అభిప్రాయాలు తప్ప మరో హేతుబద్ధమైన మాటను, భిన్నమైన అభిప్రాయాన్ని, పద్ధతిని వినదల్చుకోలేని స్థితికి చేరిందని అర్థం. మతోన్మాద మూకలు క్రమంగా విచక్షణ కోల్పోతూ తీవ్రవాద స్వభావాన్ని సంతరించుకుంటున్న సందర్భాన్ని కూడా ఈ దాడి తెలియజేస్తున్నది. ఒకసారి విద్వేషంతో కూడిన భావజాలాన్ని తలకెక్కించుకున్న వ్యక్తి ఇక ఆ ఉన్మాదానికి కారణమైన వ్యక్తులు నియంత్రించాలనుకున్నప్పటికి వీల్లేని స్థితిలోకి వెళ్తే సమాజం ఎంత సంఘర్షణాత్మకమైన దశలోకి చేరుతుందో చెప్పటానికి ఇదో తిరుగులేని ఉదాహరణ.

ఇది అత్యంత హేయమైన చర్య. బహుశా వారికి రంగరాజన్, అతను ఆలయాన్ని నడిపే పద్ధతి, ఆయనకి ఈ వ్యవస్థ పట్ల గల గౌరవం కూడా వారికి నచ్చలేదేమో! అంటే వచ్చిన వారికి భారత రాజ్యాంగంపైన, న్యాయవ్యవస్థ పైన విశ్వాసం లేదన్నది స్పష్టం. వారు తమ సొంత ఊహా ప్రపంచంలో,తమ సొంత రాజ్యాంగం అమలు కోసం ఒక ఉన్మాదంలో ఉన్న మూక. ఇది ఏ మత విశ్వాసాలనైనా కలిగి జీవించవచ్చని రాజ్యాంగం కల్పించిన హక్కుల పైన జరిగిన ప్రత్యక్ష దాడి. ఇది సాధారణ హిందూ మతస్తులపైన అదుపు తప్పిన హిందూత్వ విద్వేషం చేసిన దాడి. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి శిక్షపడేటట్లు చూసినంత మాత్రాన ఈ ప్రమాదం తప్పిపోదు. తెలంగాణలో ఇప్పటికీ ఇలాంటి విద్వేష దాడులు చాలాచోట్ల జరిగాయి. హేతువాదులపైన, అంబేద్కర్‌వాదులపైన ముస్లింలపైన, క్రిస్టియన్‌ల పైన చివరికి రంగరాజన్ లాంటి హిందూమత ప్రతినిధులపై కూడా దాడి జరిగే స్థితికి చేరుకున్నది. వీటిని విడివిడి ఘటనలుగా కాక దేశంలో ప్రబలుతున్న మత హింసా సంస్కృతిలో భాగంగా చూడాలి. తమకంటూ ఒక రామరాజ్య స్థాపన లక్ష్యంగా కలిగిన వీర రాఘవరెడ్డి ఈ దాడికి పాల్పడడానికి స్ఫూర్తి ఎక్కడి నుంచి వచ్చిందన్నది అసలు ప్రశ్న.ఈ రకమైన హింసాత్మక సంస్కృతి ఒక్కరోజులో ప్రబలింది కాదు. ప్రస్తుతం దేశాన్ని పాలిస్తున్న ప్రధాన రాజకీయ భావజాలం ఉద్దేశపూర్వకంగా పెంచి పోషిస్తున్న సంస్కృతి ప్రతిఫలమిది.



హిందూమతంలో, ఇప్పుడు రెండు ప్రధాన ధోరణుల మధ్య తీవ్రమైన ఘర్షణ జరుగుతున్న చారిత్రక సందర్భంలో మనం ఉన్నాం. మనలో చాలామందికి మత విశ్వాసాలున్నాయి. ఆ విశ్వాసాలు అనేక విశ్వాసాల్లో భాగంగా ఉన్నాయి. అంతేకాదు భిన్నమైన విశ్వాసాలతో ఉన్న మనం, సామరస్యంతో ఎలా జీవించాలో కూడా మనం స్వతంత్ర ఉద్యమం నాటి నుంచి సాగిన ఒక సహన సంస్కృతికి అలవాటు పడి కూడా ఉన్నాం.స్వాతంత్ర్య ఉద్యమకాలం నాడు, ఉద్యమ ఆకాంక్ష అయిన స్వాతంత్ర్యం మాత్రమే కాదు, పరాయి పాలకులు ఉద్దేశపూర్వకంగా ప్రవేశపెట్టిన విభజన రాజకీయాలను ఎదుర్కోవలసి వచ్చింది. గాంధీతో సహా స్వాతంత్రోద్యమ నాయకత్వం చేసిన కృషి ఫలితంగా భిన్న వర్గాల మధ్య, భిన్న విశ్వాసాల మధ్య ఐక్యత సాధించటం ఎలా అన్నది కూడా ఒక ఆకాంక్షగా స్వాతంత్రోద్యమంలో అంతర్లీనంగా కొనసాగింది. పలుమార్లు భిన్న మతవిశ్వాసాల మధ్య ఘర్షణలు జరిగి విద్వేషం చెలరేగి మారణకాండకు దారితీసిన సందర్భాలనేకం. అయినప్పటికీ ఆనాటి నాయకత్వం వాటిని నిలువరించడానికి చేయవలసినంత కృషి చేసింది. తద్వారా మనం ఒక సహన సంస్కృతిని అలవర్చుకుని ఉన్నాం. ఇది మన దేశం, మన స్వతంత్ర ఉద్యమం మనకు నేర్పిన త్యాగనిరతి. దీనికి పూర్తి భిన్నంగా స్వతంత్ర ఉద్యమంతో, ఎటువంటి సంబంధం లేని వ్యక్తులు విభజించటం, విద్వేషం నింపటం ద్వారా మాత్రమే అధికారంలో కొనసాగాలని చూస్తున్న దుస్థితి నేడు దాపురించింది.

ఇది ఒక వైపు ఇలా ఉండగానే రంగరాజన్‌పై దాడికి వచ్చిన శ్రీరామసేన ఏర్పాటు చేసిన వీర రాఘవరెడ్డి అనే వ్యక్తి తన యూ ట్యూబ్ ఛానల్‌లో చిత్రవిచిత్రమైన వీడియోలు పెట్టాడు. వాటిని చూసినప్పుడు అతను ఎలాంటి రాజ్యాన్ని స్థాపించడానికి ఆ సేన ఏర్పాటు చేశాడో మనం అర్థం చేసుకోవచ్చు. మన దేశానికి రాజ్యాంగం 1950 జనవరి 26న అమలైన నాటికంటే ముందే ఈ దేశంలో మనుస్మృతి అనే రాజ్యాంగం ఉన్నదని, అది అసలు ఈ దేశపు రాజ్యాంగమని, ఇప్పుడు అమలవుతున్న రాజ్యాంగం మన భారతదేశపు విలువలకు సరిపోదని అతని ప్రగాఢ విశ్వాసం. నిజానికి ఈ విశ్వాసం అతనికి మాత్రమే లేదు ఈ దేశాన్ని ప్రస్తుతం పరిపాలిస్తున్న రాజకీయ పార్టీ సైద్ధాంతిక భావ జాలానికి కారణమైన సంస్థ కూడా ఇదే నమ్ముతూ ఉన్నది. అంటే ఏ సంస్థ అయితే రాజ్యాంగానికి వ్యతిరేకంగా, సమానత్వ సౌభ్రాతృత్వ, లౌకిక విలువలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నదో, గత వందేండ్లుగా ఏ భావజాలన్నీ అయితే నూరిపోస్తున్నదో దాన్ని వంట పట్టించుకున్నటువంటి యువత ఈరోజు ఈ దాడులకు పాల్పడుతున్నది.

ఈ ఘటనలు ఒక్క ఉత్తర భారతంలోనే జరగటం లేదు అవి దక్షిణాది కూడా క్రమంగా దిగుమతి అవుతున్నాయి. స్వాతంత్రోద్యమ ఆకాంక్ష అయిన సామరస్య పూర్వక సహజీవనం అనేది ఇంకెంత మాత్రమూ ఒక ఆదర్శం కాని స్థితికి దిగజారాం. ఎదుటి వ్యక్తుల విశ్వాసాలు మన విశ్వాసాలకు భిన్నమైనవి అయినందువల్ల మాత్రమే ద్వేషించాలి అన్న అభిప్రాయం సాధారణ హిందూ జన సామాన్యానికి ఎప్పు డూ లేదు. ఇప్పుడు యువతలోకి క్రమంగా వచ్చి చేరుతున్న అసహన వాతావరణం రంగరాజన్‌పైన జరిగిన దాడి ద్వారా మనకు స్పష్టమవుతున్నది. ఇప్పుడు దేశానికి కావాల్సింది, పరమత సహనంతో కూడుకున్న మతమా? లేదంటే 'హిందూత్వ' విద్వేషమా? తేల్చుకోవాల్సింది ప్రజలే.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
5
శనివారం | ఫిబ్రవరి 15, 2025 | www.navatelangana.com



రాష్ట్రంలో అసమర్థ పాలన

- కాంగ్రెస్ నుండి 30 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరిక
- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన జిల్లా అధ్యక్షులు తాత మధు

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని, ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలు చేయకుండా ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిప్పుతూ సర్వేల పేరుతో కాలయాపన చేస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాత మధు అన్నారు. మండల పరిధిలోని జల్లేపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదరి వీరస్వామి, అన్నపర్తి పరశురాం, సురేష్ 30 కుటుంబాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్సీ తాత మధుసూదన్ సమక్షంలో ఖమ్మం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వల్ల పెను ప్రమాదం రాష్ట్రానికి కలుగుతుందని ప్రజలు భావించి, 14 నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల నమ్మకం కోల్పోయి కేసీఆర్ సమక్షంలోనే రాష్ట్రం అభివద్ధి చెందుతుందని భావించి బీఆర్ఎస్ పార్టీలో చేరారని ఆయన అన్నారు. పార్టీలో చేరిన వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తూ ఎల్లప్పుడూ పార్టీ కార్యకర్తలను, నాయకులను కాపాడుకుంటామని కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితో బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండలం అధ్యక్షుడు బాషబోయిన వీరన్న, రూరల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బెల్లం వేణు, దీవల శ్రీనివాసరావు, పోట్ల జగదీష్, పోట్ల నాగేశ్వరరావు, అనపర్తి ఉప్పలయ్య, అన్నపర్తి ఎల్లయ్య, సందర బోయిన పాపారావు పాల్గొన్నారు.

మున్నేరు పరివాహక ప్రాంతంలో కొలువుదీరిన గంగమ్మ తల్లి

- పందిళ్ళపల్లిలో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

నవతెలంగాణ-చింతకాని



మండల పరిధిలోని పందిళ్ళపల్లి మున్నేరు పరివాహక ప్రాంతం గంగా గౌరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద శుక్రవారం గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. మున్నేరు పరివాహక ప్రాంతం గంగమ్మ తల్లి నామస్మరణతో మార్మోగింది. వేద పండితులు బొర్ర వాసుదేవాచార్యులు సమక్షంలో ముందుగా యాగ కార్యక్రమం భక్తుల సమక్షంలో వేదమంత్రాల నడుమ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజాక్రతులను చింతకాయల నరేష్- శైలజ దంపతులు కొనసాగించారు. అనంతరం విగ్రహ దాత చింతకాని ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు లింగం రాంబాబు -స్వాతి దంపతులను వేద పండితులు ఆశీర్వదించారు. భక్తుల కోలాహలం నడుమ విగ్రహ ప్రతిష్ఠ జై గంగమ్మ తల్లి నామస్మరణలతో వైభవంగా జరిగింది. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వత్సవాయి మంగారావు, గ్రామ పెద్దలు వత్సవాయి జానకి రాములు, మంగు ప్రకాష్, లింగం కోటేశ్వరరావు, పాల్గొన్నారు.



పోలీసులకు సవాలుగా మారిన చోరీ ఘటన

- విచారణ కోసం టీమ్‌లు ఏర్పాటు

నవతెలంగాణ-వైరా

ఈ నెల 12న పట్టపగలు వైరా సుందరయ్య నగర్‌లో సర్వే అధికారుల పేరుతో ఇంట్లో చొరబడిన దొంగలు 65 ఏళ్ల వృద్ధురాలు శీలం వెంకట్రావమ్మను కాళ్ళు చేతులు కట్టేసి అరవకుండా నోటికి స్టిక్కర్లు వేసి 18 తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లిన విషయం తెలిసిందే. కేసు దర్యాప్తుకు వైరా ఏసిపి రెహమాన్, వైరా సిఐ ఎన్.సాగర్ ఆధ్వర్యంలో ఒక బృందం, వైరా, తల్లాడ ఎస్ఐలు వంశీ కృష్ణ, భాగ్యరాజ్, బలగాని కొండలరావు ఆధ్వర్యంలో మరో బృందం విచారణలో నిమగ్నమైన్నవి. దుండగులు నెంబర్ సరిగా లేని స్విఫ్ట్ డిజైర్ కారును ఉపయోగించారు. కారు నెంబర్ ప్లేట్ పై ముందు ఉండవలసిన అక్షరాలు లేకుండా కేవలం నాలుగు అంకెలు 5167 మాత్రమే ఉండటంతో ఏ రాష్ట్రానికి సంబంధించిన రిజిస్ట్రేషనో గుర్తించటానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. సుందరయ్య నగర్‌లో నివాసం ఉంటున్న శీలం యుగంధర్ రెడ్డి, కొత్తగూడెం పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు, అతని భార్య స్థానిక మధు విద్యాలయంలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. వీరు విధులకు వెళ్లిన తర్వాత ఒంటరిగా ఉన్న వెంకట్రావమ్మను ముందుగా వేసుకున్న పథకం ప్రకారం సర్వే అధికారుల పేరుతో నమ్మించి ఇంట్లో చొరబడి బంధించి, అరవకుండా నోటికి స్టిక్కర్లు వేసి 15 లక్షల విలువైన బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. వృద్ధురాలు వెంకట్రావమ్మ అదే ఇంట్లో బెడ్ రూం పై ఉంచి బయట గడియ పెట్టి వెళ్లారు. స్కూల్ నుండి లంచ్‌కు వచ్చిన ఆమె కోడలు అత్త పరిస్థితి చూసి దొంగతనం జరిగినట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వైరా ఏసిపి రెహమాన్, సిఐ సాగర్‌లు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రెండు బృందాలుగా పోలీస్ ఈ కేసు విచారణ జరుపుతున్నారు. 10 నెలల క్రితం వైరాలో కమ్మవారి కళ్యాణ మండపం సమీపం ఉంటున్న వృద్ధురాలు ఖమ్మంలో ఒక వివాహ కార్యక్రమానికి హాజరై వైరా బస్టాండ్ నుండి నడిచి వస్తుండగా బాగా తెలిసిన వ్యక్తుల వలే పలుకరించి వెంట నడిచి జన సంచారం లేని ప్రదేశంలో వృద్ధురాలిని కొట్టి మెడలో ఉన్న బంగారు ఆభరణాలను దోచుకుని వెళ్లారు. ఇప్పటి వరకు ఆ కేసు దర్యాప్తులో పురోగతి లేదనే విమర్శలు వస్తున్న తరుణంలో ఇప్పుడు జరిగిన ఈ ఘరానా దొంగతనం పోలీసులకు చాలెంజ్‌గా నిలుస్తుంది.

వ్యవసాయ కార్మికులందరికీ రూ.12 వేలు మంజూరు చేయాలి

- యర్రా శ్రీనివాసరావు, మెరుగు సత్యనారాయణ డిమాండ్

నవతెలంగాణ-కూసుమంచి

రైతు కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన వాగ్దానాలు అమలు చేయాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వ్యవసాయ కార్మికులందరికీ ఏ షరతులు లేకుండా అమలు చేయాలని, పేద వారికి అర్హత కలిగిన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎర్ర శ్రీనివాసరావు మెరుగు సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని చేగొమ్మ గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మిర్చి రైతుల సమస్యను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఈ నెల 18న ఖమ్మం మార్కెట్‌లో మిర్చి రైతుల సమస్యలపై మహా ధర్నా కార్యక్రమం ఉంటుందన్నారు. రైతులు పాల్గొనాలన్నారు. అలాగే మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని, ఖమ్మం మార్క్ ఫెడ్ ద్వారా మిర్చి కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు మల్లెల సన్మత రావు, బిక్కసాని గంగాధర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కార్యదర్శులు చిట్టూరి వెంకన్న, తాళ్లూరి వెంకటేశ్వరరావు, డాక్టర్ బాబు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-ఖమ్మం



విద్యార్థులు చదువుకునే సమయంలో జ్ఞాన సముపార్జనపైన దృష్టి పెట్టాలని ముఖ్యంగా మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటం తోపాటు అరికట్టడంలో సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.వి.చంద్రశేఖరరావు అన్నారు. శుక్రవారం ఖమ్మం ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ కళాశాలలో జిల్లా లీగల్ సెల్ అథారిటీ - యాంటీడ్రగ్ కమిటీ -ఎన్ఎస్ఎస్-ఎన్‌సిసి విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో మాదకద్రవ్యరహిత సమాజం యువతపాత్ర అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సంబంధిత చట్టాలపై అవగాహన చైతన్యంతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ అడ్వకేట్ పందిళ్ల పల్లి శరణ్య, కళాశాల యాంటీ డ్రగ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ .శ్రీనివాస్ పరిణతి, వైస్ ప్రిన్సిపాల్ ఏఎల్ఎస్ శాస్త్రి, ఐ.క్యూ.ఏ.సి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.సునంద, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.వీరన్న, డాక్టర్. సర్వేశ్వరావు, డాక్టర్ .ఓంకార్, మధు తదితరులు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ భయం

తినేందుకు జంకుతున్న ప్రజలు





ఆంధ్ర సరిహద్దుగా ఉన్న తెలంగాణ ప్రాంత ప్రజలు కోళ్లకు బర్డ్ ఫ్లూ వ్యాధి సోకటంతో భయపడుతున్నారు. బర్డ్ ఫ్లూ వ్యాధితో కోళ్లు మృత్యువాత పడటంతో చికెన్ తినే విషయంలో జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు హెచ్చరికలను జారీ చేసింది. కోళ్లకు సోకుతున్న వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు బర్డ్ ఫ్లూ వ్యాపించినట్లుగా గుర్తించారు.

- ఆంధ్ర, తెలంగాణ సరిహద్దులో చెక్ పోస్ట్ ఏర్పాటు
- ప్రతీ వాహనం తనిఖీ

నవతెలంగాణ-బోనకల్

ఆంధ్ర సరిహద్దుగా ఉన్న తెలంగాణ ప్రాంత ప్రజలు కోళ్లకు బర్డ్ ఫ్లూ వ్యాధి సోకటంతో భయపడుతున్నారు. బర్డ్ ఫ్లూ వ్యాధితో కోళ్ల మృత్యువాత పడటంతో చికెన్ తినే విషయంలో జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు హెచ్చరికలను జారీ చేసింది. కోళ్లకు సోకుతున్న వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు బర్డ్ ఫ్లూ వ్యాపించినట్లుగా గుర్తించారు. తెలంగాణ ప్రభుత్వం ఇతర రాష్ట్రాల నుంచి కోళ్లు రాకుండా అడ్డుకునేందుకు సరిహద్దుల్లో 24 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆంధ్ర తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన వత్సవాయి- బోనకల్ గ్రామాల మధ్య బోనకల్ బ్రాంచ్ కెనాల్ వద్ద మండల అధికారులు చెక్ పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. బాయిలర్ కోళ్లకు బర్డ్ ఫ్లూ వైరస్ సోకడంతో ఆంధ్రప్రదేశ్ నుంచి బోనకల్ మండలంలోకి బాయిలర్ కోళ్లను తరలించకుండా చెక్ పోస్ట్ సిబ్బంది, పోలీసులు ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. 24 గంటల పాటు చెక్ పోస్ట్ వద్ద రెవెన్యూ పోలీస్, పశు వైద్యశాల సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కొక్కరికి ఎనిమిది గంటల చొప్పున విధులు నిర్వహిస్తున్నారు. బోనకల్ మండల పరిధిలోని గార్లపాడు గ్రామంలో గల కోళ్ల ఫారాన్ని అధికారులు మూయించారు. చికెన్ షాపులను కూడా అధికారులు మూయించారు. అయితే కొన్ని చికెన్ షాప్ యజమానులు దొంగ చాటుగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. కేవలం 10 రోజుల వ్యవధిలోని చికెన్ విక్రయాలు భారీగా పడిపోయాయి. చికెన్ తెచ్చుకోవడానికి ప్రజలు భయంతో వణికిపోతున్నారు. అయితే కొంతమంది మాత్రం దొంగ చాటుగా చికెన్ షాపుల నుంచి విక్రయిస్తున్నారు.

భారీగా తగ్గిన చికెన్, గుడ్ల ధరలు

బర్డ్‌ఫ్లూ వైరస్ భయం,

మిగతా 9లో

సైలో బంకరును స్తంభింపజేస్తాం...



- రైళ్లలో బొగ్గు లోడింగ్‌ను అడ్డుకుంటాం
- ఉధృతంగా మారుతున్న సైలో బంకరు బాధితుల ఆందోళనలు
- రాష్ట్రీయ రహదారిపై రాస్తారోకో - అర్థనగ్న ప్రదర్శన
- బంకరును తీసెయ్యాలి: లేకుంటే పునరావాసం కల్పించాలి
- సమయం ఇవ్వండి పరిష్కరిస్తాం: కిష్టారం పీవో నరసింహారావు
- పరిష్కారమయ్యే దాకా టెంట్ తీయం: దీక్షలు కొనసాగిస్తాం: బాధితులు
- బాధితులకు అండగా నిలిచిన సీపీఐ(ఎం), అనుబంధ సంఘాలు
- ఐదో రోజుకు అంబేద్కర్‌నగర్, బీసీ కాలనీ సైలో బాధితుల దీక్షలు

నవతెలంగాణ-సత్తుపల్లి

కాలుష్యాన్ని వెదజల్లుతున్న సైలో బంకరును, ఓసీలను స్తంభింపజేస్తామని, రైళ్ల ద్వారా తరలిస్తున్న బొగ్గు రవాణాను అడ్డుకుంటామని, కిష్టారం, జేవీఆర్ ఓసీ కార్యాలయాలను ముట్టడిస్తామని సత్తుపల్లి మండలం కిష్టారంలోని అంబేద్కర్‌నగర్, బీసీ కాలనీకి చెందిన సైలో బంకరు బాధితులు తెగేసి చెప్పారు. సైలో బంకరును తీస్తారా, లేక పునరావాసం కల్పిస్తారా అంటూ చేపట్టిన సైలో బంకరు బాధితుల రిలే దీక్షలు శుక్రవారం నాటికి ఐదో రోజుకు చేరింది. శాంతియుతంగా జరుగుతున్న బాధితుల దీక్షలు రానురానూ ఉధృతమయ్యే దిశగా శుక్రవారం రాష్ట్రీయ రహదారిపై భారీ ఎత్తున జరిగిన ధర్నా, అర్థనగ్న ప్రదర్శన కార్యక్రమాలను బట్టి తెలుస్తోంది. ఆందోళనలకు దిగిన ప్రతిసారీ సమస్యను పరిష్కరిస్తామంటూ సింగరేణి అధికారుల చెప్పుకుంటూ వస్తున్న హామీలను ఈసారి సైలో బంకరు బాధితులు నమ్మేలా లేరని వారి మాటలను బట్టి అర్థమవుతోంది. సింగరేణి అధికారుల మాటలను ఇంతకాలం నమ్మామని, మోసం చేస్తున్నారని ఇప్పటికి గాని మాకు అర్థం కాలేదంటున్నారు. సింగరేణి అధికారుల వాహనాలను సైతం బాధితులకు సంబంధించిన స్థలాల్లోకి రానీయడానికి కూడా ఇష్టపడటం లేదనడానికి

ఉదాహరణ గురువారం అటుగా వచ్చిన జేవీఆర్ ఓసీ పీవో వాహనాన్ని కదలకుండా నిలువరించడాన్ని బట్టి సింగరేణిపై వారెంత ఆగ్రహంగా ఉన్నారనేది సుస్పష్టం. సింగరేణి ఆటలు సాగవని, ఇక ఉపేక్షించేది లేదని, తాడోపేడో తేల్చుకొనేవరకు ప్రాణాలను సైతం లెక్కచేయమని అంబేద్కర్‌నగర్, బీసీ కాలనీ సైలో బాధితులు స్పష్టం చేశారు.

రాష్ట్రీయ రహదారిపై రాస్తారోకో, అర్థనగ్న ప్రదర్శన: భారీగా నిలిచిన వాహనాలు

సైలో బంకరు బాధితులు చేపట్టిన ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం రాష్ట్రీయ రహదారిపై భారీ ఎత్తున రాస్తారోకో, అర్థనగ్న ప్రదర్శన చేపట్టారు. దీంతో సత్తుపల్లి, ఖమ్మం వైపు భారీ సంఖ్యలో వాహనాలు నిలిచి పోయాయి. సమాచారం అందుకున్న సత్తుపల్లి సీఐ కిరణ్ నేతృత్వంలో ఎస్సైలు కవిత, వీరేందర్ పోలీసు సిబ్బందితో రాస్తారోకో చేస్తున్న ప్రాంతానికి చేరుకున్నారు. సైలో బాధితులతో మాట్లాడారు. రాస్తారోకో అనంతరం కిష్టారం పీవో నరసింహారావును దీక్ష శిబిరం వద్దకు రప్పించారు. ఆ వచ్చిన పీవో నరసింహారావు బాధితులతో మాట్లాడారు. సమస్యను ఉన్నతస్థాయి అధికారుల వరకు తీసుకెళ్లామని, సమయం ఇస్తే సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో ఇందుకు ససేమిరా బాధిత ప్రజలు ఒప్పుకోకపోగా సమస్య పరిష్కారం అయ్యేవరకు టెంట్‌ను తీయమని, దీక్షలు కొనసాగించడమే గాక కిష్టారం, జేవీఆర్ ఓసీల్లో అన్ని రకాల పనులను స్తంభింపజేస్తామని పీవోను హెచ్చరించారు. మాకు వేరే గొంతెమ్మ కోరికలు ఏమీ లేవని, బంకరును తీస్తారా..? పునరావాసం కల్పిస్తారా..? అంటూ స్పష్టం చేశారు. మీరుంటున్న ఇళ్లకన్నా మేం కట్టుకున్న ఇళ్లు చాలా గొప్పగా ఉన్నప్పటికి మేం పునరావాసం అడుగున్నామంటే మా సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు.

సైలో బాధితులకు వెన్నుదన్నుగా ఆందోళనల్లో సీపీఐ(ఎం), అనుబంధ సంఘాలు

సైలో బంకరు సమస్య పరిష్కారం కోరుతూ బాధితులు చేస్తున్న రిలే దీక్షలకు సీపీఐ(ఎం), దాని అనుబంధ సంఘాలు సంఘీభావం తెలపడమే కాకుండా వారు చేస్తున్న ఆందోళన కార్యక్రమాల్లో వెన్నుదన్నుగా నిలుస్తూ ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. సైలో బంకరు సమస్య పరిష్కారమయ్యే వరకు బాధితులకు అండగా సీపీఐ(ఎం) శ్రేణులు ఉంటాయని ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్, రైతుసంఘం జిల్లా నాయకులు రావుల రాజబాబు, పార్టీ సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు బెజవాడ సాయి, ఐద్వా జిల్లా నాయకురాలు శీలం పకీరమ్మ (కరుణ) తెలిపారు.



పల్లా జాన్ రాములును ఆదర్శంగా తీసుకోవాలి

- 13వ వర్ధంతిలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ప్రతీ సీపీఐ(ఎం) కార్యకర్త, నాయకులు పల్లా జాన్ రాములును ఆదర్శంగా తీసుకోవాలని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రం అన్నారు. స్థానిక స్టేషన్ రోడ్డులో సీపీఐ(ఎం) వన్ టౌన్ మండల కార్యాలయంలో శుక్రవారం పల్లా జాన్ రాములు 13 వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పల్లా జాన్ రాములు ఉన్నంతకాలం సీపీఐ(ఎం) ను అంటిపెట్టుకొని పేద ప్రజలకి ఇంటి స్థలాలు ఇచ్చిన చరిత్ర ఉందన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్క కుటుంబానికి ఆదర్శప్రాయంగా ఉన్నారు. రానున్న రోజుల్లో కూడా పార్టీ సభ్యులు ప్రతి ఒక్కరు కూడా జాన్ రాములును ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఎంఏ జబ్బర్, వన్ టౌన్ కార్యదర్శి నాగులు మీరా, మహిళా సంఘం రాష్ట్ర నాయకులు బేగం, మహిళా సంఘం వన్ టౌన్ అధ్యక్ష, కార్యదర్శులు, ఫరీదా, అజిత, డివైఎఫ్ఐ వన్ టౌన్ అధ్యక్ష, కార్యదర్శులు రావులపాటి నాగరాజు, కూరపాటి శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.సుధాకర్, భాస్కర్, ఊరుకొండ సురేష్, పుట్టా రవి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహిత పంచాయతీగా మార్చడమే లక్ష్యం

నవతెలంగాణ-తల్లాడ

మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీని, టీబీ రహిత గ్రామ పంచాయతీగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భాస్కర్ కోరారు. మండల పరిధిలోని అంబేద్కర్ నగర్ పంచాయతీలో టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి పంచాయతీని, టీబీ ఫ్రీ పంచాయతీగా మార్చడం కోసం సూపర్వైజర్ సురేష్, ల్యాబ్ సూపర్వైజర్ సంజీవ్ కుమార్, వైద్య సిబ్బంది సహకారంతో పనిచేస్తున్నారని, వారికి ప్రజలు సహకరించాలని సూచించారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ కే.పెద్ద పుల్లయ్య, హెల్త్ విజిటర్ భద్రమ్మ, ఆశా కార్యకర్త సునీత, అంగన్ వాడీ అయమ్మ పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ మహారాజ్ బోధనలు సమాజానికి మార్గదర్శకం : మాజీ ఎంపీ నామ

నవతెలంగాణ-ఖమ్మం

బంజారా గిరిజన సమాజానికి ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ బోధనలు సమాజానికి మార్గదర్శకమని ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సేవాలాల్ మహారాజ్ సమాజ సేవకు, సామాజిక సమానత్వానికి చేసిన కృషి ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని కొనియాడారు. బంజారా తెగల అభివృద్ధి, హక్కుల పరిరక్షణ కోసం ఆయన పాటు పడటం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. బంజారా సమాజం ఐక్యంగా ఉంటూ, విద్యా, ఉపాధి రంగాల్లో మరింత పురోగమించాలని నామ ఆకాంక్షించారు.

ముస్లిం ఐక్య సంఘం మండల శాఖ ఏర్పాటు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

ముస్లిం ఐక్య సంఘం మండల శాఖను శుక్రవారం ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో గల మస్జిద్ నందు అధ్యక్షులు జనాబ్ షేక్ ఇస్మాయిల్ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముస్లిం ఐక్య సంఘం తె లంగాణ 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ విష్కరించారు. ఈ సమావేశానికి అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనాబ్ షేక్ నాగుల్ మీరా, సభ్యులు షేక్ మహబూబ్ సుభాని, షేక్ శభాష్, జానీ, బాజీ, షరీఫ్, మౌలాలి, శంషుద్దీన్, నౌషద్ అహ్మద్ పాల్గొన్నారు.

- డీవైఎఫ్ఐ యువజనోద్యమానికి సహాయ సహకారాలు అందిస్తున్న వారందరికీ ధన్యవాదాలు
- జిల్లా కార్యదర్శి షేక్ బషిరుద్దీన్
- డీవైఎఫ్ఐ డైరీ ఆవిష్కరణ



యువత పోరాటాలకు సిద్ధం కావాలి

ప్రముఖ వైద్యులు డా.చీకటి భారవి, రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావులు పిలుపు



నవతెలంగాణ-ఖమ్మం

ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై, సమస్యల పరిష్కారానికి యువత సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ప్రముఖ వైద్యులు డా.చీకటి భారవి, రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావులు పిలుపునిచ్చారు. స్థానిక మంచికంటి భవన్‌లో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సబ్ కమిటీల పేర్లతో ముద్రించిన 2025 డైరీనీ ఆవిష్కరించారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్ అధ్యక్షతన ఈకార్యక్రమంలో వారు మాట్లాడుతూ సమాజంలో బీజేపీ, మోడీ మత విద్వేషాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుతున్నారు. అమెరికాలో తెలుగు పౌరుల పట్ల ట్రంప్ చర్యలను మోడీ, బీజేపీ ఎందుకు ఖండించడం లేదని వారు ప్రశ్నించారు. నిత్యం యువకుల సమస్యల పరిష్కారానికై డీవైఎఫ్ఐ పోరాడుతూనే క్యాలెండర్, డైరీలు తీయడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై, సమస్యల పరిష్కారానికి యువత సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ డీవైఎఫ్ఐ యువజనోద్యమానికి సహాయ సహకారాలు అందిస్తున్న వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు బండి రమేష్, బివికె మేనేజర్ వై.శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి బండి పద్మ, వ్యకాస జిల్లా నాయకులు, అధ్యక్షుడు యర్రా. శ్రీనివాసరావు, మెరుగు సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.సుధాకర్, టీ.ప్రవీణ్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు చింతల రమేష్, సత్తెనపల్లి నరేష్, భూక్యా ఉపేందర్ నాయక్, శీలం.వీరబాబు, కూరపాటి.శ్రీను, నాగరాజు, మహేందర్, జగదీష్, వినోద్, నరేష్, శ్రీకాంత్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
6
శనివారం | ఫిబ్రవరి 15, 2025 | www.navatelangana.com

సురక్ష బీమా యోజన చెక్కు అందజేత

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని గోపాలపేట గ్రామానికి చెందిన పుణ్యబోయిన నరసింహారావు(19) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తల్లాడ బ్రాంచ్‌లో సురక్ష బీమా యోజన లైఫ్ ఇన్సూరెన్స్‌ను తీసుకున్నారు. ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబ సభ్యులకి సురక్ష బీమా యోజన పథకం ద్వారా రెండు లక్షల చెక్కును శుక్రవారం ఎస్బిఐ రీజినల్ మేనేజర్ గోపగాని లింగస్వామి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సురక్ష భీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్న తల్లాడ మేనేజర్ పని కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, గోపాల్పేట మాజీ సర్పంచ్ నల్లమోతు మోహన్‌రావు, అకౌంటెంట్ భీమరాజు, క్యాషియర్ వెంకటేశ్వరరావు, క్లర్క్ నాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద మృతులకు ఎంపీ రఘురాంరెడ్డి సంతాపం

- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

నవతెలంగాణ-ఖమ్మం

గువ్వలగూడెం నుంచి గ్రానైట్ రాళ్ల లోడుతో ఖమ్మం వస్తున్న డీసీఎం వెనుక ట్రైర్ల ఫ్రేమ్ భాగం విరిగి ముదిగొండ సమీపంలో బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ఖమ్మం కార్పొరేషన్ ఒకటో డివిజన్ కైకొండాయిగూడెంకు చెందిన వీరన్న, హుస్సేన్ అనే ఇద్దరు మృతి చెందిన నేపథ్యంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం బాధాకరమని మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని సూచిస్తూ ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ రాంబాబుతో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ఫోన్‌లో మాట్లాడారు.

ఆర్థిక స్వతంత్రతతోనే మహిళా సాధికారత

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-ఖమ్మం



ఆర్థిక స్వతంత్రతతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా రెండు రోజుల పాటు జిల్లాలోని ఐదు నియోజకవర్గాల గ్రామీణ మహిళా వ్యాపార వేత్తలు, సెర్ప్ సిబ్బందికి చిన్న తరహా వ్యాపారాల నైపుణ్యాభివృద్ధిపై స్థానిక శ్రీ భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొదటి రోజు మధిర, సత్తుపల్లి అసెంబ్లీ నియోజక వర్గాలకి సంబంధించి నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. మహిళలకు ఆర్థిక బలం, ఆర్థిక స్వతంత్రత ఉంటేనే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుందని అన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడం వల్ల కుటుంబాలు బాగుపడతాయని, పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలకు కూడా ఎదిగేందుకు నమ్మకం ముందు తరాలకు వస్తుందని అన్నారు. వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు మహిళలకు ధైర్యం ఉండాలని, ప్రారంభంలో మనకు వంద రకాల సందేహాలు, భయాలు ఉంటాయని వీటిని అధిగమిస్తూ కొత్త, కొత్త విషయాలను నేర్చుకుంటూ వ్యాపారాలను చేయాలని అన్నారు. వ్యాపారాలు ఒకే రోజు విజయవంతం కావని, వ్యాపారాలు నడపడంలో నేర్పు, ప్రణాళిక ఉండాలని తెలిపారు. అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంట్రిప్యూన్యూర్స్ ఆఫ్ ఇండియా (ఏఎల్ఈఏపి) స్కిల్ డెవలప్మెంట్ చైర్ పర్సన్ అన్నపూర్ణ మాట్లాడుతూ మహిళలకు ఉన్న అవకాశాల గురించి తెలుసుకొని పైకి ఎదగాలని అన్నారు. తల్లిగా పిల్లలను ఎలా జాగ్రత్తగా పెంచుతారో, అదే రీతిలో మన వ్యాపారాలను కూడా బాధ్యతాయుతంగా నిర్వర్తించి దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలకు దోహదపడాలని అన్నారు. మహిళలకు పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సంపూర్ణ సహకారాలు అందిస్తామని అన్నారు. అనంతరం గ్రామీణ వ్యాపారవేత్తలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీవో సన్యాసయ్య, అడిషనల్ డిఆర్డీవో నూరొద్దీన్, ఏ.ఎల్.ఈ.ఏ.పి. విజయవాడ రీజినల్ మేనేజర్ సునీత, ఐ.ఓ.ఎల్. ట్రైనర్ శివ నారాయణ, సిహెచ్. రవీందర్, హైదరాబాద్ సేర్ప్ ప్రాజెక్టు మేనేజర్ శ్రావణ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విధుల నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలి

కలెక్టరేట్లో నూతన చాంబర్లను ప్రారంభించిన కలెక్టర్

సమర్థవంతంగా విధుల నిర్వహణ చేస్తూ నిర్దిష్టమైన సేవలను ప్రజలకు సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఆరు రెవిన్యూ విభాగ పర్యవేక్షకుల కోసం ఏర్పాటు చేసిన నూతన ఛాంబర్‌లను కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ కలెక్టరేట్‌కు ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని, నమ్మకంతో వస్తారని, వారి పట్ల చిత్తశుద్ధితో పని చేస్తూ సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డాక్టర్. పి. శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ.పద్మశ్రీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రాజేశ్వరి, కలెక్టరేట్ ఏఓ ఎన్. అరుణ, వివిధ సెక్షన్‌ల పర్యవేక్షకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మూడో రైల్వే లైన్ నిర్మాణంతో మసకబారబోనున్న వ్యాపారాలు

- ఒక్కో రోజు 'బోని' కూడా కాకుండానే మూతపడుతున్న దుకాణాలు
- ఇప్పటికే నష్టాలతో చేతులెత్తేసేందుకు సిద్ధమవుతున్న పలువురు
- తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న వ్యాపారులు

నవతెలంగాణ - బోనకల్

మధిరలో మూడో రైల్వే లైన్ నిర్మాణం పనులు మధిర పట్టణ ప్రజల్లో, వర్తక వ్యాపార వర్గాల్లో ఆందోళన నింపేదిగా మారింది. పట్టణాన్ని రెండుగా చీలుస్తున్న రైల్వే ట్రాక్ ప్రాంతంలో అండర్ పాస్ నిర్మాణ హామీలు 20 ఏళ్లుగా అడుగు ముందుకు పడకపోవడంతో త్వరలోనే ట్రాక్ నిర్మాణం పూర్తయితే ఇరు ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతుంది.

ఉమ్మడి రాష్ట్రంలో ఓ వెలుగు వెలిగిన మధిర ప్రాంతం ఆ తరువాత కొనసాగుతున్న పరిస్థితులు తిరోగమన దిశగా అడుగులు పడుతున్నాయని వ్యాపారస్తుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపార వర్గంతోపాటు విద్యాసంస్థలతో నిత్యం రద్దీగా ఉండే నియోజకవర్గ కేంద్రంలో ప్రస్తుతం సాయంత్రం 8 దాటితే రోడ్లపై మనుషులే కనిపించని పరిస్థితి నెలకొంది. రాజకీయ నాయకుల అనాలోచిత నిర్ణయాలు కొంతమంది వర్తక వ్యాపారుల వ్యవహారాలు కొద్దిరోజుల్లో పట్టణ వ్యాపారాలపై తీవ్రప్రభావిత పరిస్థితులు నెలకొననున్నాయి. పట్టణాన్ని మధ్యగా చీల్చుతూ వెళ్లే సౌత్ సెంట్రల్ రైల్వే కారిడార్‌తో వన్ టౌన్, టూ టౌన్‌గా ఉన్న పట్టణం మధ్య రాకపోకలకు ఆర్‌ఓబి మాత్రమే ప్రధాన రహదారిగా ఉంది. దీంతో గ్రామాల నుంచి వచ్చే ప్రజలు ఇరు ప్రాంతాలలో ఉన్న వర్తక వ్యాపార సముదాయాలకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయంగా ఉన్న రైల్వే కాజ్వే(మోరి) నుండి ద్విచక్ర వాహనాలు ద్వారా కొనసాగిస్తున్నారు. రెండున్నర దశాబ్దాల కాలంగా పట్టణాన్ని విభజించిన రైల్వే కారిడార్ (గేటు) ప్రాంతంలో అండర్ పాస్ రహదారిని ఏర్పాటు చేయాలని, ఈ ప్రాంత ప్రజలు, మేధావులు, వర్తక వ్యాపార వర్గాలు చేయని ప్రయత్నం లేదు అంటే అతిశయోక్తి కాదేమో. అయినా 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న రాష్ట్ర పాలకులు, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వ పెద్దలు కనీసం మధిర ప్రాంతానికి ఉన్న అవసరాన్ని గుర్తించకుండా వ్యవహరించడం గమనార్హం.

ఈ క్రమంలోనే ఏడాదిన్నరగా మూడో లైన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్న రైల్వే శాఖ ద్వారా పనులపై హామీ లిస్తూ వస్తున్న బిజెపికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ ప్రాంతానికి చెందిన రాష్ట్ర పార్టీలో కీలక భూమిక పోషిస్తున్న నాయకులు స్పందించడం లేదని విమర్శలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు ఇస్తే కేంద్రం ద్వారా పనులు చేయించేందుకు సిద్ధమంటూ కొత్త రాగాన్ని ఎత్తుకోవడం ఇటీవల ఓ మీడియా ప్రకటనలో వెలుగు చూసిన అంశం.

కాగా ప్రస్తుతం మధిర రైల్వే స్టేషన్‌కు సమీపంలో మూడో లైన్ నిర్మాణంలో భాగంగా పనులు చకచకా జరుగుతుండగా గేటు ప్రాంతంలో ఇప్పటివరకు కొనసాగిన మార్గాన్ని పూర్తిగా మూసివేసే విధంగా గోడ నిర్మాణాన్ని చేపడుతుండడంతో ప్రజల రాకపోకలు సాగించేందుకు ఆర్‌ఓబి మీదుగానే ప్రయాణంచేయాల్సిన పరిస్థితి ఏర్పడనుందని ప్రజల్లో ఆందోళన నెలకొంది. దీనికి తోడు రైల్వే కాజ్‌వేగా ఉన్న మోరీ ప్రాంతం నుండి కూడా రాకపోకలను పనుల పేరుతో తాత్కాలికంగా మూసివేయగా, ఇది ఇలాగే కొనసాగుతుందని రైల్వే అధికారుల ద్వారా అనధికారికంగా అందిన సమాచారం.

ఈ పరిస్థితులతో మూలన పడ్డ వ్యాపారం:

మూలిగే నక్క మీద తాటికాయ పడ్డ చందంగా ప్రత్యామ్నాయం లేక వ్యాపారాలు నిర్వహించుకుని జీవనం సాగిస్తున్న వారిపై ప్రజల రాకపోకలు లేకపోవడంతో తీవ్ర ప్రభావం పడుతున్నదన్న ఆందోళన నెలకొంది. ప్రధానంగా మధిరకు వ్యాపార కూడలిగా, ప్రభుత్వ కార్యాలయాలకు నెలవుగా ఉన్న టూ టౌన్ ప్రాంతంలో ఇటీవల కాలంలో వ్యాపారాలు నామమాత్రంగా సాగుతున్నాయి. ప్రస్తుతం కొన్ని దుకాణాలలో ఒక్కో రోజు బోని కూడా కానీ పరిస్థితులు ఉంది. అంటే ఈ పరిస్థితులకు కారణం వేరే చెప్పనక్కర్లేదు. సాయంత్రం 8 దాటితే పట్టణంలో కర్ఫ్యూ వాతావరణం పరిస్థితులు కనిపిస్తుండడం మధిర అభివృద్ధికి సంకేతమా, తిరోగమనానికి ఉదాహరణ అనేది పాలకులు తేల్చుకోవాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలు స్పందించాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు. నియోజకవర్గ కేంద్రంలో మేడిపండు చందంగా మారిన పరిస్థితులపై ఇప్పటికైనా ఈ ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు స్పందించి తక్షణ చర్యలకు పూనుకోవాల్సిన అవసరం ఉన్నదని అన్ని వర్గాల ప్రజలు కోరుతున్నారు.

ప్రస్తుతం కొనసాగుతున్న మూడో లైన్ నిర్మాణం పూర్తయితే అండర్ పాస్ రహదారి నిర్మాణంపై ఆశలు వదులుకోవాల్సిందేనని, ఇప్పటికైనా అన్ని వర్గాల ప్రజలు ఏకతాటి పైకి వచ్చి సమస్యను పరిష్కరించేందుకు కార్యచరణతో ముందడుగు వేయాల్సిన అవసరం ఉందని మధిర పట్టణ ప్రజలు, వ్యాపారులు అంటున్నారు.

మనోజ్ పై దాడి చేసిన నిందితులు అరెస్ట్

- ఏసీపీ రెహమాన్

నవతెలంగాణ-వైరా



నాగులవంచ పెట్రోల్ బంక్‌లో భూదాల మనోజ్ పై జరిగిన దాడి కేసులో బోనకల్ మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన ఉమ్మినేని రమేష్, చింతకాని గ్రామానికి చెందిన లగడపాటి సాయిలుపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటి కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు వైరా ఏసిపి రెహమాన్ తెలిపారు. ఈ సందర్భంగా కేసు వివరాలు శుక్రవారం ఏసీపీ వివరించారు. నాగులవంచ గ్రామం లోని పెట్రోల్ బంక్ లో ఫిబ్రవరి11 న తన పై జరిగిన దాడి సంబంధించిన కేసు విచారణలో భాగంగా ఫిబ్రవరి 11 న చింతకాని పోలీస్ స్టేషన్‌కు వచ్చిన తనపై అక్కడే ఉన్న గోవిందాపురం (ఎల్) గ్రామానికి చెందిన ఉమ్మినేని రమేష్, చింతకానికి చెందిన లగడపాటి సాయిలు పోలీస్ స్టేషన్ ఆవరణలోనే దాడి చేశారని బోనకల్ గ్రామానికి చెందిన బూదాల మనోజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ నిందుతులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శుక్రవారం చింతకాని పోలీసులు నిందుతులను అరెస్ట్ చేశారని వివరించారు. ఈ విషయమై ఏలాంటి ఆరోపణలకు తావు లేకుండా పూర్తి నిష్పక్షపాతంగా విచారణ కొనసాగుతుందని అన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఇలాంటి అనైతిక కార్యకలాపాలకు, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గర్భిణీలకు యోగాపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-తల్లాడ

తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం గర్భిణీలకు యోగ, వ్యాయామంపై అవగాహన సదస్సు, సుఖ ప్రసవంపై పలు సూచనలు డాక్టర్ రత్న మనోహర్, రేష్మ, నీలిమ అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతి గర్భిణీ ఉచితంగా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుని, తగిన వైద్య సలహలు, పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ భద్రమ్మ యోగా ఇన్‌స్ట్రక్టర్ శ్రీదేవి, ఏఎన్ఎం పద్మ, అరుణిమ, మరియమ్మ పాల్గొన్నారు.

మిర్చికి రూ.25వేలు మద్దతు ధర నిర్ణయించాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కొనుగోలు చేయాలి
- 18న మిర్చి రైతుల మహాధర్నాను జయప్రదం చేయండి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ

నవతెలంగాణ-కామేపల్లి



మిర్చి క్వింటాకు రూ.25వేలు మద్దతు ధర నిర్ణయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న ఖమ్మం వ్యవసాయ మార్కెట్ వద్ద నిర్వహిస్తున్న రైతుల మహా ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ కోరారు. కామేపల్లి మండలంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ లాల్యతండ, అడవి మద్దులపల్లి, హరిచంద్రాపురం, కామేపల్లి, ఉటుకూర్, పింజర మడుగు, తాళ్ళగూడెంలో రైతులతో కలిసి విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రాంబాబు, కృష్ణ మాట్లాడుతూ గత రెండు సీజన్‌లో మిర్చి ధర పూర్తి స్థాయిలో పతనం కావడంతో రైతులకు గిట్టుబాటు కావడం లేదని అన్నారు. గత సంవత్సరం సీజన్ ప్రారంభంలో ఇరవై ఐదు వేల రూపాయలు ధర ఉంటే నేడు 12 వేల రూపాయల ధరకి పడిపోయింది అన్నారు. మరో వైపు వైరస్, తెగుళ్ళ, నల్లి బారిన పడి దిగుబడి తగ్గిందని తెలిపారు. ఇప్పటికే ఖమ్మం జిల్లాలో నాలుగురు మిర్చి రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. ఖమ్మం జిల్లాలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు గుండా సత్యనారాయణరెడ్డి, వజ్జా రామారావు, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అంబటి శ్రీనివాసరెడ్డి, రైతు సంఘం మండల కార్యదర్శి సకినాల శ్రీనివాసరావు, గుండా వెంకటరెడ్డి, అడపా రామనాథం, లావూడ్య రామ, మంగిలాల్, రవి, మేడా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వెంకయ్యకు సీపీఐ(ఎం) నాయకుల పరామర్శ

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలో చిరుమర్రి గ్రామానికి చెందిన సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు దోమల వెంకయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. శుక్రవారం సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎర్రా శ్రీనివాసరావు, బండి పద్మ మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకయ్యతో వారు మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల నాయకులు టీఎస్ కళ్యాణ్, మంకెన దామోదర్, రాయల శ్రీనివాసరావు, యంద్రపల్లి రవికుమార్, మందరపు పద్మావతి, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మెట్టెల సతీష్, సిపిఐ(ఎం) గ్రామ నాయకులు కత్రం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-నేలకొండపల్లి



అప్పుల బాధ భరించలేక తీవ్ర మనస్థాపానికి గురై ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం మండలంలోని మంగాపురం తండ గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తేజావత్ రామ(50) తనకున్న నాలుగు ఎకరాల పొలానికి తోడు మరికొంత కౌలుకి తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. గత వానాకాలం సీజన్లో సాగుచేసిన పంటలను దక్కించుకునేందుకు అందిన కాడికి అప్పులు చేసి ఆరుగాలం కష్టించాడు. వాతావరణ మార్పులు చీడపీడల తీవ్రతతో పంట దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. వేసిన పంటలు, తగ్గిన దిగుబడులు, చేసిన అప్పులతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ప్రస్తుత సీజన్‌లో కూడా సాగు చేసిన పంటలు ఆశాజనకంగా లేకపోవడంతో అతన్ని తీవ్రంగా బాధించింది. దీనికి తోడు చేపల చెరువును లీజుకు తీసుకొని ఆరుగాలం కష్టపడి పని చేసిన అంచనాకు తగినట్లుగా ఆదాయం లేకపోవడంతో మరింత అప్పుల పాలయ్యాడు. చేసిన అప్పులు ఇక తీర్చలేమనే బెంగతో మనస్థాపానికి గురైన రామ ఈనెల 7వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రామ మృతదేహాన్ని స్థానిక పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లిక తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రామ మృతదేహాన్ని మాజీ గ్రామ సర్పంచ్ భూక్య సుధాకర్, సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు భూక్య కృష్ణ, గ్రామస్తులు మత్స్య పరిశ్రమ శాఖ వైస్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ, కోటేశ్వరరావు తదితరులు సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



కులగణన సర్వే సిబ్బందికి డబ్బులు ఇప్పించండి

- ఆర్డీవోకి యూటీఎఫ్ వినతి

కల్లూరు : రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర సర్వేను కల్లూరు మండలంలో ఎన్యుమరేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, విజయ వంతంగా పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ లక్ష్యాలకు తగిన విధంగా పని చేసి ఉన్నారు. అయితే ఇప్పటి వరకుతగిన పారితోషక రుసుము మాత్రం ఎన్యుమరేటర్లు, డేటా, ఎంట్రీ ఆపరేటర్స్ సిబ్బందికి అందలేదు. వెంటనే పారితోషక రుసుము విడుదల చెయ్యాలని, ఉపాధ్యాయులకు సెలవు రోజుల్లో పని చేసినందుకుగాను 5 సీసీలు మంజూరు చేయుటకు డిఈఓకి తగిన గైడెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వినత పత్రం ఆర్డీఓ రాజేంద్రగౌడ్‌కు యుటిఎఫ్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టి తీసుకుపోతానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కె.విజయ్ కుమార్, జి.సుధీర్, పొంగా శ్రీనివాసరెడ్డి, వి.అశోక్, జి.తిరుపతమ్మ, యర్నం నాగరాజు పాల్గొన్నారు.



ఎంబీబీఎస్ విద్యార్థినికి 'కంభంపాటి' ఆర్థిక సాయం

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలోని అమ్మపేట గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని ఎంబిబిఎస్ చదివే ఊటుకూరి అశ్వితకు పవర్ మేక్ కంపెని ఉపాధ్యక్షులు కంభంపాటి సత్యనారాయణ రూ.50 వేలు ఆర్థిక సాయం చేయగా ఆ చెక్కును మర్లపాటి వెంకటేశ్వరరావు శుక్రవారం అశ్వితకు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. అశ్విత నిరుపేద కుటుంబంలో పుట్టి చదువుపై మక్కువతో గురుకులాల్లో చేరి ఉచిత ఎంబిబిఎస్ సీటు గత రెండు సంవత్సరాలు క్రితం సాధించిన విషయం విధితమే. అశ్విత కుటుంబం ఆర్థికంగా నిరుపేదలు కావడంతో పైచదువుల నిమిత్తం దాతల కోసం అప్పట్లో ఎదురుచూస్తుండగా నవతెలంగాణ దినపత్రికలో అశ్విత చదువుకు పేదరికం అడ్డంకు. దాతల కోసం ఎదురుచూపు అనే కథను ప్రచురించగా కంభంపాటి సత్యనారాయణ స్పందించి అశ్విత కుటుంబ స్థితిగతులను తెలుసుకొని, మెడిసిన్ ప్రథమ సంవత్సరం నుండి రూ.50 వేల చొప్పున అశ్వితకు ఆర్థిక సాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. అశ్విత మెడిసిన్ మూడో సంవత్సరం కావడంతో గత సంవత్సరం లాగానే ప్రస్తుతం రూ.50వేలు మెడిసిన్ చదువుతున్న విద్యార్థి అశ్వితకు పవర్ మేక్ కంపెని కంభంపాటి సత్యనారాయణ గత రెండు సంవత్సరముల నుండి విద్యార్థి ఖర్చుల నిమిత్తం తన సొంతంగా మూడో సంవత్సరం రూ.50వేల మర్లపాటి ద్వారా అందజేసిన కంభంపాటి సత్యనారాయణ దాతృత్వాన్ని పలువురు మెచ్చుకొని అభినందించారు. ఎంబిబిఎస్ ఉచిత సీటు సాధించిన ప్రథమ సంవత్సరం నుండి క్రమం తప్పకుండా రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేసిన కంభంపాటి సత్యనారాయణకు అశ్విత కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

డిజిటల్ క్రాప్ సర్వేను వేగవంతం చేయాలి

- జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య

నవతెలంగాణ-సత్తుపల్లి రూరల్



జిల్లా వ్యాప్తంగా డిజిటల్ క్రాప్ (పంట) సర్వేను వేగవంతంగా చేపట్టాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి. పుల్లయ్య ఆ శాఖ అధికారులను ఆదే శించారు. శుక్రవారం సత్తుపల్లి మండలం రేజర్లలో జరుగుతున్న డిజిటల్ క్రాప్ సర్వేను ఆయన సత్తుపల్లి ఏడీఏ శ్రీనివాస రెడ్డి తో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 2,42,267 ఎకరాల వరకు డిజిటల్ క్రాప్ సర్వే చేపట్టాలని ప్రభుత్వం నిర్దేశించగా ఇప్పటి వరకు 99,107 ఎకరాల్లో డిజిటల్ సర్వే పూర్తయిందని డీఏవో పుల్లయ్య తెలిపారు. జిల్లాలో సహకార సంఘాల పరిధిలో ఈ యాసంగిలో రైతుల అవసరం మేరకు సరిపడా ఎరువుల నిల్వలను ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వై. శ్రీనివాసరావు, ఏఈవో టి. నరేశ్, రైతులు పాల్గొన్నారు.

శ్రీయుత 4వ అదనపు (ప్రొహిబిషన్ & ఎక్సైజ్) జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు
ఖమ్మం
ఓ.యస్. నెం. 63/2025

బిట్వీన్ :
1) చలువాది అలియాస్ దొడ్డ బేబి శారద
2) చలువాది ఆదిత్య
3) చలువాది ఆష
.... వాదులు
మరియు
1) తహాశీల్దారు, ఖమ్మం అర్బన్ మండలం
2) ఎవరికి సంబంధించితే వారికి
.... ప్రతివాదులు

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియ జేయునది ఏమనగా! చనిపోయిన చలువాది మాధవరావు గార్కి పైన తెలిపిన వాదులు మాత్రమే వారసులు అని డిక్లేర్ చేయమని పై కోర్టులో ప్రతివాదులపై దావా వేసియున్నారు. ఇట్టి దావాలో ఎవరికైన అభ్యంతరములు యున్న యెడల ది. 4.3.2025 తేదీ నాడు పైన తెలిపిన కోర్టులో ఉ. గం.10.30 ని॥లకు వచ్చి తెలుపు కోవలసినదిగా కోర్టు వారు ఆదేశించనైనది. కావున ఎవరికైనా అభ్యంతరములు యున్న యెడల పైన తెలిపిన తేది : 4.3.2025 ఉ.గం. 10.30 ని॥లకు సదరు కోర్టుకు వచ్చి తెలుపుకోగలరు.

// కోర్టు వారి అనుమతితో//

ఖమ్మం
ది.14.2.2025

వేంసాని రవికుమార్
అడ్వకేట్, ఖమ్మం
సెల్ : 9848935458

IN THE COURT OF THE PRL.
JUNIOR CIVIL JUDGE
AT: KHAMMAM
O. S.NO: 1728/2022

Between:
Kolahalam Srinivasaraju
---------plaintiff
AND
Nuthalapati Muralidhar rao
.... Defendant

NOTICE

To
Nuthalapati Murahidhar rao "S/o Ramaiah Age: 57 years, Occ:Business R/o H. No 7-2-9,"Dwaraka nagar, khammam city & District.

The plaintiff filed the above suit against you for recovery of money in which the Hon'ble court ordered summons through paper publication.

Take notice that, the case stands posted on 28-02-2025 for your appearance by 10.30 A.M before the above court. You are reguested to appear either in person or through an advocate, failing which the matter shall be heard ex-parte .

//By order of the court //

A. VENKATA RAMANA
Advocate,H. No. 10-3-136,
Mamillaguadam
Khammam

Khammam
Dt.14.2.2025
Cell 9490144122

నూతన దంపతులను ఆశీర్వదించిన సీపీఐ(ఎం) నేతలు

నవతెలంగాణ-ముదిగొండ



మండల పరిధిలోని చిరుమర్రి గ్రామానికి చెందిన సిపిఐ(ఎం) మండల కమిటీ మాజీ సభ్యురాలు వినుకొండ రాణి రెండవ కుమారుడు చరణ్ రాజు వివాహము లక్ష్మి తేజస్వినితో ఈనెల 10న జరిగింది. సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎర్రా శ్రీనివాసరావు, బండి పద్మ, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు చిరుమర్రి గ్రామాన్ని శుక్రవారం సందర్శించి వినుకొండ రాణి నివాసానికి వెళ్లి నూతన దంపతులు చరణ్ రాజు లక్ష్మీతేజస్వినిలను ఆశీర్వదించి బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల నాయకులు మంకెన దామోదర్, టీఎస్ కళ్యాణ్, వేల్పుల భద్రయ్య, కోలేటి ఉపేందర్, యంద్రపల్లి రవికుమార్, రాయల శ్రీనివాసరావు, మందరపు పద్మావతి, కోలేటి అరుణ, ముదిగొండ రెండవ గ్రామ శాఖ కార్యదర్శి మెట్టెల సతీష్, గ్రామ నాయకులు బండి శేఖర్, కత్రం గురవయ్య, గ్రామ మాజీ ఉపసర్పంచ్ వినుకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియ జేయునది ఏమనగా! శ్రీమతి సంగ్రు శాంతి, భర్త : అశోక్, వయస్సు : 32 సం.లు, వృత్తి : గృహిణి, నివాసం : ఇ.నెం. 4-2-151/272/5/బి1, శ్రీనివాసనగర్, ఖమ్మం. అనువారు, మా యొక్క క్లయింట్ హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్, ఖమ్మం బ్రాంచి నందు ఈ దిగువ స్థిరాస్తిని తనఖా గావించి ఋణము పొందుటకు ప్రతిపాదించినారని తెలియ జేసినారు. శ్రీమతి సంగ్రు శాంతి గారు ఈ దిగువ షెడ్యూల్ స్థిరాస్తిని షేక్ రజియా బేగమ్, తండ్రి : అబ్దుల్ వహాబ్, వయస్సు : 25 సం.లు, వృత్తి : గృహిణి, భర్త : నాగుల్‌మీరా, నివాసం : శ్రీనివాసనగర్, ఖమ్మం గారి నుండి క్రయ దస్తావేజు నెం. 196/2023, ది. 05.02.2023 స.రి. ఖమ్మం ద్వారా రిజిస్టర్ పొందినారు. క్రయం పొందిన నాటి నుండి అట్టి స్థిరాస్తి వారి యొక్క సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో వున్నదని సదరు బ్యాంకు వారికి తెలియ జేసినారు. సదరు ఆస్తి యొక్క లింక్ దస్తావేజు నెంబర్లు 766/1992 ది.20.11.1992, 905/92 ది. 23.03.1982 మరియు 551/83 ది. 18.02.1983గా రిజిస్టర్ కాబడినవి. సదరు లింక్ దస్తావేజులలో ఒరిజినల్ దస్తావేజు నెంబరు 5296/1993 ది. 28.08.1993 సంగ్రు శాంతి గారు ఖమ్మంలోని శ్రీనివాసనగర్ లో ఇల్లు మారుతున్నప్పుడు మార్గం మధ్యలో ది.05.01.2025న పోయినవని వెతకగా దొరకలేదని ఖమ్మం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసినారని తెలియ జేసినారు.

సదరు విషయము యదార్థమైనదా! కాదా! అని తెలుసుకొనుటకు మరియు ముందు జాగ్రత్తగా ఈ ప్రకటన జారీ చేయడమైనది. పైన పేర్కొనబడిన ఒరిజినల్ లింక్ దస్తావేజు నెంబరు 5296/1993 ది. 28.08.1993 ఎవరి వద్దనైనా ఉన్నచో, సదరు ది.ళ్ల. దస్తావేజు యొక్క సర్టిఫైడ్ కాపీ ద్వారా ప్రతిపాదించబడిన తనఖా లావాదేవీ యెడల గానీ, దిగువ షెడ్యూలు ఆస్తిపై గానీ ఏదైనా క్లెయిమ్ ఉన్నచో, వాటిపై ఎవరికైననూ అభ్యంతరములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన నాటి నుండి (15) రోజులలో ఆధార పూర్వకముగా తెలియ చేయగలరు. పదిహేను (15) రోజుల తదుపరి ఎవరికిని ఏ విధమైన అభ్యంతరములు,ఆక్షేపణలు లేవని భావించబడును.

స్థిరాస్తి షెడ్యూలు : ఖమ్మం పట్టణ మున్సిపల్ కార్పొరేషన్ శ్రీనివాసనగర్, సత్యసాయి ఆశ్రమం ఏరియాలో సర్వే నెంబరు 367 మరియు 369 ది.టి. ప్లాటు నెం. 50, విస్తీర్ణము చ.గ. 100.00 = 83-61 చ.మీ గల స్థిరాస్తి నివేశన ప్లాటునకు హద్దులు :
తూర్పు : 30 అడుగుల గల ప్రపోజ్డ్ రోడ్
పడమర : ప్లాటు నెం.37
ఉత్తరం : ప్లాటు నెం. 50 ది.లే
దక్షిణం : ప్లాటు నెం. 51

(బ్యాంకు వారి తరుపున)
శ్రీమతి పి. సంధ్యారాణి,
న్యాయవాది, ఖమ్మం.
సెల్ : 9849121720

ఖమ్మం
ది.14.2.2025

రేపు ప్రతిభా పాటవ పరీక్ష

ఖమ్మం : పదవతరగతి విద్యార్థులకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పరీక్ష ఆదివారం జిల్లా సైన్స్ మ్యూజియంలో నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ఛైర్మెన్ పరిశ పుల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12 న ఖమ్మం జిల్లా వ్యాపితంగా మండల స్థాయిలో ప్రతిభా పాటవ పరీక్ష నిర్వహించి ప్రతిభ చూపిన మొదటి ముగ్గురును జిల్లా స్థాయికి ఎంపిక చేశామని, అలా ఎంపికైన అరవైమూడు మంది విద్యార్థులు జిల్లాలలోని 214 పాఠశాలల ప్రతినిధులుగా తమ ప్రతిభ ప్రదర్శించనున్నారని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఇ. సోమశేఖరశర్మ జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పరీక్షను ప్రారంభిస్తారని, ఈ పరీక్షకు జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికాలయాల నుండి ముగ్గురు చొప్పున పాల్గొంటున్నారని తెలిపారు. జిల్లా స్థాయి ప్రతిభాపాటవ పరీక్షకు ఎంపికైన ప్రతి విద్యార్థికి పరీక్ష సామాగ్రి కిట్ తోపాటు పార్టిసిపేషన్ సర్టిఫికెట్ బహుకరిస్తామని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | ఫిబ్రవరి 15, 2025 | www.navatelangana.com

చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన ఎమ్మెల్యే జారే



నవతెలంగాణ-దమ్మపేట

అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న మండల వాసులను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శుక్రవారం పరామర్శించారు. మండలంలోని గండుగులపల్లి గ్రామానికి చెందిన జారె నాగేశ్వరరావు, మొద్దులగూడెం గ్రామానికి చెందిన బొబ్బత్తుల మారేశ్వరావులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని చికిత్స జరుగుతున్న తీరును వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదే విదంగా ములకలపల్లి మండలం చాపరాలపల్లి గ్రామానికి చెందిన మిరియాల లక్ష్మికి కూడా పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు.

న్యాయమూర్తి పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- రంగారెడ్డి ఘటనపై భద్రాచలం న్యాయవాదుల నిరసన



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

రంగారెడ్డి జిల్లా అదనపు జిల్లా న్యాయమూర్తి పై శిక్ష పడిన ఖైదీ చెప్పు విసిరి దాడికి ప్రయత్నించడం దుర్మార్గమైన చర్య అని అంతటి చర్యక పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని సీనియర్ న్యాయవాది కొడాలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం భద్రాచలం బార్ అసోసియేషన్ న్యాయవాదులు కోర్టు ఆవరణ ముందు తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ సస్ మాట్లాడుతూ న్యాయవాదులకు, న్యాయమూర్తులకు రక్షణ కల్పించాలని కోరారు. న్యాయమూర్తి పై దాడి చేయడం అంటే న్యాయ వ్యవస్థ పైన దాడి చేసినట్టు అని ఆయన అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. దేశవ్యాప్తంగా ప్రతిరోజు ఏదో ఒకచోట న్యాయవాదులపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ కార్యదర్శి పి.శ్రీనివాస చారి, సీనియర్ న్యాయవాదులు పల్లపు మస్తాన్, పేరాల వెంకటేశ్వర్లు, పేరాల నాగరాజు, పాపిరాజు, తిరుమలరావు, సత్యనారాయణ, తాతా లలిత, సాధనపల్లి సతీష్, మల్లేష్, గౌతం, బి.శారద, సంధ్య, తరుణి, కొత్తపల్లి రాంబాబు, ప్రవీణ్, తదితర న్యాయవాదుల బృందం పాల్గొన్నారు.

నిరుపేద యువకుడికి అండగా నిలిచిన తహసీల్దార్

నవతెలంగాణ-మణుగూరు

పెద్దిపెల్లి గ్రామానికి చెందిన పొడియం దేవా ఇటీవల తీవ్ర రోడ్డు ప్రమాదానికి గురై కాలు విరిగింది. అతను హాస్పిటల్‌లో చేరినా ఆరోగ్య శ్రీ కార్డు లేకపోవడం, ఆర్థిక ఇబ్బందులు వల్ల ఆపరేషన్ చేయించుకునే అవకాశం లేకుండా పోయింది. వైద్యులు అతని కాలి శస్త్రచికిత్స కోసం రూ.90,000 ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ రాఘవరెడ్డి మానవతా దృక్పథంతో స్పందించి, స్వంత డబ్బులతో అతన్ని హైదరాబాద్‌కు పంపించి, ఆరోగ్య శ్రీ ద్వారా ఉచిత వైద్యం పొందేలా చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్ చొరవతో దేవాకు అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోంది. తహసీల్దార్ మానవీయ స్పందన పట్ల గ్రామస్తులు, దేవా కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తూ ఇలాంటి మంచి అధికారులే సమాజానికి అవసరం అని ప్రశంసించారు.

రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు

- తహసీల్దార్ ప్రత్యేక చొరవతో విద్యుత్ దీపాలు ఏర్పాటు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



తహసీల్దార్‌గా మామిడి అశోక్ కుమార్ బాధ్యతలు చేపట్టిన నాటినుండి సామాజిక సేవలో తాను సైతం అంటూ భద్రాచలం నుండి పర్ణశాల వరకు గుంతలుగా ఏర్పడిన రహదారులకు మరమ్మతులు చేస్తూ ప్రమాదాల నివారణకు తనదైన శైలిలో కృషి చేస్తున్నారు. భద్రాచలం-చర్ల ప్రధాన రహదారి రాజుపేట నుండి కన్నాయిగూడెం వరకు ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలను వెట్ మిక్స్‌తో పూడ్చించి ఏపీ అధికారులను కదిలించడంతో ఆ రహదారికి శాశ్వత పరిష్కార మార్గం దొరికిందని చెప్పవచ్చు. తాజాగా తూరుబాక గ్రామ శివారులోని డైవర్షన్ రహదారిలో రాత్రిపూట ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో తహసీల్దార్ ప్రమాదాల నివారణ కోసం డైవర్షన్ రహదారికి శుక్రవారం విద్యుత్ దీపాల ఏర్పాటును దగ్గర ఉండి పర్యవేక్షించారు. తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్ ప్రమాదాల నివారణకు చేస్తున్న కృషిని ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారని చెప్పవచ్చు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



- హాస్టల్ సిబ్బందికి పలు సూచనలు

నవతెలంగాణ-ఇల్లందు

మండలంలోని రొంపేడు బాలికల ఆశ్రమ పాఠశాలను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా డార్మెంటరీ రూమ్స్, కిచెన్ రూమ్స్, బాత్రూమ్స్, వాటర్ టాప్స్, క్లాస్ రూమ్స్, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఏజీహెచ్ఎస్ రొంపేడ్ పాఠశాలలకు అవసరమైనటువంటి మినరల్ వాటర్ ప్లాంట్, న్యూ కిచెన్ రూమ్, స్టీమ్ బాయిల్డ్, ట్యూబ్ లైట్స్, ఫ్యాన్స్, హాల్ మెస్ డోర్స్, పెయింట్స్ వాటర్ సోర్సెస్ మొదలగు సౌకర్యాలు కల్పించుటకు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ హాస్టల్‌కు ఇంకా మెరుగైనటువంటి వసతి కోసం పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు మంచి ప్లాన్‌తో రాతపూర్వకంగా రాసి ఇచ్చినట్లయితే ఈ పాఠశాల ప్రగతి కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు, డిప్యూటీ వార్డెన్, ఉపాధ్యాయులు హాజరయ్యారు.

రామాలయ సందర్శకులకు చెత్త కష్టాలు..!

- ఊరిలో చెత్త అంతా కరకట్ట పైనే
- సంధ్య వేళ పొగతో ఉక్కిరిబిక్కిరి



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

పేరుకి దక్షిణ అయోధ్య, సహజమైన ప్రకృతి అందాల నిలయం అటువంటి ఆహ్లాదకర వాతావరణానికి మారుపేరుగా నిలిచిన భద్రాద్రి విభజనకు తోడు అధికారుల నిర్లక్ష్య వైఖరి ఫలితంగా కాలుష్య పొగ కమ్ముకొని సాయంత్రం అయితే ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అయ్యే పరిస్థితి నెలకొంటుంది. భద్రాచలం డంపింగ్ యార్డ్‌ని వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొచ్చి చెత్త సమస్య నుండి కాపాడాలని స్థానిక ప్రజలతో పాటు రామయ్య దర్శనానికి వచ్చే యాత్రికులు సైతం నినదించే పరిస్థితి నెలకొన్నది. పోలవరం పేరుతో బీజేపీ సర్కార్ భద్రాచలాని ముక్కలు, చెక్కలుగా విభజించిన ఫలితంగా లక్షకు పైగా జనాభా కలిగి ఉన్న భద్రాచలం పట్టణంలో చెత్త వేసుకునే చోటు కూడా లేకుండా ఊరిలో సేకరించిన చెత్త మొత్తం రామాలయ సమీప కరకట్ట పైన వేసిన ఫలితంగా ఇటు జీవనదిగా పిలిచే పవిత్ర గోదావరి కలుషితమవుతుంది. అంతే కాకుండా ముదిరాజ్ బజార్, చప్ట దిగువ రామాలయం వీధి, శిల్పి నగర్ తదితర ప్రాంతాలు అపరిశుభ్రత వాతావరణం వర్షాకాలం దుర్గంధం విరజల్లడంతో పాటు దోమలు, పాములు, ఈగలు స్వైర విహారం చేస్తూ అనేక రకాల అంటువ్యాధులు ప్రబల్లే పరిస్థితి ఏర్పడుతుంది. అసలే ఏజెన్సీ ప్రాంతంలో వర్షాకాలం వచ్చే సీజనల్ జ్వరాలకు తోడు పంచాయతీ అధికారులు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కరకట్ట డంపింగ్ ప్రభావంతో ఈ ప్రాంతాలలో నివసించే ప్రజలతో పాటు రామయ్య దర్శనానికి వచ్చే యాత్రికులు రోగాల బారిన పడే పరిస్థితి నెలకొంది. రోజురోజుకీ పెరిగిపోతున్న చెత్తను నివారించేందుకు అధికారులు సంధ్య వేళలో చెత్తకు నిప్పట్టిచ్చే కార్యక్రమాన్ని చేపట్టిన ఫలితంగా సాయంత్రమైతే చాలు రామాలయ పరిసర ప్రాంతాలతో పాటు ఒకటి, రెండు, మూడు వార్డులు మొత్తం దట్టమైన పొగతో ఊపిరాడటమే కష్టమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ ప్రాంత ప్రజలు, రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థల పోరాట ఫలితంగా డంపింగ్ యార్డ్ పనులు ప్రారంభించినా ఆ నిర్మాణ పనులు నత్తనడకన సాగిన ఫలితంగా భద్రాచల పట్టణ ప్రజలతో పాటు యాత్రికులకు చెత్త కష్టాలు తప్పడం లేదు. నూతనంగా ఏర్పాటు చేపట్టిన డబ్బింగ్ యాడ్ సామర్థ్యం కూడా భద్రాచల పట్టణ జనాభాకు అనుగుణంగా లేదన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో భద్రాచలానికి చెత్త కష్టాలు ఇప్పుడప్పుడే తీరే పరిస్థితి కనిపించడం లేదు.

కాలుష్య పొగతో శ్వాస కోస సమస్యలు

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు
ఎం.బి.నర్సారెడ్డి



ఊర్లో చెత్తంతా రామాలయం కరకట్ట పైన వేసి తగలబెట్టడంతో ఈ ప్రాంత ప్రజలకు శ్వాసకోస సమస్యలు తలెత్తి అనేక రకాల జబ్బుల బారిన పడే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ ప్రాంతం నుండి డంపింగ్ యార్డ్‌ను తరలించాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పాదయాత్రను చేపట్టి అనేక రకాల పోరాటాలు చేసిన ఫలితంగా ఊరి చివర్లో డంపింగ్ యార్డ్‌కి ప్రభుత్వం నిర్ణయించింది. యాడ్ నిర్మాణంలో అలసత్వం ప్రదర్శించిన ఫలితంగా ఆ పనులు నత్తనడకన సాగుతున్నాయి. అధికారులు డంపింగ్ యార్డ్‌ని వీలైనంతత్వరగా అందుబాటులోకి తీసుకొచ్చి రామాలయ ప్రాంతాన్ని కాలుష్య కోరల నుండి కాపాడాలి. అంతేకాకుండా ఎంతో పవిత్రమైన నదిగా పిలవబడి గోదావరినదిలో ఐటీసీ బీపీఎల్ నుండి వచ్చే కెమికల్ నీళు కలవడంతో ఈ ప్రాంత ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారు. ప్రభుత్వ పెద్దలు ఐటీసీ నుండి వచ్చే వ్యర్థ జలాలను గోదావరిలో కలవకుండా చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించక తప్పదు. స్థానిక ఎమ్మెల్యే ఈ విషయంలో వెంటనే కల్పించుకొని ఐటీసీ నుండి వచ్చే వరద జలాలను గోదావరినదిలో కలవకుండా చర్యలు చేపట్టాలి. రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం ముంపు పేరుతో బీజేపీ సర్కార్ భద్రాచలం ముక్కలు, చెక్కలుగా విభజించిన ఫలితం ఇప్పుడు భద్రాచలం పై స్పష్టంగా కనబడుతుంది.

స్థానిక ప్రజలతో పాటు యాత్రికులకు తీవ్ర ఇబ్బందులు

సీపీఐ(ఎం) పట్టణ కమిటీ సభ్యులు ధనకొండ రాఘవయ్య



ప్రతిరోజు ఊరిలో సేకరించిన చెత్త మొత్తం తీసుకొచ్చి రామాలయ పరిసర ప్రాంతంలోనే పంచాయతీ ట్రాక్టర్లతో డంపు చేయటం సాయంత్రమైతే ఆ చెత్తను తగలబెట్టడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వీలైనంత త్వరగా డంపింగ్ యార్డ్‌ను అందుబాటులో తీసుకొచ్చి ఈ ప్రాంతంలో చెత్తను వేసే కార్యక్రమాన్ని నిలిపివేయాలి. ఇప్పటికే జులై, ఆగస్టులో వచ్చే వరదలతో ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా నష్టపోవడానికి తోడు చెత్తతో వచ్చే అంటువ్యాధులు ఈ ప్రాంత ప్రజలను పీడిస్తున్నాయి.

ముడు కొలువులు...ఒక డాక్టరేట్

- కామర్స్ విభాగంలో దావా వేణుకు డాక్టరేట్



నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

పోటీ ప్రపంచంలో ఒక ప్రభుత్వ ఉద్యోగం సాధించాలి అంటే ఎంతో కష్టంగా వున్న సమయంలో ఒక యువకుడు ఆరు నెలలు వ్యవధిలో ముడు ప్రభుత్వ ఉద్యోగులు సాధించి అందరకీ ఆదర్శంగా నిలిచాడు. అంతేకాక కామర్స్ విభాగంలో డాక్టరేట్ పట్టా కూడా తీసుకున్నాడు. మండలంలోని రాజపురం గ్రామానికి చెందిన దావా వేణు ఉస్మానియా యూనివర్శిటీలో కామర్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఇంపాక్ట్ ఆఫ్ ఫ్యూచర్ వోలటాలిటీ ఆన్ ఈక్విటి మార్కెట్ విత్ రిఫరెన్స్ టు ఎన్‌యస్‌ఈ ఇండియా ఎస్టడి అనే అంశం పై పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ పట్టాను ఉస్మానియా యూనివర్శిటీ అధికారులు సమక్షంలో పట్టా తీసుకున్నట్టు దావా వేణు తెలేజేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ...పదవ తరగతి వరకు సొంత గ్రామం అయిన రాజపురంలో శ్రీ చైతన్య విద్యాలయంలో చదుకొని, డిగ్రీ సత్తుపల్లి కాకతీయ కళాశాలలో పూర్తి చేసి పీజీ ఎంట్రన్స్ ఉస్మానియా యూనివర్సిటీలో స్టేట్ 6వ ర్యాంక్ సాధించి పీజీ పూర్తి చేసుకొని జాతీయ స్థాయిలో ఫెలోషిప్ (జేఆర్ఎఫ్)ను సాధించారు. అక్కడే పీహెచ్‌డీ పూర్తి చేసుకొని పట్ట తీసుకున్నారు. మొట్ట మొదటి ఉద్యోగం కేంద్ర ప్రభుత్వం ఉద్యోగం అయిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ముంబాయి)లో రావడం జరిగింది. అక్కడ ఉద్యోగం చేస్తున్న ఆరు నెలలు సమయంలో మరో ఉద్యోగం డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా రావడంతో అన్నపురెడ్డిపల్లి మహాత్మా జ్యోతి బాపులే డిగ్రీ బాలురు కళాశాలకు వచ్చి అక్కడ లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తున్న సమయంలో జూనియర్ కళాశాలలో లెక్చరర్ ఉద్యోగం వచ్చింది. 3 ఉద్యోగాలు ఆరు నెలలు సమయంలో ఒక్కసారే రావడం చాల సంతోషంగా ఉందని అన్నారు. తల్లితండ్రులు దావా వెంకటరామయ్య-రమణ వ్యవసాయం చేస్తూ ఎంతో కష్టపడి చదివించారని, వారి కష్టానికి ప్రతిఫలంగా ముడు ఉద్యోగాలు, ఒక డాక్టరేట్ సాధించి వారికి మంచి పేరు తీసుకు వచ్చానని పేద విద్యార్థులు కోసం నా వంతు ఎప్పుడు నా శక్తి మేరకు వారికి సహకారం అందిస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ఉస్మానియా యూనివర్శిటీ కామర్స్ అధ్యాపక బృందం, మహాత్మా జ్యోతి బాపులే కళాశాల ప్రిన్సిపాల్ బురాన్, అధ్యాపక బృందం పలువురు గ్రామ ప్రజలు, మిత్రులు అభినందనలు తెలియజేశారు.

సారపాక పంచాయతీపై స్థానికేతరుల కన్ను..!?

- అధికార పార్టీలో అధికంగా ఆశావాహులు
- స్థానికేతరులను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు..?
- ఇండిపెండెంట్ అభ్యర్థి బరిలో మాజీ సర్పంచ్ చందు నాయక్
- పోటీ బరిలో నిలవనున్న టీడీపీ కూటమి?



సారపాక గ్రామపంచాయతీ కార్యాలయం

నవతెలంగాణ-బూర్గంపాడు

పారిశ్రామిక ప్రాంతమైన సారపాక గ్రామపంచాయతీ పై స్థానికేతరుల కన్ను పడింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు కూడా జరిగే అవకాశాలు ఉండటంతో సారపాక గ్రామపంచాయతీలో ఎన్నికల సందడి కనిపించనుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి పంచాయతీ ఎన్నికల్లో కొందరు స్థానికేతరులు స్థానికంగా ఓటు హక్కు సంపాదించు కోవడంతో జరుగనున్న పంచాయతీ ఎన్నికల్లో స్థానికులకు, స్థానికేతుల మధ్య పంచాయతీ పోరు జరగనుంది. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీలోనే ఆశావాహులు అధికంగా ఉండటంతో, సర్పంచ్ అభ్యర్థి ప్రకటన ఆ పార్టీకి కొత్త తలనొప్పిని తెచ్చే అవకాశాలు ఉన్నాయని రాజ కీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అదే క్రమంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న కొందరు నాయకులు స్థానికేతరులను సర్పంచ్ అభ్యర్థి బరిలో నిలిపేందుకు తమకున్న రాజకీయ పలుకుబడితో ముందుకు కదులుతున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా ఇండిపెండెంట్ అభ్యర్థిగా సారపాక మాజీ సర్పంచ్ ధారావత్ చందు నాయక్ బరిలో దిగే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా టీడీపీ కూటమి కూడా సర్పంచ్ అభ్యర్థిని బరిలోకి దింపే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి సర్పంచ్ అభ్యర్థిగా బాణావత్ శ్రీను నాయక్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.

ఆరేండ్లుగా ఎదురుచూపులు..!

తాజాగా ఎంపీటీసీల స్థానాల ప్రకటన వెలువడటంతో పాటు సారపాకలో ఆరు ఎంపీటీసీ స్థానాలకు ముసాయిదా జాబితా ప్రకటన రావడంతో ప్రజలు ఈసారి పంచాయతీ ఎన్నికలు ఖచ్చితంగా జరుగుతాయనే రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సుమారు 33వేల జనాభాకు పైగా ఉన్న సారపాక పంచాయతీలో 2018 నుంచి ఎన్నికలు జరగడం లేదు. దీంతో పంచాయతీకి పాలకవర్గం లేకపోవడంతో అభివృద్ధికి ఆటంకంగా మారిందని చెప్పవచ్చు. ఈ సారైనా ఎన్నికలు జరుగుతాయా...? లేదా? అని ఎదురు చూస్తున్న ప్రజలకు సందిగ్ధత వీడనుంది. 2019లో మున్సిపాలిటీగా మారుస్తారనే ప్రచారంతో పంచాయతీ ఎన్నికలు జరగ లేదు. అనంతరం జరిగిన పురపాలిక ఎన్నిక లోనూ సారపాక పేరు కనిపించలేదు. అయితే గత ఆరేళ్లుగా పాలకవర్గం లేక అధికారుల పాలనలో పంచాయతీ కార్యకలాపాలు నడుస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసి ఏడాది కూడా దాటింది. ఈ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలని ఇటీవల రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీనికి సంబంధించి అధికారులు కూడా ఎన్నికలకు సన్నద్ధమయ్యారు. అయితే ముందుగానే ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు మండల అధికార యంత్రాంగం ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి ముసాయిదా జాబితాలో సారపాకలో ఆరు ఎంపీటీసీ స్థానాలు ఉండటంతో ఖచ్చితంగా పంచాయతీ ఎన్నిక ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. ఎన్నికలు జరిగితే సారపాక పంచాయతీ మరింత అభివృద్ధి చెందుతుందని ప్రజలు భావిస్తున్నారు.

సారపాకపై స్థానికేతరుల కన్ను..!

ఎన్నికల షెడ్యూల్ ప్రకటన రాకముందే బూర్గంపాడు మండలంలో గల సారపాకలో గ్రామపంచాయతీ ఎన్నికల సందడి సంతరించుకుంది. ఈ క్రమంలో ఈ పంచాయతీ పై స్థానికేతరుల కన్ను పడింది. సర్పంచ్‌గా పోటీ చేసేందుకు వేరే మండలాలకు చెందిన కొందరు నాయకులు సర్పంచ్‌గా తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు వ్యూహరచన చేస్తున్నారు. ప్రధాన కాంగ్రెస్ పార్టీలో సర్పంచ్ అభ్యర్థిత్వానికి పోటీ పెద్ద ఎత్తున ఉంది. ఇందులోనూ స్థానికేతరులు పలువురు టిక్కెట్లు ఆశించే లిస్టులో ఉన్నారు. స్థానికంగా ఓటు హక్కును పొందుకున్న వారు కాంగ్రెస్ పార్టీలోని కొందరు క్రియాశీలక నాయకుల ద్వారా సర్పంచ్ అభ్యర్థిగా పోటీ బరిలో నిలిపి దిగేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు కాంగ్రెస్ పార్టీలోని నాయకులు స్థానికేతరులను ప్రోత్సహించడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీలో స్థానికేతరులకు సర్పంచ్ అభ్యర్థిత్వం ఖరారు అయితే ఆ పార్టీలోనే రెబల్స్ బెడద ఉండే అవకాశాలు ఉన్నాయి. ఎన్నికలు షెడ్యూల్ రాక ముందే గ్రామపంచాయతీలో ఎక్కడ చూసినా పంచాయతీ పోరు పై చర్చ కొనసాగుతోంది.



టెండర్లను ఆహ్వానించాలి

- తునికాకు ఫ్రూనింగ్ పనులు ప్రారంభించాలి
- ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం, టీఏజీఎస్

నవతెలంగాణ-ఇల్లందు

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు ఇతర అడవి పై జీవిస్తున్న వారికి రెండొవ పంటగా ఉన్న తునికాకు టెండర్లను ఆహ్వానించి, ఫ్రూనింగ్ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం అటవీ రేంజర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు అబ్దుల్ నబి, వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శులు ఆలేటి కిరణ్, కొడెం బోస్ మాట్లాడుతూ అటవీ శాఖ అధికారులు నెలలు గడుస్తున్నా గాని టెండర్లు పిలవకుండా, ఫ్రూనింగ్ పనులు చేపట్టకుండా కాలయాపన చేయడం వలన గిరిజనులు నష్టపోతున్నారని అన్నారు. వేసవి కాలంలో రెండొవ పంటగా తునికాకు కార్మికులకు ఆర్థిక వెసులు బాటును ఇస్తున్న తునికాకు సేకరణ పై నిర్లక్ష్యం చేయడం సరికాదని అన్నారు. ఈ పాటికి ఫ్రూనింగ్ పనులు ప్రారంభం కావాల్సింది నిర్లక్ష్యం కారణంగా ఇంత వరకు టెండర్లను పిలవకపోవడం వెనక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. జీవనోపాధిగా ఉన్న తునికాకు పనులు పనులను ప్రారంభించాలని, పెండింగ్ బోనస్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో మన్నెం మోహన్ రావు, తాళ్లూరి కృష్ణ, వజ్జా సురేష్, రాజమౌళి, రాజు, కాంత, కౌసల్య, అమ్మి, వెంకన్న, వీరభద్రం భీముడు, సంతోష, మంగ, భవాని, తదితరులు పాల్గొన్నారు.

ఐడీబీఐ ప్రయివేటీకరణ నిలిపివేయాలి

- మార్చ్ 24, 25 తేదీల్లో బ్యాంకుల సమ్మె



నవతెలంగాణ-కొత్తగూడెం

ఐడీబీఐ ప్రయివేటీకరణ నిలిపివేయాలని, బ్యాంకు ఎంప్లాయిస్ సమస్యల పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ బ్యాంకు సిబ్బంది సమ్మె చేస్తున్నట్టు యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. శుక్రవాం కొత్తగూడెం ఎస్‌బిఐ రీజనల్ కార్యాలయం ఎదుట ఎస్‌బిఐ ఆఫీసర్స్ అసోసియేషన్, స్టేట్ బ్యాంక్ స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్బిఐ ఆఫీసర్స్ అసోసియేషన్ రీజనల్ సెక్రటరీ శ్రీకాంత్ మాట్లాడుతూ యునైటెడ్ ఫోరం బ్యాంక్ పిలుపు మేరకు మార్చ్ 24, 25 తేదీల్లో సమ్మెకు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో శుక్రవారం నుంచి పోరాట కార్యక్రమాలు ప్రారంభించినట్లు తెలిపారు. సమ్మె చేపట్టడానికి ప్రధాన కారణాలు వివరిస్తూ వారంలో 5 రోజుల బ్యాంకింగ్ విధానం ఉండాలని, ఐడిబిఐ ప్రయివేట్ కరణ నిలిపివేయాలని, నూతన్ పెన్షన్ రద్దు చేయాలని, బ్యాంకు స్టాఫ్‌కు భద్రత కల్పించాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే మార్చి 24, 25 తేదీలలో దేశవ్యాప్తంగా సమ్మె చేస్తామంటూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆఫీసర్స్ అసోసియేషన్ కొత్తగూడెం రీజినల్ సెక్రటరీ శ్రీకాంత్, అవార్డు స్టాఫ్ రీజనల్ సెక్రటరీ మల్లారెడ్డి, యుఎస్‌బీఐ నాయకులు పవన్ కుమార్, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ గూడాల్లో దుస్తుల పంపిణీ

నవతెలంగాణ-కొత్తగూడెం

లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమల్ల గ్రామ శివారు గంగమ్మ కాలనీ, క్రాంతి నగర్, మైలారం మధ్య గుంపు, జీవాల వాగు (పునుకుడు చెలక) గొత్తి కోయ గ్రామాలలో గిరిజనులకు తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ విద్యా నగర్ కాలనీ, కొత్తగూడెం వారు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొల్లు నాగేశ్వరరావు మాట్లాడుతూ...గత పదేళ్లుగా ప్రతి సంవత్సరం నాణ్యమైన వస్త్రాలను సేకరించి వివిధ గిరిజన గ్రామాల్లో పంపిణీ చేయటం జరిగుతుందని దానిలో భాగంగా ఈ సంవత్సరం గత నెల రోజులుగా వస్త్రాలను సేకరించి ఈ గ్రామాలకు రావటం జరిగిందని, ఈ కార్యక్రమాన్ని చేయటానికి మాకు సహకారం మాజీ సర్పంచు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

సెక్రటరీ సురేష్ కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. సహకరించిన తేరాల వీరభద్రంకి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సభ్యులు పాండురంగారావు, విజయమోహన్, అంజనానందం, సీతారామ శాస్త్రి, మైనేని నాగేశ్వరరావు, కామేశ్వరరావు, కొండా రాములు, జనార్ధనరావు, ధర్మారావు, అక్కినేని మురళి, ఆర్‌పి.జోసెఫ్, గురుమూర్తి,ఎం. రాంప్రసాద్, గ్రామ పెద్దలు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



280 కింటాళ్ళ రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-టేకులపల్లి

మండలంలోని కిష్టారం గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం 280 క్వింటాళ్లను లారీలో తరలిస్తుండగా టాస్క్ ఫోర్స్ పోలీసులు తెల్లవారుజామున ఛేజ్ చేసి పట్టుకున్న సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని కిష్టారం, బర్లగూడెం తదితర గ్రామాల్లో సేకరించిన, రేషన్ బియ్యాన్ని తరతిస్తున్నారనే సమాచారంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. వారి రాక తెలుసుకున్న అక్రమార్కులు బర్లగూడెం మీదుగా, గుండాల రోడ్డుకు చేరుకునే ప్రయత్నం చేయగా, పోలీసులు వెంటపడి పట్టుకున్నట్లు సమాచారం. బియ్యం లారీతో సహా డ్రైవర్, క్లీనర్‌ని అదుపులోకి తీసుకొని కాచనపల్లి పోలీస్ స్టేషన్‌లో టాస్క్ ఫోర్స్ పోలీసులు అప్పగించారు. ఇదిలా ఉండగా, లారీ డ్రైవర్, క్లినర్‌తో పాటు బియ్యం అక్రమంగా తరలించే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం.

పలు శుభకార్యక్రమాల్లో పాల్గొన్న మెచ్చా

నవతెలంగాణ-దమ్మపేట

బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శుక్రవారం మండలంలో పర్యటించి పలు శుభకార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండల కేంద్రం దమ్మపేటకు చెందిన పరాంకుశం తాండవ కృష్ణ-కృష్ణవేణి దంపతుల కుమారుడు చైతన్య రిసెప్షన్ వేడుకలో పాల్గొన్న మెచ్చా నవదంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సోమవరపు మనోజ్ కుమార్తె మొదటి పుట్టినరోజు వేడుకలో పాల్గొన్న మెచ్చా చిన్నారిని అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్‌జిన్నా, పాకనాటి శ్రీను, యార్లగడ్డ శ్రీనివాసరావు, దారా జనార్ధన్, సోమవరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

టేకులపల్లి : మండలంలోని కోయగూడెం ఉపరితల గనిలో పోలీసులు కోయగూడెం ఓసీలో పనిచేసే అధికారులు, సిబ్బందికి అవగాహనా సదస్సు నిర్వహించినట్టు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఇల్లందు డీఎస్పీ చంద్రభాను మాట్లాడారు. ఈ మధ్యకాలంలో జరిగే దొంగతనాల గురించి, దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సీసీ కెమెరాలు ప్రాముఖ్యతను, దొంగతనాల పట్ల సింగరేణిలో పనిచేసే సెక్యూరిటీ సిబ్బందికి, పలు సూచనలు చేశారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్నటువంటి, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, డ్రగ్స్, ఇల్లీగల్ యాక్టివిటీస్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ టి.సురేష్, బోడు ఎస్సై పి.శ్రీకాంత్, కోయగూడెం ఓసీ ప్రాజెక్టు మేనేజర్ సౌరబ్ సుమన్, డిప్యూటీ మేనేజర్ రవికుమార్, అండర్ మేనేజర్ మధుసూదన్, సెక్యూరిటీ ఇన్‌చార్జి అంజిరెడ్డి పాల్గొన్నారు.

చిరుమళ్ళ జాతరలో వీరి సేవలు మరువలేనివి

కరకగూడెం : మండల పరిధిలోని చిరుమల్ల సమ్మక్క-సారలమ్మ జాతర మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో ఆదివాసీ సంప్రదాయాల మధ్య నిర్వహించారు. జాతర ఏర్పాట్లలో పంచాయతీరాజ్ శాఖ ఎంపీడీవో దేవ వర కుమార్, రెవిన్యూ శాఖ తహసీల్దార్ నాగప్రసాద్, వైద్యశాఖ డాక్టర్ కారం మధు సిబ్బంది, ఆర్డబ్ల్యూఎస్ డీఈ, 16 గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఐదు రోజులుగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు నిర్వహించారు. తహసీల్దార్ నాగప్రసాద్, ఎంపీడీవో దేవ వర కుమార్, మండల ఎస్ఐ రాజేందర్ మూడు విభాగాలుగా ఏర్పడి జాతరను విజయవంతం చేశారు. జాతర మొదలు దగ్గర నుంచి టెంట్లు, వాటర్, బ్లీచింగ్, పారిశుద్ధ్యం పనులు నిత్యం చేస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాల అందించారు. అధికారుల సేవలను ప్రజలు అభినందించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తగూడెం : విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని దీనికి సహకరించాలని చుంచుపల్లి విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మీ నరసింహారావు కోరారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు బృందావనం, చుంచుపల్లి సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల నిమిత్తం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని చెప్పారు. ప్రాంతాలు విద్యానగర్ కాలనీ, నంద తండా, హౌసింగ్ బోర్డు, రాందాస్ తండా, చుంచుపల్లి తండా, ఎన్‌కె. నగర్, బధావత్ తండా, బాబు క్యాంప్, రాంనగర్, సర్వరం, బస్టాండ్, పోస్ట్ ఆఫీస్ సెంటర్, పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని, కావునా విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సమ్మక్క-సారలమ్మలను దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-చంద్రుగొండ



బెండలపాడు గ్రామ శివారులో జరుగుతున్న సమ్మక్క-సారలమ్మల జాతర మహోత్సవంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మండల నాయకులకు ప్రత్యేక సన్మానం చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో జాతర కమిటీతో పాటు గ్రామ కమిటీ, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్రీడా, సంస్కృతిక, సాహిత్య పోటీలు

- అసోసియేట్ డీన్ జే.హేమంత్ కుమార్

అశ్వారావుపేట : స్థానిక వ్యవసాయ కళాశాలలో 19, 20, 21న మూడు రోజుల పాటు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం స్థాయి సిబ్బందికి క్రీడా, సంస్కృతి, సాహిత్య పోటీలు నిర్వహించనున్నామని కళాశాల అసోసియేట్ డీన్ జే.హేమంత్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఈ పోటీల్లో విశ్వవిద్యాలయం పరిధిలోని నాలుగు జోన్ల నుండి బోధన సిబ్బంది పాల్గొంటారని, విశ్వవిద్యాలయంలోని పలువురు ప్రముఖ అధికారులు విచ్చేస్తారని అన్నారు.

కులగణన సర్వేను పొడిగించడం హర్షనీయం

- సేవ్ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ కన్వీనర్ జలాల్

నవతెలంగాణ-కొత్తగూడెం

రాష్ట్ర ప్రభుత్వం కుల గణన సర్వేకు మరోసారి అవకాశం కల్పించడం హర్షనీయమని సేవ్ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ కన్వీనర్ జలాల్ అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక నిర్ణయాల్లో దూకుడుగా వ్యవహరించినప్పటికీ ప్రజలు ప్రజాస్వామ్య వాదుల విజ్ఞప్తుల మేరకు వారి నిర్ణయాలు పునర్ సమీక్షించుకొని ప్రజాస్వామ్య బద్ధంగా ముందుకు వెళుతుండడం స్వాగతించాల్సిన అంశమే అని ఆయన తెలిపారు. సర్వేలో అనేక మంది పాల్గొనడంతో మరోసారి అవకాశం కల్పించడానికి ప్రజలు కుల సంఘాలు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి సర్వేలో పాల్గొనేలా చేయాలని ఆయన తెలిపారు. కుల గణన ప్రకారం రాష్ట్రంలో ఎవరి వాటా ఎంతో తేల్చి ఉద్యోగాలలో సంక్షేమ పథకాలలో రాజకీయ పదవులలో సమన్యాయం చేయాలని ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

గొంగడి త్రిషను యువత ఆదర్శంగా తీసుకోవాలి

- క్రీడలతోనే మానసిక ఉల్లాసం సాధ్యం
- మాజీ సర్పంచ్ ధరావత్ చందునాయక్

నవతెలంగాణ-బూర్గంపాడు



భద్రాచలంలో పుట్టి పెరిగిన క్రీడా కారిణి గొంగడి త్రిష క్రికెట్ రంగంలో రాణిస్తూ అంతర్జాతీయ స్థాయికి చేరుకుని ఈ ప్రాంత ప్రతిష్టను పెంచిందని, త్రిషను యువత ఆదర్శంగా తీసుకోవాలని సారపాక గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ ధారావత్ చందు నాయక్ అన్నారు. ఈ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయని ఆయన అన్నారు. శుక్రవారం సారపాకలోని రాజీవ్ నగర్ క్రికెట్ గ్రౌండ్లో సంత్ శ్రీ సేవా లాల్ మహరాజ్ జయంతి సందర్భంగా 2025 సూపర్ -8 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలను చందు నాయక్ ప్రారంభించి, మాట్లాడారు. యువత చెడు వైపు పయనించకుండా ప్రభుత్వాలు క్రీడలను నిర్వహిస్తూ యువతను ప్రోత్సహించాల న్నారు. ఏజెన్సీలో గ్రామీణ ప్రాంతాల నుంచి ఎందరో క్రీడాకారులు క్రీడల్లో రాణించారని, తాజాగా టోర్నమెంట్లో ప్రథమ, ద్వితీయ బహుమతులను చందునాయక్, పాకాల దుర్గాప్రసాద్‌లు విజేతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సారపాక సంత్ సేవాలాల్ మహా రాజ్ కమిటీ సభ్యులు గుగులోత్ రాంబాబు, నరేష్, చంద్ర, శంకర్, రంజిత, ఏసు, చందర్, రఘు, విక్రమ్, కిషన్, రాంబాబు పాల్గొన్నారు.

క్షతగాత్రుడు మృతి

అశ్వారావుపేట : ప్రమాదానికి గురైన వ్యక్తి చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య రాతపూర్వక ఫిర్యాదు మేరకు ఎస్‌హెచ్ఓ ఎస్ఐ యయాతి రాజు తెలిపిన వివరాల ప్రకారం...అశ్వారావుపేటలోని ఇందిరా కాలనీకి చెందిన తానికొండ వెంకటేశ్వర్లు (58) చికెన్ షాపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 28వ తేదీ సాయంత్రం పని ముగించుకుని ఇంటికి వస్తున్న క్రమంలో అశ్వారావుపేట-జంగారెడ్డి గూడెం రోడ్‌లో గల రిలయన్స్ మార్ట్ సమీపంలో జంగారెడ్డిగూడెం వైపునుండి వస్తున్న లారీ ఢీ కొట్టింది. విషయం తెలుసుకున్న ఎస్‌హెచ్ఓ ఎస్ఐ యయాతి రాజు పోలీస్ సిబ్బందిని పంపి లారీని అదుపులో తీసుకుని ప్రమాదానికి గురైన క్షతగాత్రుడుని ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంత హైద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. శుక్రవారం భార్య చిట్టెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదనపు ఎస్ఐ రామ్మూర్తి దర్యాప్తు చేపట్టారు.

ఎస్పీని ఆహ్వానించిన కొమరం వంశీయులు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



మండలంలోని పెద్దూరు గ్రామంలో జరిగే కొమరం వంశీయుల ఇలవేల్పు రెక్కల రామక్క జాతరకు ఎస్పీ రోహిత్ రాజు తప్పక రావాలని రెక్కల రామక్క ఆలయ కమిటీ సభ్యులు, కొమరం వంశీయులు కొమరం రామ్మూర్తి, కొమరం రాంబాబు, రఘుపతి, చంద్రం, వెంకటేశ్వర్లు, సతీష్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఆహ్వాన ప్రతిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పెద్దూరులో జరిగే ఈ రెక్కల రామక్క జాతర కొమరం వంశీయులు గిరిజన ఆచార సాంప్రదాయాలతో ఈ నెల 18వ తేదీ నుండి 22వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జాతర కన్నుల పండువగా నిర్వహించడం జరుగుతుందన్నారు. జాతర కార్యక్రమాలపై ఎస్పీకి వివరించామని తెలిపారు. దీనికి గాను ఎస్పీ సానుకూలంగా స్పందించారని వారు చెప్పారు. అనంతరం కమిటీ సభ్యులు, కొమరం వంశీయులు కలెక్టర్ జితేష్ వి.పాటిల్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుకు సైతం ఆహ్వానం అందజేయడం జరుగుతుందని చెప్పారు.

వణికిస్తున్న బర్డ్ ఫ్లూ...

- సరిహద్దుల్లో చెక్ పోస్టులు
- పడిపోయిన చికెన్ అమ్మకాలు
- జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తం
- ప్రభుత్వం సూచించేంత వరకు చికెన్ రుచులకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-కొత్తగూడెం

బర్డ్ ఫ్లూ వ్యాధి ప్రజల్ని వణికిస్తుంది...ముఖ్యంగా కోళ్లల్లో కనిపించే ఈ వ్యాధి వలన కోడి మృతి చెందే ప్రమాదం ఉంది. దీంతో ఇప్పటికే అనేక కోళ్ల ఫారాల్లో వ్యాధి లక్షణాలు కనిపించిన కోళ్లను కాల్చివేయడం, సమాధి చేయడం జరిగింది. మనుషులకు ప్రబలే ప్రమాదం ఉందని ప్రచారం సాగుతున్న తరుణంలో ప్రజల్లో తీవ్ర భయాందోళన చోటు చేసుకుంది.

ఆంధ్రప్రదేశ్‌కు సరిహద్దు రాష్ట్రం, సరిహద్దు జిల్లాగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికార యంత్రం అప్రమత్తం అయింది. రాష్ట్ర ప్రభుత్వం బర్డ్ ఫ్లూ వ్యాధిపట్ల తీవ్రంగా స్పందించింది. విపరీతంగా బర్డ్ ఫ్లూ ప్రబలుతున్న నేపథ్యంలో కోడి మాంసం అమ్మకాలు, కోళ్ల రవాణాపై కొన్ని ఆంక్షలు, నిషేధం ప్రకటించింది. కోడి మాంసం ప్రియులు కోడి మాసం, కోడి గుడ్లను తినవద్దని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలో కోడి మాంసం ఒక్కసారిగా అమ్మకాలు పడిపోయాయి. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో వ్యాపారస్తులు ఇప్పటికే కోళ్లను నిలువ చేసుకున్నవారు గిట్టుబాటు ధరలకు అమ్ము కుంటున్నారు. అయినప్పటికీ ప్రజల్లో భయం తరుముతుంది. చికెన్, కోడిగుడ్లు తినాలి అనుకున్న వారు కొంతకాలం వాటికి దూరంగా ఉండాలని సంబంధిత శాఖ అధికారులు కోరుతున్నారు.



చెక్ పోస్టుల వద్ద పోలీసులు అడ్డుకున్న వాహనాలు

చెక్‌పోస్టుల ఏర్పాటు

రాష్ట్ర వ్యాప్తంగా బర్డ్ ఫ్లూ ప్రబలుతున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇతర ప్రాంతాల నుంచి కోళ్ల రవాణా తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించకుండా సరిహద్దు ప్రాంతాల్లో పటిష్టమైన చర్యలు తీసుకుంది. సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టు ఏర్పాటు చేసింది. భద్రాద్రి కొత్తగూడెం సరిహద్దుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ నుండి భద్రాద్రి జిల్లా సరిహద్దులు అయిన ఆశ్వారావుపేట, చర్ల, దమ్మపేట పరిసర ప్రాంతాల్లోని చెక్ పోస్టులను పటిష్టపరిచి తనిఖీలు నిర్వహిస్తున్నారు. కోళ్ల వ్యానులు జిల్లాలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పక్క రాష్ట్రం నుంచి దిగుమతి చేసుకుంటున్న కోళ్లను నిలిపివేయాలని, జిల్లాలోని కోళ్ల ఫామ్ హౌస్ యాజమాన్యాలకు ప్రభుత్వ అధికారులు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, ఫామ్ హౌస్‌లో ఉన్న కోళ్లల్లో ఏమాత్రం జబ్బు లక్షణాలు కనిపించిన వెంటనే వాటిని లోతైన గోతులు తీసి వాటిలో పూడ్చివేయాలని సంబంధిత పశు సంవర్ధక, రెవెన్యూ శాఖల అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని ఫామ్ హౌస్లలో పూర్తిగా కోళ్లు లేకుండా ఖాళీ చేయించారు. ముందస్తు చర్యలు తీసుకోవాలని ఫారం యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేశారు. కొన్నాళ్ళతో పాటు కోడి మాంసం విక్రయాలు నిలుపుదల చేయాలని కోరారు. ప్రజలు కోడి మాంసం రుచికి కొంత కాలం దూరంగా ఉండాలని, బర్డ్ ఫ్లూ పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలంటున్నారు.

తగ్గిన చికెన్ అమ్మకాలు

చికెన్ వ్యాపారులకు తెలంగాణ ప్రభుత్వం షాకింగ్ వార్నింగ్ జారీ చేసింది. కోళ్లకు సోకుతున్న బర్డ్ ఫ్లూ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని ఉభయ గోదావరి జిల్లాలతో పాటు ఇతర జిల్లాల్లో భారీ సంఖ్యలో కోళ్ల మరణాలకు ఏవియన్ ఇన్ ఫ్లూయెంజా (హెచ్ 5 ఎన్1-బర్డ్ ఫ్లూ) వైరస్ కారణమని నిర్ధారించారు. కొన్ని రోజులు కోళ్ల పెంపకం, మాంసం వినియోగం పట్ల జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వం ప్రజలను హెచ్చరించింది. ఈ క్రమంలో కోడి మాంసం అమ్మకాలు తగ్గాయి. కానీ, రేటు మాత్రం ఏమాత్రం తగ్గలేదు. కేజి చికెన్ ధర రూ.180ల నుండి రూ.200ల వరకు పలుకుతుంది.

జాగ్రత్తలు తీసుకోవాలి

కోళ్లలో బర్డ్ ఫ్లూ ప్రభలుతున్న తరుణంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యాధి ప్రభల కుండ అధికారులు కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేశారని జిల్లా పశుసంవర్ధక శాఖ జిల్లా సంచాలకులు డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లాలో సుమారు 35 వరకు కోళ్ల ఫారాలు ఉన్నాయి. వాటిని వెటర్నీ డాక్టర్స్ 24 గంటలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. మన జిల్లాలో ఇప్పటి వరకు ఎలాంటి ప్రమాదం లేదు. ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. కోళ్లలో లక్షణాలు కనిపిస్తే వెంటనే సమాచారం అందజేయాలి. కోళ్ల ఫారాల్లో సున్నం చల్లాలి, రవాణా చేసే వాహనాలు రసాయనాలతో శుద్ధిచేయాలి. ఫామ్‌లో పనులుచేసే కూలీలు బయో సెక్యూరిటీ పాటించాలి. ఫామ్‌లోకి వెళ్లే ముందు, బైటికి వచ్చేముందు కాళ్లు, చేతులు శుభ్రంగా కడుక్కోవాలి, మనుషులకు కళ్లు ఎర్ర బడటం, తలతిరగడం, జలుబు లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చే వరకు ఫామ్‌ల్లో కోళ్లను నిల్వ ఉంచ రాదు, ఇతర ప్రాంతాల నుండి దిగుమతి చేసుకోరాదు.

డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, పశుసంవర్ధక శాఖ

వసంత పంచమి పేరుతో ముందస్తు అడ్మిషన్లు

- ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రామ్ చరణ్

నవతెలంగాణ-కొత్తగూడెం



వసంత పంచమి పేరుతో ముందస్తు అడ్మిషన్స్ చేస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, విద్యా సంస్థల అడ్మిషన్స్ దోపిడీకి తల్లిదండ్రులు, విద్యార్థులు మోసపోవద్దని, అక్రమంగా ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థల అడ్మిషన్స్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రామ్ చరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జూలూరుపాడు మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్లో ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి విలేకర్లతో ఆయన మాట్లాడుతూ వసంత పంచమి పేరుతో ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నట్లు తెలిపారు. అడ్మిషన్ల పేరుతో సంవత్సరం ఫీజులో కొంత ముందస్తుగానే కట్టించుకొని విద్యార్థులను అక్రమ పద్ధతిలో అడ్మిషన్లు పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నట్టు ఆరోపించారు. కావున ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థల మాటల ఊబిలో పడి విద్యార్థులు, తల్లిదండ్రులు మోసపోవద్దని కోరారు. ప్రభుత్వం ఈ అక్రమ పద్ధతిలో అడ్మిషన్స్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల మీద చర్యలు తీసుకోవాలని, చట్టపరమైన కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు పెరుమాళ్ళ పవన్ కుమార్, హైస్కూల్ ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రావణ్, చరణ్, మౌనిక, శిరీష తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన సీడీపీఓ

నవతెలంగాణ-అశ్వారావుపేట

మండలంలోని పలు గ్రామాల్లో గల అంగన్వాడీ కేంద్రాలను శుక్రవారం సీడీపీఓ ముత్తమ్మ తనిఖీలు చేసారు.

ముత్తమ్మ సూపర్వైజర్ విజయలక్ష్మిలు గుర్రాలచెరువు, మారుతి నగర్ అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు బరువులు, స్టాక్ రికార్డ్స్‌ను పరిశీలించారు. వారి వెంట ఆయా కేంద్రాల టీచర్‌లు, ఆయాలు ఉన్నారు.

గిరి బిడ్డల భవిష్యత్తు కోసం కెరీర్ గైడెన్స్‌కు శ్రీకారం

- రంగంలోకి పీవో రాహుల్
- విద్యా సంస్థల్లో మాస్టర్ ప్లాన్
- విద్య, ఉద్యోగ సమాచారంపై ఫ్లెక్సీలు
- పీవో చర్యలతో సత్ఫలితాలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

గిరిజన విద్యా సంస్థల్లో విద్యనభ్యసిస్తున్న గిరి బిడ్డల ఉన్నతి కోసం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.రాహుల్ తనదైన శైలిలో మాస్టర్ ప్లాన్ రూపొందించి అమలు చేస్తున్నారు. విద్యా ప్రమాణాలపై ఇప్పటికే పుస్తకాల రూపకల్పన టీచర్లకు ప్రత్యేక శిక్షణా తరగతులు, మాతృభాషపై పట్టు కోసం రకరకాల సమాలోచనలు జరిపి సత్ఫలితాలను సాధించిన పీవో గిరిజన విద్యా సంస్థల్లో మరో నూతన ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేస్తున్న గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు ఉద్యోగ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవటంలో వైఫల్యం చెందుతున్నారని భావించిన పీఓ వారికి కెరీర్ గైడెన్స్‌పై అవగాహన ఇచ్చే కార్యక్రమానికి పూనుకున్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ తర్వాత ఏ ఏ కోర్సులు చదవవచ్చు వాటి వల్ల ప్రయోజనం ఏమిటి, ఉద్యోగ, ఉపాధి సౌకర్యాలపై సమాచారంతో కూడిన ఫ్లెక్సీలను గిరిజన విద్యా సంస్థల్లో పెట్టి గిరి బిడ్డలకు కెరీర్ గైడెన్స్ పై పూర్తి సమాచారం అందించే ప్రయత్నానికి పీఓ నడుం బిగించారు. భద్రాచలం పట్టణంలోని ఏజీహెచ్ఎస్ బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం పీఓ లాంఛనంగా ప్రారంభించారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు తాము ప్రభుత్వ కొలువులు ఎలా సాధించామో ఈ సందర్భంగా వారి అనుభవాలను బాల, బాలికలకు ప్రత్యక్షంగా వివరించారు. విద్యార్థినీలు భవిష్యత్తులో వారు ఏ ఉద్యోగంలో స్థిరపడాలని అనుకుంటున్నారో వారి మాటల్లో అధికారులకు తెలియజేశారు. కొందరు విద్యార్థులు కలెక్టర్ ఉద్యోగం చేస్తానని తెలుపగా ఐఏఎస్, ఐపీఎస్ ఉద్యోగం సాధించడానికి ఎటువంటి సాధన చేయాలో పీఓ విపులంగా విద్యార్థినులకు వివరించారు.



గిరి బిడ్డలు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఐటీడీఏ పీవో రాహుల్

గిరిజన విద్యా సంస్థల్లో విద్యనభ్యసిస్తున్న బాలబాలికలు తమ తమ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసి తదుపరి కోర్సులు ఏమి చదివితే ఎటువంటి ప్రయోజనం ఉంటుందన్న ఆలోచనకు రావాలని, అందుకు తగ్గ ఎంపిక చేసుకొని విద్యలో రాణించి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలని పీఓ విద్యార్థులకు వివరించారు. కెరీర్ గైడెన్స్ పై అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రతి గిరిజన పాఠశాల కళాశాలలో విద్య ఉద్యోగ సమాచారం కోసం ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో పూర్తి సమాచారం ఉంటుందని ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని, దీన్ని విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా విద్యా సంస్థల నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని కోరారు. పరీక్షలలో ఉత్తీర్ణులు అయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు తదుపరి కోర్సులపై వారికి పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. ఇందులో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని వెల్లడించారు. వివిధ మండలాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లు, స్పెషల్ ఆఫీసర్లు గిరిజన విద్యా సంస్థలను సందర్శించి పిల్లలకు కెరీర్ గైడెన్స్ పై మరింత అవగాహన కల్పించే ప్రయత్నం చేయాలని సూచించారు.

ఫిబ్రవరి 23న ప్రతిభ ప్రోత్సాహక పరీక్ష నిర్వహిస్తున్నట్టు పీఓ తెలిపారు. ప్రతి స్కూల్ నుంచి అయిదుగురు పిల్లలను ఎంపిక చేసి ఈ ప్రతిభ ప్రోత్సాహక పరీక్షకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారినిలు మణెమ్మ, విజయలక్ష్మి, ఆర్‌సీఓ గురుకులం నాగార్జున రావు, ఏసీఎంవో రమణయ్య, ఐటీడీఏ స్పెషల్ ఆఫీసర్లు, ఏటీడీవోలు వివిధ శాఖల నుండి వచ్చిన అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తిపై దాడికి ఖండన

- సంఘీభావంగా విధులు బహిష్కరణ

నవతెలంగాణ-కొత్తగూడెం లీగల్



రంగారెడ్డి జిల్లాలో న్యాయమూర్తి పై జరిగిన దాడికి నిరసనగా వారికి సంఘీభావం తెలుపుతూ ఏకగ్రీవంగా కొత్తగూడెం అసోసియేషన్ విధులు బహిష్కరించింది. ఈ సంఘటను తీవ్రంగా ఖండించి, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. శుక్రవారం బార్ అసోసియేషన్ హాల్లో జరిగిన అత్యవసర సమావేశంలో సభాధ్యక్షులు, అసోసియేషన్ ఉపాధ్యక్షులు తోట మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రవిచంద్రలు, సీనియర్ న్యాయవాదులు కటకం పుల్లయ్య మాట్లాడుతూ ఇలాంటి దాడులు వలన సామాన్యులకు న్యాయ వ్యవస్థపై నమ్మకం లేకుండా పోతుందన్నారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు ఏ.కరుణాకర్, ఎస్.ప్రవీణ్ కుమార్, సీనియర్ న్యాయవాదులు జలసూత్రం శివరాంప్రసాద్, జీవీకే మనోహర్ రావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగిరెడ్డి, ఉషారాణి, వెంకటేశ్వర్లు, రాజేష్, శ్రీ రామల రవి, తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు : దాడిని తీవ్రంగా ఖండిస్తూ మణుగూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా న్యాయవాదులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు బహిష్కరించి, నిరసన తెలియజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేదరమట్ల శ్రీనివాసరావు, చీర్రా సరస్వతి, దాసరి కవిత, అంకం సర్వేశ్వరరావు, వీర మధుసూదన్, రుద్రా వెంకట్, కందిమల్ల నరసింహారావు, నిమ్మను కోటి సావిత్రి తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

దమ్మపేట : రంగారెడ్డి కోర్టులో జరిగిన సంఘటనను దమ్మపేట బార్ అసోసియేషన్ సభ్యులు ఖండిస్తూ శుక్రవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ రంగారెడ్డి కోర్టులో జిల్లా జడ్జిగా విధులు నిర్వహిస్తున్న మహిళ న్యాయమూర్తిపై కరణ్‌సింగ్ అనే శిక్ష పడిన వ్యక్తి తన చెప్పును విసిరి దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు మారం సతీష్ కుమార్, సీనియర్ న్యాయవాది ఉడతనేని శ్రీనివాసరావు, గొంది మురళి, మోహన్, లక్కినేని నరేంద్ర, త్రినాటి సంజయ్, టి.బాలరాజు, ముప్పిడి శ్యామ్ సుధాకర్, భవాని, సంధ్యరాణి, అరుణకుమారి, కృష్ణవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

డార్విన్ పరిణామ క్రమంపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్



జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక సాయి ఎక్సలెంట్ స్కూల్ పాపకొల్లు రోడ్డు జూలూరుపాడు నందు జన విజ్ఞాన వేదిక బాధ్యులకు ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ ప్రోగ్రాంలో జే.వి.వి జిల్లా గౌరవ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది రమేష్ కుమార్ మక్కాడ్ మాట్లాడారు. పిల్లలలో మూడనమ్మకలు తొలగిపోయి బావి భారత పౌరులుగా నేటి తరానికి బంగారు భవిష్యత్తు ఏర్పడేలా చెయ్యాలని ఆయన వివరించారు. అదేవిధంగా పాఠశాల ప్రిన్సిపల్ అరెబోయిన కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థినీ, విద్యార్థులను చైతన్య వంతులుగా తీర్చిదిద్దే విధంగా మంచి విద్యని అందిస్తూ, బట్టి పట్టి చదివే విధానంను పిల్లలలో తొలగించి లెసన్స్ పై అవగాహన వచ్చేవిధంగా యోగ కార్యక్రమాలు, ఆటలు, పాటలు, కో సర్క్యులర్ కార్యక్రమాలు పాఠశాలలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యురాలు ఏ.కస్తూరి జే.వీ.వీ.జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్ రావు, జిల్లా శాఖ సెక్రెటరీ తిరుమల పాలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో బాల మేళా

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండలంలోని పర్ణశాల జిల్లా పరిషత్ పాఠశాల కాంప్లెక్స్ స్థాయి బాలమేళా చిన్న బండి రేవు ఎంపీ యూపీఎస్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. టీఎల్ఎం మేళాను మండల విద్యాశాఖ అధికారి సున్నం సమ్మయ్య ప్రారంభించారు. కాంప్లెక్స్ పరిధిలోని 24 పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ప్రదర్శించారు. కాంప్లెక్స్ స్థాయిలో ప్రదర్శించిన టీఎల్ఎం మేళాలో ఎంపీ యూపీఎస్ చిన్ననల్లబల్లి పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా, రెండో స్థానంలో ఎంపీ యూపీఎస్ చిన్న బండి రేవు, మూడో స్థానంలో ఎంపీపీ ఎస్ బైరాగులపాడు పాఠశాలలు ప్రతిభను కనబరిచాయి. దీంతోపాటు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారుచేసిన పదిమంది విద్యార్థులను గుర్తించి వారికి ఎంఈఓ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నరసాపురం జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాస్, ఏజే ప్రభాకర్, వేముల శ్రీను, అపక నాగలక్ష్మి ఆయా పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించి పేరు ప్రఖ్యాతలు తేవాలి

- ఎంఈఓ కొమరం శాంతారావు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



రాష్ట్ర స్థాయి క్రీడల్లో విద్యార్థులు రాణించి తల్లిదండ్రులు, గురువులు, ప్రభుత్వ పాఠశాలలు, గ్రామం, మండలానికి మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని విద్యా శాఖ అధికారి కొమరం శాంతారావు పాఠశాలకు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండలంలోని మైలారం గ్రామం జీపీఎస్ పాఠశాలలో క్రీడా సామగ్రి పంపిణీ కార్యక్రమానికి ఎంఈఓ హాజరై, హెచ్.ఎం.జోగా రాంబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పిల్లలు క్రీడల పట్ల ఆసక్తి చూపి, ఉత్సాహంగా పాల్గొని, ఆటలాడాలని చెప్పారు. క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం కలుగుతుందని, క్రీడల్లో రాణించడానికి ఎక్కువ నైపుణ్యం కలిగి ఉండాలని తెలిపారు. విద్యార్థులు పాఠశాల, మండల స్థాయి క్రీడల్లో శ్రద్ధగా ఆడి జిల్లా, రాష్ట్రస్థాయిలో ఎంపికవ్వాలని సూచించారు. అనంతరం హెచ్.ఎం జోగా రాంబాబు మాట్లాడుతూ.. విద్య, క్రీడలు మనకు రెండు కళ్ళని, రెండింటి పట్ల పిల్లలు సమంగా ఆసక్తి చూపించాలని సూచించారు. విద్యార్థులు అన్ని విషయాలలో ముందుండాలని, చదువు, ఆటల్లో నిర్లక్ష్యంగా ఉండకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీచర్ జి.కుమార్ రాజా, అంగన్వాడీ టీచర్ బాయమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి స్థలం వితరణ

నవతెలంగాణ-కామేపల్లి

సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఇరబోయిన మదారు దంపతులు కామేపల్లి మండల కేంద్రంలో గల వారి స్థలాన్ని సేవాలాల్ మెరమ్మ తల్లి దేవాలయం నిర్మించుటకు దానంగా ఇస్తున్నట్టు గ్రామ ప్రజలకు తెలిపారు. అందులో భాగంగా గ్రామ పెద్దలు అందరూ కలసి స్థల పరిశీలన చేసి అందరికీ ఆమోదయోగ్య మైనదిగా నిర్ణంచి పూజాకర్య క్రమం చేపట్టడమైనది. అందులో భాగంగా స్థల దాతను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బాగం రంగారావు, అజ్మీరా రాందాస్ నాయక్, ఝర్పల రామారావు నాయక్, అజ్మీరా హరి నాయక్, భూక్యా శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కస్తాల రాధాకృష్ణ మృతి

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని బీఆర్ఎస్ తెలగవరం గ్రామం వైస్ ప్రెసిడెంట్ కస్తాల రాధాకృష్ణ శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకొన్న బీఆర్ఎస్ నాయకులు మాజీ జెడ్పిటిసి కట్టా జయకుమార్, షుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధి కమిటీ చైర్మెన్ కస్తాల నరేంద్ర చౌదరి తదితరులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సహచార విద్యార్థులతో ఆడుకుంటూ గాయపడ్డ విద్యార్థి

- వెంటనే స్పందించి ఆసుపత్రికి తీసుకెళ్లిన ఉపాధ్యాయులు

నవతెలంగాణ-బోనకల్



పాఠశాల విరామ సమయంలో ఓ విద్యార్థి శుక్రవారం సహచర విద్యార్థులతో కలిసి ఆడుకుంటూ ప్రమా దవశాత్తు కింద పడటంతో ఆ విద్యార్థికి చేయి విరిగింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలిపిన వివరాల ప్రకారం..బోనకల్ గ్రామానికి చెందిన మాలోతు గౌతం బోనకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. పాఠశాల సాయంత్రం విరామ సమయంలో కొంతమంది విద్యార్థులతో కలిసి గౌతమ్ ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో ఓ విద్యార్థి సరదాగా నెట్టడంతో గౌతమ్ కింద పడటంతో ఎడమ చేయి విరిగింది. ఆ వెంటనే ప్రధానోపాధ్యాయులు అట్లూరి గోపీచంద్, ఉపాధ్యాయులు స్పందించి గౌతమ్‌ను బోనకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స చేశారు. చేయి విరిగిందని వైద్యులు నిర్ధారణ చేశారు. వెంటనే ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని ఉపాధ్యాయులకు సూచించారు. కొద్దిసేపటికి తల్లిదండ్రులు కూడా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. వైద్యుల సలహా మేరకు గౌతమును తల్లిదండ్రులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సర్వేంద్రియానాం నయనం ప్రధానం

- సృష్టిలో కంటి చూపుతోనే సర్వం
- శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి

నవతెలంగాణ-ఖమ్మం



సర్వేంద్రియానాం నయనం ప్రధానం అని, కంటి చూపు లేకపోతే ఈ సృష్టి శూన్యమని శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి అభిప్రాయపడ్డారు. అలాంటి చూపును పదిలంగా కాపాడుకోవాలని కోరారు. శ్రీ బాలాజీ ఫౌండేషన్ సారధ్యంలో, వాసన్ ఐ కేర్ సౌజన్యంతో శుక్రవారం ఖమ్మంలోని శ్రీ బాలాజీ కార్పోరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య పరీక్షల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వయసు మీరుతున్న కొద్దీ కంటి చూపు మందగించడం సర్వసాధారణమన్నారు. 40 ఏళ్ళ వయసు దాటిన తర్వాత ఏడాదికి ఒకసారి కంటి వైద్య పరీక్షలు చేయించుకోవడం అవసరమని పేర్కొన్నారు. అలాగే చూపు మందగించకుండా ఉండటానికి "ఎ" విటమిన్ కలిగిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 4 వందల మంది కంటి పరీక్షలు చేయించుకోగా వారికి, బీపీ, షుగర్ వంటి టెస్టులు కూడా చేశారు. ఈ కార్యక్రమంలో కొనిజర్ల మాజీ ఎంపీపీ గోసు మధు, మార్కెటింగ్ సిబ్బందితో పాటు వాసన్ ఐ కేర్ సిబ్బంది అఫ్సర్, వెంకటేష్, గోపి చందు, తేజస్విని పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయండి

నవతెలంగాణ-కల్లూరు

ప్రతి గిరిజనలు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ భోగ్ బండారో కార్యక్రమం నిర్వహించాలని లంబాడి హక్కుల పోరాట సమితి ఖమ్మం జిల్లా అధ్యక్షులు ధర్మసోత్ దశరధ్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. శనివారం శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జన్మదిన వేడుకలు ప్రతి ఇంటిలోనూ గిరిజనులు తప్పకుండా జరుపుకోవాలని కోరారు. అదేవిధంగా ఉదయాన్నే 10 గంటలకు భోగ్ బండారో కార్యక్రమని విజయవంతం చేసి మహారాజ్ ఆశీస్సులు తీసుకోవాలని కోరారు.

సంతు సేవాలాల్ జాయంతి నియోజకవర్గం పరిధిలోని పెనుబల్లి మండలంలోని గంగాదేవిపాడు గ్రామంలో శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహింస్తునట్లు ఆర్డీఓ ఎల్.రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలలోని గిరిజనులు పాల్గొన్ని జయప్రదం చేయాలిని కోరారు.

'కులగణన సర్వేలో మున్నూరు కాపు లెక్క తప్పు'

నవతెలంగాణ-ఖమ్మం



రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కులగణన సర్వేలో 22 శాతం ఉన్న మున్నూరుకాపు కుల జనాభాను మూడున్నర శాతం తక్కువగా చూపించారని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, జిల్లా అధ్యక్షులు పార నాగేశ్వరరావు తప్పు బట్టారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షల పైచిలుగా ఉన్న తమను సర్వేలో 14 లక్షలని తక్కువగా చూపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో 28 లక్షలని, ప్రస్తుత ప్రభుత్వం 13 లక్షలని చూపించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే రీ సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సర్వేను వ్యతిరేకిస్తూ త్వరలో హైద్రాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో 10 లక్షల జనాభతో రాజకీయ పార్టీలకు అతీతంగా జరిగే బహిరంగ సభను మున్నూరుకాపులు విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం రీ సర్వే నిర్వహించాలని ఈనెల 17న ఆయా జిల్లా కలెక్టరేట్‌లలో జరిగే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పసుపులేటి దేవేందర్, మున్నూరుకాపు ట్రస్ట్ బోర్డ్ అధ్యక్షులు మేకల బిక్షమయ్య,పాలేరు నియోజకవర్గం ఇంచార్జ్ మారిశెట్టి వెంకటేశ్వరరావు, సత్తుపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ మానుకోట సత్యనారాయణ (మాధురి మధు) తదితరులు పాల్గొన్నారు.

లింగమంతుల స్వామి జాతర రోజు సెలవు దినాలుగా ప్రకటించాలి

నవతెలంగాణ-కామేపల్లి

రాష్ట్రంలో మేడారం జాతర తర్వాత అతిపెద్ద జాతర సూర్యాపేట జిల్లా కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో గల దురాజ్ పల్లి గ్రామంలో జరుగు గొల్లగట్టు లింగమంతుల జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించి రెండు రోజుల ప్రభుత్వ సెలవు దినాలుగా ప్రకటించాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవాధ్యక్షులు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో జరిగిన మండల యాదవ సంఘం సమావేశంలో మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ గొల్ల గట్టు లింగమంతుల జాతర అతి పురాతనమైనదని, దాదాపు 1,000 సంవత్సరాలకు పైగా జాతర నడుస్తున్నట్లు, నాటి కళ్యాణి చాళుక్యులు 11 వ శతాబ్దంలో గిరి దుర్గం పైన జాతర ప్రారంభించినట్లు శాసనాల ద్వారా తెలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేకల మల్లికార్జునరావు, జాల శ్రీను యాదవ్, జక్కుల బ్రహ్మయ్య, సత్తి చిట్టిబాబు, కేతబోయిన రాంబాబు, మేకల అశోక్, చిన్నబోయిన సత్యం, చిన్నబోయిన కృష్ణ కానబోయిన బిక్షం, కానబోయిన వెంకట రాములు తదితరులు పాల్గొన్నారు.

వంట మేస్త్రి వహీద్ మృతి

- అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-కల్లూరు



కల్లూరు పట్టణానికి చెందిన ప్రముఖ వంట మేస్త్రి వహీద్ శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మువ్వ విజయబాబు చరవాణి ద్వారా వారి కుమారుడు షమ్ములతో మాట్లాడి మనోధైర్యాన్ని ఇచ్చి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కాటేపల్లి కిరణ్‌కుమార్, కల్లూరు గ్రామపంచాయతీ మాజీ వార్డ్ మెంబర్ షేక్ అఫ్రోజ్, టెక్నో నాగిరెడ్డి, సమీర్, కిషోర్, వినోద్, సాయి తదితరులు వారి నివాసానికి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం దహన సంస్కారానికి అయ్యే ఖర్చు మొత్తాన్ని మువ్వ విజయ్ బాబు కాటేపల్లి కిరణ్ ద్వారా అందజేశారు.

ముగిసిన డీఏఈ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు

- విజేతలకు బహుమతులను అందజేసిన కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-అశ్వాపురం



మండల కేంద్రంలోని గౌతమ్ నగర్ కాలనీలో ఈనెల 10న నుంచి గత నాలుగు రోజులపాటు నిర్వహించిన డీఏఈ 39వ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ జితేష్ వి పటేల్ ముఖ్యఅతిథిగా పాల్గొని గెలుపొందిన జట్లకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలను కలెక్టర్ తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మణుగూరు భారజల కర్మాగార యాజమాన్యం సెక్టార్లలో పనిచేస్తున్న వివిధ కర్మాగారాల నుండి హాజరైన క్రీడాకారులకు ఆతిథ్యం ఇవ్వడం హర్షించదగ్గ విషయం అన్నారు.

గెలుపొందిన విజేతలు వీరే

గత నాలుగు రోజులుగా గౌతమి నగర్ కాలనీలోని రిక్రియేషన్ భవనంలో నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ పోటీలలో వెటరన్ మహిళల సింగిల్ లో జయశీలపై శానిటరీ సింగ్ విజయం సాధించారు. వెటరన్ పురుషుల సింగిల్స్‌లో భూపేందర్ సింగ్ రావత్ పై మనోజ్ బుజ్వాల్ విజయం సాధించారు. మహిళల డబుల్ లో రాను బట్, సురభిచంద్రపై సప్రా, వాసుమతి అజంతా జట్టు విజయం సాధించారు. పురుషుల సింగిల్స్ లో మోహన్ మోటూరు పై కందిపల్లి గోపి విజయం సాధించారు. పురుషుల డబుల్స్ లో గౌరవ మౌర్య మాణిక్యం పై దీపాయన్ సహా, మోహన్ మాటూరి గోల్కొండ జట్టు విజయం సాధించారు. విజయం సాధించిన క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో హెవీ వాటర్ ప్లాంట్ జిఎం హెచ్‌కె శర్మ, డీజీఎం జి శ్రీనివాసరావు, హెవీ వాటర్ ప్లాంట్ సిఏఓ వేణు, కో కన్వీనర్ రఫిక్ అహ్మద్, సిహెచ్ కోటేశ్వరరావు, తహసీల్దార్ స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో.. హ్యాట్రిక్ సాధించిన సాయిస్ఫూర్తి పాలిటెక్నిక్ విద్యార్థులు

- సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-సత్తుపల్లి



హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ పాలిటెక్నిక్ రామంతపూర్‌లో ఈనెల 11, 12 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో సత్తుపల్లి మండలం గంగారంలోని సాయిస్ఫూర్తి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు హ్యాట్రిక్ విజయం సాధించి సౌత్‌జోన్ పోటీలకు ఎంపికయినట్లు ఆ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ దేశిరెడ్డి రఘుపతిరెడ్డి తెలిపారు. 10 జిల్లాల నుంచి విజయం సాధించిన జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయని ఆయన తెలిపారు. హ్యాట్రిక్ సాధించి, సౌత్‌జోన్‌కు ఎంపికవడం పట్ల శుక్రవారం కళాశాలలో వాలీబాల్ క్రీడాకారులకు అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఊటుకూరు శేషారత్నకుమారి మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థులు గత మూడేళ్ల నుంచి ఫైనల్‌కు వెళ్లి రెండుసార్లు ప్రథమస్థానం, ఒకసారి ద్వితీయ స్థానం పొందడం జరిగిందన్నారు. వచ్చే నెలలో జరిగే సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు తెలంగాణ టీం నుంచి తమ కళాశాల విద్యార్థులు ముగ్గురు ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణమన్నారు. కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ హ్యాట్రిక్ సాధించిన విద్యార్థులను అభినందించారు. క్రీడలతో పాటు దేశభక్తిని పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా దాసరి విద్యార్థులను కోరారు. సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

చింతకాని పోలీస్ స్టేషన్ ఎదుట బాధితుల బైఠాయింపు

నవతెలంగాణ-చింతకాని

సీఐ కొట్టారని, బాధితులను బెదిరించారని ఆరోపిస్తూ బాధితులు పోలీస్ స్టేషన్ ఎదుట బయటయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీఎస్పి జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సొంత నియోజకవర్గంలో ఒక ఎస్సీ దళిత కుటుంబానికి సంబంధించినటువంటి వ్యక్తిని దారుణంగా ఒక సీఐ కొట్టడం సిగ్గుచేటని అన్నారు. కాపాడాల్సిన పోలీసులే ప్రజల్ని ఇలా స్టేషన్ కు పిలిచి కొట్టడం ఎంతవరకు న్యాయమని ఇప్పటికైనా ఈ విషయంపై స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. పిటీషన్ తీసుకున్న తర్వాత ధర్నా విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో బాధితులతో పాటు బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల నాగరాజు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ విజయ్, చింతకాని మండల అధ్యక్షుడు ఉసికల నవీన్, నియోజకవర్గ సీనియర్ నాయకులు రమేష్, బంధం వంశీ కార్తీక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

- మానవత్వాన్ని చాటిన కరకపల్లి సుధాకర్

నవతెలంగాణ-ఆళ్లపల్లి

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండాల మండలం సజ్జల బోడు గ్రామానికి చెందిన జోగ సుధాకర్ అనే యువకుడు కల్వల నాగారం గ్రామం అతని అత్తింటికి బైక్‌పై వెళ్లి, వస్తున్న క్రమంలో ఆళ్ళపల్లి మండలం రాఘవాపురం సమీపంలో చప్టా వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడడంతో తీవ్ర గాయాలై, స్పృహ తప్పి ఉన్నాడు. అటుగా తన కారులో వెళ్తున్న స్థానిక కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు కరకపల్లి సుధాకర్ ఘటనా స్థలంలో తీవ్ర గాయాలతో పడి ఉన్న జోగ సుధాకర్ ను మానవతా దృక్పథంతో తన కారులో ఎక్కించుకుని ఆళ్ళపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు.

మా అమ్మాయిని మాకు తిరిగి అప్పజెప్పండి

- ఎస్పీ రోహిత్ రాజుకి వినతి పత్రం అందించిన కోట శివశంకర్

నవతెంలగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు కస్తూరిబా పాఠశాలలో ఈనెల 1వ తారీకు మిస్ అయిన అమ్మాయి సుమారు 14 రోజులైనప్పటికీ ఇంతవరకు ఆచూకీ తెలియలేదని, మిస్ అయిన అమ్మాయి ఎక్కడ ఉందో కూడా తెలియని పరిస్థితిని ఉందని దయచేసి మా అమ్మాయిని ట్రాప్ చేసి తీసుకువెళ్లిన అందరిపై కఠినమైన కేసులు నమోదు చేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీబీసీ, మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివ శంకర్ కోరారు. శుక్రవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజుకు వినతి పత్రం అందజేశారు. తల్లిదండ్రుల అనుమతి లేకుండా బయటికి పంపించిన కస్తూరిబా పాఠశాల స్పెషల్ ఆఫీసర్‌పై కూడా కిడ్నాప్ కేసు, ఫోక్సో కేసు నమోదు చేయాలని, మైనర్ బాలికలని మాయ మాటలు చెప్పి బయటకు తీసుకువెళ్లి నయవంచన చేసే ముఠా ఆట కట్టాడి చేయాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టల్లో, గురుకుల బాలికల పాఠశాలలో, కళాశాలలో కస్తూరిబా పాఠశాలలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి విన్నవించారు.

అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ సీజ్

నవతెలంగాణ - అశ్వారావుపేట

అనుమతులు లేని, అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ ఎస్ఐ యయాతి రాజు తెలిపారు. మండలంలోని వేదాంతపురం పంచాయతీ గంగారం గ్రామానికి చెందిన ఊకే రాంబాబు శుక్రవారం ఉదయం అనంతారం వాగు నుండి అశ్వారావుపేట ఇసుక ట్రాక్టర్ తో వస్తున్నాడు. ఉదయం బస్ స్టాండ్ సెంటర్ లో తనిఖీ చేయగా అనుమతులు లభించలేదు. దీంతో ట్రాక్టర్ ను పోలీస్ స్టేషన్ కు తరలించారు.

చిన్నారిని ఆశీర్వదించిన లింగాల కమల్ రాజు

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలో గోకినేపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ధనియాకుల వీరస్వామి నివాసంలో శుక్రవారం జరిగిన మనవడు అన్నప్రాసన వేడుక జరిగింది.ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్చార్జ్, జడ్పీ మాజీ చైర్మెన్ లింగాల కమల్ రాజు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి గడ్డం వెంకట్ గౌడ్ నాయకులు పొట్ల ప్రసాద్, బంక మల్లయ్య, కోటి అనంతరాములు, తోటమల్ల గురుమూర్తి, పయ్యావుల వెంకటేశ్వర్లు, పగడాల నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తాళ్ల శ్రీను, చిలకల రామకృష్ణ, మందరపు నవీన్, కట్టకూరి ఉమారావు, సీపీఐ మండల కార్యదర్శి రావులపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమాదిగను మర్యాదపూర్వకంగా కలిసిన సత్తుపల్లి ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ-సత్తుపల్లి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణమాదిగను ఆ సంఘ జిల్లా నాయకులు గోళ్ళమూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాదులోని డీడీ కాలనీలో మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణే ప్రధాన ఎజెండాగా మూడు దశాబ్దాలకు పైగా ఉద్యమం చేసి ఆ దిశగా మాదిగల చిరకాల వాంఛ అయిన వర్గీకరణను సాధించడం పట్ల శ్రీనివాసరావు కృష్ణమాదిగకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సత్తుపల్లి మండలం నాయకులు పరిగడుపు లక్ష్మణరావు, గద్దల దేవన్న, కర్నూలు జిల్లా ఎమ్మార్పీస్ నాయకులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి జాతరకు సమీక్ష సమావేశం

నవతెలంగాణ-వైరా

మండలంలోని స్నానాల లక్ష్మీపురం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఖమ్మం ఆర్డీఓ నరసింహరావు అధ్యక్షతన ఈ నెల 26 నుండి జరుగు మహాశివరాత్రి జాతర నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం పనులకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మహా శివరాత్రి జాతర పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సరస్వతి, డిప్యూటీ తహసీల్దార్ సురేష్ బాబు, ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్, ఈఓ హరి చంద్రశేఖర్, ఎంపీవో జ్యోత్స్నదేవి, పంచాయతీ కార్యదర్శి ఆర్.భారతి, ఎక్సైజ్ ఆర్టీసీ ఇరిగేషన్ వైద్య అధికారులతో పాటు స్థానిక నాయకులు దొడ్డ పుల్లయ్య, మల్లు రామకృష్ణ, నూతి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కేవీపీఎస్ డివిజన్ సదస్సును జయప్రదం చేయండి

- రాష్ట్ర కమిటీ సభ్యుడు పాపిట సత్యనారాయణ

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 23న మండలంలోని నాయుడుపేట బైపాస్ వద్ద గల రామ్ లీలా ఫంక్షన్ హాల్ లో జరిగే కేవీపీఎస్ పాలేరు డివిజన్ సదస్సును జయప్రదం చేయాలని రాష్ట్ర కమిటీ సభ్యులు పాపిట్ల సత్యనారాయణ అన్నారు. మండలంలోని బారుగూడెం, ఆరేంపుల, చింతపల్లి, ఆరెకోడు, ముత్తగూడెం, ఏదులాపురం, నాయుడుపేట, రెడ్డిపల్లి, పల్లెగూడెం, ఎంవి పాలెం గ్రామాల్లో కేవీపీఎస్ పాలేరు డివిజన్ సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా దళితుల సమస్యలు, దళిత కాలనీలో మౌలిక వసతులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే లాగా ఉన్నాయని విమర్శించారు. దళితుల సమస్యలపై కార్యాచరణ రూపొందించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆరేంపుల ఉప్పలయ్య, పగిడిపల్లి వెంకట్రావు, నాయకులు రామనాథం, జి.నాగయ్య బాబు, శివరామరాజు, మునీష్, కృష్ణ, నూకల బాలరాజు, పాము ఉపేందర్, నందిపాటి లక్ష్మయ్య సారయ్య, పడిశాల రాములు, ఎల్.సైదులు, రామనాథం తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత సహకార సంఘం అధ్యక్షుడిగా ఆరేపల్లి వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-అశ్వారావుపేట



అశ్వారావుపేట కల్లుగీత సహకార సంఘం ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఆరేపల్లి వెంకటేష్ గౌడ్ (గోవింద్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎలక్షన్ ఆఫీసర్ కె. రమేష్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా ఆరేపల్లి వెంకటేష్ గౌడ్ (గోవింద్), కార్యదర్శిగా మోర్ల దుర్గారావు గౌడ్, ఉపాధ్యక్షుడిగా ఆరేపల్లి రామ గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక కార్యక్రమంలో అశ్వారావుపేట పట్టణ గౌడ పెద్దలు ఆరేపల్లి సాంబశివరావు, నాయుడు శ్రీను, ఆరేపల్లి సత్యనారాయణ, ఆరేపల్లి కొండయ్య, బుర్ర నాగరాజు, పి.మురళి, బి. అంజయ్య, బి. వెంకన్న బాబు, కల్లుగీత వృత్తిదారులు పాల్గొన్నారు.

మిర్చికి మద్దతు ధర కేటాయించాలి

- రైతు మహాధర్నాను జయప్రదం చేయండి
- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



మిర్చికి మద్దతు ధర రూ.25వేలు కేటాయించాలని, ఈనెల 18న మిర్చి మార్కెట్ యార్డ్ ముందు పెద్ద ఎత్తున రైతులతో నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం జనరల్ బాడీ సమావేశం పద్మనాభల సుధాకర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడులూ...కష్టపడి రైతాంగం పండించిన మిర్చికి గిట్టుబాటు ధర లేక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని కనీసం పెట్టుబడికి తగ్గ సహాయం కూడా రైతులకు రావటం లేదని ఎన్నో ఎకరాలు వేసి రైతులు నష్టపోతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం మండల అధ్యక్షులు తుళ్లూరు నాగేశ్వరావు బింగి రమేష్, కే.స్వామి, వెంకటరెడ్డి, బోడ లాల్, కొమ్ము శ్రీను, కే.నాగేశ్వరరావు, కే.సింధు, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ దేవాలయానికి ఆంధ్రావాసులు రూ.50 వేలు విరాళం

- దాతలను సన్మానించిన చైర్మెన్ నరాల శ్రీను

నవతెలంగాణ-అశ్వారావుపేట

మండలంలోని వినాయక పురంలో గల శ్రీశ్రీశ్రీ చిలకల గండి ముత్యాలమ్మ దేవాలయం ప్రాంగణంలో షెడ్ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్, కుక్కునూరు మండల వాస్తవ్యులు, టీడీపీ కుక్కునూరు మండల అధ్యక్షులు ములిశెట్టి నాగేశ్వర రావు (నాగు), ఉషారాణి దంపతులు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. శుక్రవారం వారి కుమారులు జయంత్ కుమార్, ఉజిత్ కుమార్‌లు దేవాలయాన్ని సందర్శించి, ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మెన్ నరాల శ్రీను శాలువా కప్పి సన్మానం చేశారు. వేద పండితులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమం ఆలయం గుమస్తా ప్రసాద్, టెంట్ హౌస్ పాషా, శేఖర్ కుమార్ పంతులు పాల్గొన్నారు.

మామిడి, ఆయిల్ ఫాం, పట్టుపురుగుల పెంపకంపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-ఎర్రుపాలెం



మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో మామిడి, ఆ యిల్ ఫామ్ పట్టుపురుగుల పెంపకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ ఆయిల్ ఫామ్ తోటలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా పట్టుపురుగుల శాఖ అధికారి ముత్యాలు పట్టుపురుగుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం వైరా ఉద్యాన శాస్త్ర వేత్త డాక్టర్ వి. చైతన్య మామిడి తోటల సంరక్షణ పూత - పిందె సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువు ల యాజమాన్యం పోషకాలు ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మధిర మండలం, ఉద్యాన శాఖ అధికారి విష్ణు ప్రస్తుతం ఉద్యాన పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి బోయినపల్లి సాయిశివ, కృషి విజ్ఞాన కేంద్రం వైరా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డా కే.రవికుమార్ మామిడి లో ఆశించే చీడపీడలు, వాటి యాజమాన్యం గురించి సమగ్రంగా వివరించారు. పూత - పిందె దశలో ఉన్న మామిడి తోటలలో తీసుకో వాల్సిన జాగ్రత్తలు గురించి వివరిస్తూ తేనెమంచు, పు రుగు,పిండినల్లి, పొలుసు పురుగు అధికంగా ఉన్న తో టలలో ఇమిడాక్లోప్రిడ్ 0,3 మి.లీ, ఒవేపనూనె 2.5 మి. లీ లీటరు నీటికి కలిపి చెట్టు కాండము, కొమ్మల నుండి ఆకుల వరకు పూర్తిగా తడిచేటట్లు పిచికారి చేయాలని తెలిపారు.పాదులు చేసి,చెట్ల మొదలు చుట్టూ పాలిథీ న్ పేపర్ అడుగు ఎత్తు వరకు కట్టి దానికి జిగురు పూ సినట్లయితే పిండినల్లి పిల్ల పురుగులు పైకి పాకకుండా ఆపవచ్చునన్నారు.తోటలో ముఖ్యంగా ఎండు పుల్ల లున్న కొమ్మల్ని విరిచి, చెట్ల పరిసరాలను శుభ్రంగా ఉం చుకోవాలని తెలిపారు.నిద్ర దశలో వుండే పురుగుల్ని బహిర్గతం చేయాలని, గాలి వెలుతురు చొరబడగలి గిన చెట్లపై పురుగుల పెరుగుదల తక్కువగా ఉంటుం దని,చెట్ల మొదళ్లలో చెద పురుగులు వృద్ధి కాకుండా చెట్లకు 4-6 అడుగుల ఎత్తు వరకు బోర్డో పేస్టు సంవ త్సరానికి రెండుసార్లు పూయాలని తెలిపారు.ముట్టె పురుగుల ఉధృతిని గుర్తించే నిమిత్తం చెట్ల పరిసరాల లో మొదలు పగుళ్ళలో వెతికి వాటి అదుపు కొరకు కా య పెరిగే సమయంలో 2 మి.లీ, మోనోక్రోటోఫాస్ ను లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు.మా మిడి పూత సమయంలో ఆశించే బూడిద తెగులు మ చ్చ తెగుళ్ళను తగ్గించే నిమిత్తం కార్బండాజిమ్ 1 గ్రా లేదా 2 మి.లీ. హెక్సాకొనజోల్ లీటరు నీటికి చొప్పు న కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు.మామిడి పండు ఈగల్ని తగ్గించే నిమిత్తం మిథైల్ యుజినాల్ ఎరల్ని వాడాలని పూత, మొగ్గదశలో 13:0:45 మందు 10 గ్రా. ం 5 గ్రా. యూరియాను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలన్నారు.రాతి మంగు రాకుం డా నల్లపూత దశలో తామర పురుగు నివారణకు 2 మి.లీ. ఫిప్రోనిల్ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలని పిందె గోళీకాయ దశకు చేరినప్పుడు ఒ క తేలికపాటి తడి ఇవ్వడం ద్వారా కాయ బాగా పెరు గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు తల్ల పురెడ్డి నాగిరెడ్డి, సామినేని హనుమంతరావు, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ భయం (5వ పేజీ తరువాయి)

అధికారులు హెచ్చరికలతో చికెన్ ధరలు భారీగా పడిపోయాయి. వారం రోజుల క్రితం కెజి రూ.220 వరకు పలికిన ధరలు శుక్రవారం నాటికి గణనయంగా రూ.150 లకు తగ్గింది. బర్డ్‌ఫ్లూ భయంతో ఎక్కువ మంది ప్రజలు చికెన్ జోలికి పోవడం లేదు. చికెన్, గుడ్ల ధరలు భారీగా తగ్గాయి. ఇది ఇలా ఉండగా బర్డ్‌ఫ్లూ కేసులు వచ్చిన 10 కిలోమీటర్ల పరిధిలో మాత్రమే రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఆ ప్రాంతాల్లో గుడ్లు తినొద్దని సూచించారు. చికెన్‌ను 20 నిమిషాల పాటు ఉడికిస్తుంటాం అంటే దాదాపు 100 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద వండుతారు. ఈ ఉష్ణోగ్రతలో వైరస్ బతికే అవకాశం లేదని నిపుణులు చెబుతున్నారు. పూర్తిగా ఉడికించిన చికెన్, గుడ్లతో సమస్య ఉండదని నిపుణులు చెబుతున్నారు.

మనుషులకు వస్తుందా?

బర్డ్ ఫ్లూ సోకి మృతి చెందిన కోళ్లను తిన్నా, బర్డ్ ఫ్లూ సోకినట్లుగా తెలియకపోయినా ఆ చికెన్ తిన్నా మనుషులకు కూడా బర్డ్ ఫ్లూ సోకే అవకాశం ఉందన్న రిపోర్టులు ఉన్నాయని పౌల్ట్రీ నిపుణులు చెబుతున్నారు.

సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు

- మాదిగ ఇంటలెక్చువల్ ఫోరం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ ప్రక్రియను ప్రారంభించినందుకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డికి మాదిగ మేధావులు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఫోరం ప్రతినిధులు ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మెన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, ఓయూ వీసీ ప్రొఫెసర్. ఎం.కుమార్, ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.కాశీం, ప్రొఫెసర్ గడ్డం మల్లేశం, ఏబీసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ,తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సభ్యులు డాక్టర్ చారకొండ వెంకటేష్ కలిశారు. వర్గీకరణ ప్రక్రియను వేగవంతం చేయడానికి రేవంత్ రెడ్డి చూపిన చొరవకు ధన్యవాదాలు తెలియజేశారు.

మాజీ సీఎం దామోదరం సంజీవయ్యకు సీఎం రేవంత్‌రెడ్డి నివాళి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సంజీవయ్య చిత్రపటానికి సీఎం రేవంత్‌రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మెన్లు పటేల్ రమేష్‌రెడ్డి, మానాల మోహన్ రెడ్డి, ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, ఎడ్యుకేషన్ కమిషన్ సభ్యులు చారగొండ వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, తదితరులున్నారు.

ఈపీటీఆర్ఐని గాడిలో పెట్టండి

- ప్రపంచస్థాయి సంస్థ సమస్యల నిలయంగా మారడమేంటి?: ఈపీటీఆర్ఐలో ఆకస్మిక తనిఖీలో మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ శిక్షణా సంస్థ(ఈపీటీఆర్ఐ) నేడు సమస్యల నిలయంగా మారడంపై రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తులనాడారు. వెంటనే ఈపీటీఆర్ఐని గాడి పెట్టాలనీ, అవసరాలపై సమగ్ర నివేదిక అందజేయాలని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ అహమద్ నదీంను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో గల ఈపీటీఆర్ఐ సంస్థను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగస్తుల సమస్యలను అడిగి తెలుసుకొని తక్షణ పరిష్కార మార్గాలను అన్వేషించాలని సూచించారు. గవర్నమెంట్ సంస్థల ద్వారా ప్రయివేటుకు ఇచ్చే పనులని ఈపీటీఆర్ఐకి నామినేషన్ పద్ధతిలో ఇవ్వడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంస్థని ఆధునీకరించేందుకు ప్రభుత్వం నుంచి కావాల్సిన నిధుల కోసం తగిన ప్రతిపాదనలను పంపించాలని సూచించారు. అనంతరం గ్రీన్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువతకి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మంత్రి సురేఖతో పాటు అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీం, పీసీసీఎఫ్ ఆర్ఎం.డోబ్రియల్, ఈపీటీఆర్ఐ సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ స్వరాజ్, డాక్టర్ జి.రమేష్, సంస్థ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్'కు వింత జబ్బు !?

- బీసీ రిజర్వేషన్ల గురించి కవితకు ఏమవసరం?
- ఆమె కంటే పెద్ద అవకాశవాది మరొకరు లేరు : స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

బీఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోయి ఆగమాగం అవుతున్నారని, తొందరపడి నానా యాగి చేస్తున్నారని, వారికి వింత జబ్బు సోకిందని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోయి, మతి భ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. తెల్లారి లేస్తే కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోయడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు ఎంత తొందర పడినా నాలుగేండ్ల తర్వాతనే ఎన్నికలు వస్తాయని తెలిపారు. ఒకవేళ ఉప ఎన్నికలు వస్తే ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. గురువారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రం పదేండ్ల తర్వాత అప్పుల కుప్పగా మారిందని చెప్పారని అన్నారు. ఇది బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి అని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులకు వింత జబ్బు సోకిందని, ప్రతి రోజూ మీడియాలో, పేపర్లలో కనిపించకపోతే బీపీ పెరుగుతుందని అన్నారు. కేవలం మీడియా సమావేశాలు పెట్టడానికే జిల్లాలకు వెళ్తున్నారని, ఈ వింత జబ్బు ఎక్కువగా కేటీఆర్, కవితలకే ఉందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల గురించి కవితకు ఏం అవసరమని, ఆమెను ఎవరు అడిగారని ప్రశ్నించారు. అవకాశవాదం విషయానికి వస్తే కవిత కంటే పెద్ద అవకాశావాది మరొకరు ఉండరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణను నిర్మూలించడం మన అందరి బాధ్యత

- దివ్య దేవరాజన్, పద్మశ్రీ సునీత కృష్ణన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మనుషుల అక్రమ రవాణా నిర్మూలనలో ప్రజలు అందరు భాగస్వామ్యం అయినప్పుడే దీనిని సమూలంగా నివారించవచ్చునిఅని సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, ప్రజ్వల సంస్థ ఫౌండర్ సునీత కృష్ణన్ సూచించారు. స్వచ్ఛంద సంస్థ ప్రజ్వల, తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. దివ్య దేవరాజన్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాకు ఎక్కువగా పేద, మధ్యతరగతి అమ్మాయిలు, మహిళలు గురవుతున్నారని తెలిపారు. దీనిని అరికట్టేందుకు మహిళా సంఘాలకు, పాఠశాలలకు అవగాహన కల్పించాలని కోరారు. ముఖ్యంగా ఆర్థిక, సామాజిక సమస్యలతో ఉన్న మహిళలను టార్గెట్ గా చేసుకుని అక్రమ రవాణా చేస్తూ బలవంతంగా వ్యభిచారం చేయిస్తున్నారని తెలిపారు. సునీత కృష్ణన్ మాట్లాడుతూ సైబర్ ట్రాఫికింగ్‌తో మానవ అక్రమ రవాణా మరింతగా పెరిగిందని తెలిపారు. విద్యార్థులు అనవసరమైన యాప్స్ ద్వారా వ్యక్తిగత ఫోటోలు పంపడం ద్వారా సెక్స్ ట్రాఫికింగ్ గురవుతున్నారని చెప్పారు. ఈ శిక్షణలో మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం ఎలా జరుగుతుంది, బాధితురాలి పైన ఉండే ప్రభావాలు, సైబర్ ఆధారిత అక్రమ రవాణా, చట్టాలు, సఖి, భరోసా, చైల్డ్ లైన్, పోలీస్ టోల్ ఫ్రీ నంబర్స్ 1098, 100, 181, 1930, 181 ల గురించి చెప్పనున్నారు.

105 ఇంటిగ్రేటెడ్ గురుకులాల పనులు

రెండేండ్లలో పూర్తి చేయాలి



స్థలాల గుర్తింపునకు సంబంధించి వారంలో నివేదిక అందించాలి

కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు చేపట్టాలి

అనువైన స్థలం లేకుంటే ప్రత్యామ్నాయం చూడాలి

స్థలాలున్న చోట పనులను వెంటనే ప్రారంభించాలి : అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 105 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాలకు సంబంధించిన పనులను రెండేండ్లలో వంద శాతం పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. విద్యాశాఖ ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్షించారు. ఈ కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రతి నియోజకవర్గంలో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల స్థలాల సేకరణ, ఇతర వివరాలను అధికారులను అడిగి ఆయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ వంద నియోజవర్గాల్లో నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు ఉండాలని చెప్పారు. నియోజకవర్గాల్లో స్థలాల కేటాయింపులు పూర్తయిన వాటికి అనుమతులకు సంబంధించిన పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతిపాదిత స్థలాలు గురుకుల పాఠశాలల ఏర్పాటుకు అనువుగా ఉన్నాయో లేదో పరిశీలించాలని కోరారు. అనువైన స్థలం లేని చోట ప్రత్యామ్నాయ స్థలాన్ని సేకరించాలని సూచించారు.

కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి వీలైనంత త్వరగా స్థలాల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. గురుకుల పాఠశాలల నిర్మాణానికి స్థలాల గుర్తింపు ప్రక్రియకు సంబంధించి వారం రోజుల్లో నివేదికను అందించాలని కోరారు. ఇప్పటికే స్థల సేకరణ జరిగిన నియోజకవర్గాల్లో యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలు పెట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండేండ్లలో 105 నియోజకవర్గాల్లో అన్ని రకాల మౌలిక వసతులతో వందశాతం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో ప్రమాణాలతో కూడిన సరైన మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. క్రీడాస్థలం, అకడమిక్ బ్లాక్, ఇతర సౌకర్యాలను భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలను సిద్ధం చేయాలని కోరారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి అవసరమైన నిధులను ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి, టీజీఈడబ్ల్యూఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ గణపతిరెడ్డి, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వీసీ సూర్య ధనుంజయ్ తదితరులు హాజరయ్యారు.

దేశవ్యాప్తంగా జనగణన చేపట్టాలి

ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలి

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

క్షేత్రస్థాయిలో పర్యటించి అవగాహన కల్పిస్తాం : బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్

రేపటి నుంచి 28వరకు మరోసారి కులగణన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశవ్యాప్తంగా జనగణన చేపట్టాలని బీసీ కమిషన్ చైర్మెన్ జి నిరంజన్ సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్,తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణతో కలిసి ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో నిర్వహించిన బీసీ కులగణనలో పాల్గొనని వారి సౌకర్యార్థం ఆదివారం నుంచి ఈ నెల 28వరకు తిరిగి మరో సారి కుల గణన చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించటం హర్షణీయమన్నారు. దీనిపై అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి కేంద్రానికి పంపాలని నిర్ణయించటం స్వాగతించాల్సిన విషయమని అన్నారు.

జీహెచ్ఎంసీ ఏరియాలో ఎక్కువ శాతం కులగణన జరగలేదనీ, అందువల్ల ఇక్కడ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా, ప్రజాపాలన సేవా కేంద్రాలు, ఆన్‌లైన్ ద్వారా సంబధిత ప్రశ్నావళి ఫార్మెట్‌లను స్వీకరించాలని సూచించారు. తమతో పాటు కమిషన్ సభ్యులు హైదరాబాద్ నగరంలో పర్యటించి ప్రజల్లో అవగాహన కల్పిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కులాల వారిగా సమాచారాన్ని సేకరించి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించ టానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 2006, 2013,2019 ఎన్నికల్లో రిజర్వేషన్ల సీట్లను కలుపుకుని సర్పంచ్ స్థానాల్లో 43.5శాతం బీసీలు గెలిచారని తెలిపారు.వార్డు మెంబర్లుగా 50.4శాతం గెలిచారనీ, ఎంపీపీలుగా 43.4శాతం, ఎంపీటీసీలుగా 46.7శాతం, జెడ్పీటీసీలుగా39.2శాతం గెలిచారని వివరించారు. మున్సిపాల్టీ వార్డు సభ్యులుగా 59శాతం, చైర్‌పర్సన్లుగా 51శాతం, మేయర్లుగా 31శాతం,కార్పొరేటర్లుగా 57శాతం బీసీలు గెలిచారని తెలిపారు. ఈ లెక్కన 42శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తే 65శాతం నుంచి 70శాతం సీట్లు గెలిచే అవకాశం ఉందన్నారు.

మెగా లెదర్ పార్కుల ఏర్పాటుకు సహకరించండి

కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌కు రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో ఏర్పాటు చేసే మెగా లెదర్ పార్కుల ఏర్పాటుకు ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కేంద్రాన్ని కోరారు. శుక్రవారం నాడిక్కడ కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్‌తో ఆయన కార్యాలయంలో శ్రీధర్ బాబు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడులు, ఇతర ప్రధాన అంశాలపై చర్చించారు. ఈనెల 26న హైదరాబాద్‌లో నిర్వహించనున్న బయోఏషియా - 2025 కార్యక్రమానికి కేంద్ర మంత్రిని శ్రీధర్ బాబు ఆహ్వానించారు. జీవవిజ్ఞాన రంగంలో ప్రపంచవ్యాప్తంగా పరిశోధకులు, పాలసీ మేకర్లు, పారిశ్రామిక నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. తెలంగాణలో జీవవిజ్ఞాన రంగ అభివృద్ధికి మంత్రి శ్రీధర్ బాబు తీసుకుంటున్న చర్యలను కేంద్ర మంత్రి ప్రశంసిస్తూ, ఈ కార్యక్రమానికి హాజరవుతానని హామీ ఇచ్చారు.

మెగా లెదర్ పార్కుల ఏర్పాటుకు ఆర్థిక సాయం

కరీంనగర్ జిల్లా రుక్మాపూర్ గ్రామం, జనగాం జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లలో మెగా లెదర్ పార్కులు ఏర్పాటు చేయాలని కేంద్రానికి ప్రతిపాదించారు. ఈ పార్కుల అభివృద్ధికి అవసరమైన సామూహిక కర్బన వ్యర్థాల శుద్ధి కేంద్రాలు సహా ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం పారిశ్రామిక ప్రోత్సాహక విధానాల విభాగం నుంచి కేంద్ర సహాయాన్ని కోరారు.



జహీరాబాద్ నోడ్ ప్రగతికి త్వరగా నిధులు విడుదల చేయండి

జాతీయ పారిశ్రామిక మార్గ అభివృద్ధి సంస్థ (ఎన్ఐసీడీసీ) పరిధిలోని జహీరాబాద్ నోడ్ అభివృద్ధిపై కూడా కేంద్ర మంత్రితో శ్రీధర్ బాబు చర్చించారు. ప్రస్తుత పురోగతిని వివరించి, మిగిలిన అనుమతుల మంజూరు, నిధుల విడుదల త్వరితగతిన చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ వేదికగా తెలంగాణ రాష్ట్ర పెట్టుబడులు, పరిశ్రమల సామర్థ్యాన్ని ప్రదర్శించేం దుకు ఈ ఏడాది జపాన్‌లో జరుగనున్న ఓసాకా ఎక్స్‌పోలో తెలంగాణ ప్రభుత్వం పాల్గొననున్నట్టు శ్రీధర్ బాబు.. పియూష్ గోయల్‌కు అధికారికంగా తెలియజేశారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన లేఖను ఆయనకు అందజేశారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఎ.పి జితేందర్ రెడ్డి, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, ఇతర పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆదాయం, ఉపాధి వనరుగా 'పర్యాటకం'

సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో ప్రోత్సాహకాలు

అటవీ, ఐటీ, టీజీఐఐసీ, మెడికల్, స్పోర్ట్స్ విభాగాలతో సమన్వయం చేసుకోవాలి : సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రానికి ఆదాయం సమకూర్చడమే కాకుండా ఎక్కడికక్కడ యువతకు ఉపాధి కల్పించే వనరుగా పర్యాటకరంగం అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. పర్యాటకులను ఆకర్షించే వనరులు ఎన్నో ఉన్నా, గతంలో ప్రచారంపైన శ్రద్ధ చూపకపోవడం, వినూత్న పద్ధతిలో ఆలోచించకపోవడంతో ఈ రంగంలో ఆశించిన ప్రగతి కనిపించలేదని అన్నారు. తెలంగాణ ఘన చరిత్రను వర్తమానానికి అనుసంధానిస్తూ భవిష్యత్‌కు బాటలు వేసేలా పర్యాటక శాఖను తీర్చిదిద్దాలని చెప్పారు. పర్యాటక శాఖపై శుక్రవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టే వారికి ప్రోత్సాహకాలను అందించాలని అన్నారు. నాగార్జున సాగర్ బ్యాక్ వాటర్‌లో బోట్ హౌస్ అందుబాటులో ఉంచాలనీ, డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు తెలంగాణను వేదికగా మార్చాలని సూచించారు. ఆలయాలు, పులుల అభయారణ్యాలకు పర్యాటకంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉందనీ, ఆ దిశగా దృష్టిసారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. భద్రాచలం, సలేశ్వరం, రామప్ప వంటి ఆలయాలు, మల్లెల తీర్థం, బొగత జలపాతాలు, బౌద్ధ స్తూపాలు, జైన ఆలయాలు ఇలా ప్రతి ఒక్క పర్యాటక ప్రదేశంలో వసతులను మెరుగుపర్చడంతోపాటు సరైన ప్రచారం కల్పించాలని సూచించారు. భువనగిరి కోట రోప్ వే పనులపైనా సీఎం ఆరా తీశారు. భూ సేకరణలో కొంత జాప్యం జరిగిందనీ, ఇప్పుడు భూ సేకరణ పూర్తయినందున త్వరలో టెండర్లు పిలుస్తామని సీఎంకు అధికారులు వివరించారు. సాధ్యమైనంత త్వరగా భువనగిరి కోట రోప్ వే పనులకు టెండర్లను పిలవడంతోపాటు కోటపై ఉన్న చారిత్రక కట్టడాల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

పర్యాటక శాఖ పాలసీకి తుది రూపు ఇచ్చే సమయంలో అటవీ, ఐటీ, విద్యుత్, టీజీఐఐసీ, వైద్య, క్రీడల శాఖలతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఒక శాఖ విధానాలు మరో శాఖ విధానాలకు ఆటంకంగా ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అడ్వెంచర్ స్పోర్ట్స్‌కు పర్యాటక శాఖలో ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. వైద్య అవసరాలకు విదేశాల నుంచి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పర్యాటకుల్లా వచ్చిపోయేలా అన్ని చర్యలూ తీసుకోవాలని సూచించారు. పర్యాటక శాఖకు బడ్జెట్ కేటాయింపులు పెరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మెన్ పటేల్ రమేశ్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, సీఎం ముఖ్యకార్యదర్శి వి శేషాద్రి, చంద్రశేఖర్‌రెడ్డి, సీఎం సంయుక్త కార్యదర్శి సంగీత సత్యనారాయణ, పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



'ఎంఆర్ఎఫ్'లో కార్మికుల శ్రమను దోచుకుంటున్న యాజమాన్యం

నాలుగేండ్లుగా పనిచేస్తున్నా పర్మినెంట్ చేయని వైనం

సీఐటీయూ ఆధ్వర్యంలో రెండు రోజులుగా ఆందోళన

కార్మికులు, నాయకుల పట్ల పోలీసుల దుర్భాష

డీసీఎల్ జోక్యం చేసుకోవాలి: సీఐటీయూ

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేట మండలంలో ఉన్న ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో పనిచేస్తున్న 320 మంది కార్మికులు తమను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో రెండు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. గురువారం కంపెనీ ఎదుట రోజంతా బైటాయించి ఆందోళన చేసిన కార్మికులు.. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీసీఎల్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎంఆర్ఎఫ్ పరిశ్రమల యాజమాన్యం కార్మికుల్ని శ్రమ దోపిడికి గురి చేస్తోందని అన్నారు. ఎంఆర్ఎఫ్ అంకినపల్లి పరిశ్రమలో కార్మికుల్ని పనిలోకి తీసుకునే ముందు మూడు సంవత్సరాల తర్వాత పర్మినెంట్ చేస్తామని యాజమాన్యం చెప్పిందని గుర్తు చేశారు. నాలుగేండ్లు గడుస్తున్నా ఎందుకు పర్మినెంట్ చేయట్లేదని ప్రశ్నించారు. నెలకు రూ.10 వేల వేతనం మాత్రమే ఇచ్చి వెట్టి చాకిరి చేయిస్తున్నారన్నారు. 25 సంవత్సరాల లోపు ఉన్న కార్మికులకు తక్కువ వేతనాలిచ్చి ఎక్కువ పనిచేయించుకుంటున్న ఎంఆర్ఎఫ్ పరిశ్రమ యాజమాన్యంపై లేబర్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏవైన సమస్యలున్నాయని కార్మికులెవరైనా అడిగితే వెంటనే ఆ కార్మికున్ని డ్యూటీ నుంచి తీసేస్తున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల పట్ల యాజమాన్యం కక్షపూరితంగా వ్యవహరించడం మానుకోవాలని కోరారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు యాజమాన్యంతో లేబర్ అధికారులు చర్చలు జరపాలన్నారు. కార్మికుల పక్షాన సీఐటీయూ పోరాడుతుందన్నారు.

కార్మికుల పట్ల పోలీసుల దురుసు ప్రవర్తన

పర్మినెంట్ చేయడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా కార్మికులు ఆందోళన చేశారు. ఎంఆర్ఎఫ్ పరిశ్రమ ఎదుట బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. పరిశ్రమల యాజమాన్యం కార్మికుల్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినా కార్మికులు మాత్రం ప్రశాంతంగానే నిరసన తెలిపారు. ప్రశాంతంగా ఆందోళన చేస్తున్న కార్మికుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. యాజమాన్యం మెప్పుకోసం కార్మికుల్ని ఆందోళన చేయకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య సహనం కోల్పోయి కార్మికులు, సీఐటీయూ నాయకుల పట్ల దురుసుగా ప్రవర్తించడమే కాకుండా నోరుపడేసుకున్నారు. దాంతో డీఎస్పీ క్షమాపణ చెప్పాలని కార్మికులు డిమాండ్ చేశారు.

దళిత విద్యార్థి చేతులు నరకటం అమానుషం

ఎస్ఎఫ్ఐ-కేవీపీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమిళనాడులో దళిత విద్యార్థి చేతులు నరకటం అమానుషమని ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్ రాష్ట్ర కమిటీలు తెలిపాయి. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బుల్లెట్ బండి నడుపుతున్నందుకు దళిత విద్యార్థి చేతులు నరికిన దారుణ ఘటన తమిళనాడులో జరిగిందని తెలిపారు. శివ గంగై జిల్లా మానామదురైకి చెందిన దళిత యువకుడు అయ్యసామి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో ఏడాది చదువుతున్నాడనీ, అతడికి బుల్లెట్ బైక్ ఉండటం మరో సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు యువకులకు కంటగింపుగా మారిందని తెలిపారు. బుధవారం అయ్యసామి తరగతులు ముగిసిన తర్వాత బండిపై ఇంటికి వెళ్తుండగా ముగ్గురు విద్యార్థులు అడ్డుకుని " షెడ్యూల్డ్ కులంలో పుట్టిన నువ్వు బుల్లెట్ ఎలా నడుపుతావ్? " అంటూ రెండు చేతులు నరికేశారని పేర్కొన్నారు. అనంతరం బాధిత విద్యార్థి ఇంటికెళ్లి విధ్వంసం సృష్టించారనీ, ఘటనలో తీవ్రంగా గాయపడిన యువకుడు ప్రస్తుతం మదురై రాజాజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. దారుణమైన కులదురంకార చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులే నేరుగా విత్తనాభివృద్ధి చేసుకోవాలి

విత్తన భరోసా... రైతుల అవగాహన సదస్సు

నవతెలంగాణ-కొత్తగూడెం

వ్యవసాయ పంటలలో తమ విత్తనాన్ని తామే ఉత్పత్తి చేసుకోవడానికి వీలుంటుందని, దానికి మెళుకువలు తెలుసుకోవాలని పలువురు శాస్త్రవేత్తలు సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం, విత్తన పరిశోధన, సాంకేతిక సెంటర్, హైదరాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు సొంతంగా తమ పొలాల్లో వివిధ రకాల వ్యవసాయ పంటలలో తమ విత్తనాన్ని తామే ఉత్పత్తి చేసుకోవడానికి వీలుగా, విత్తనోత్పత్తిలో రైతులు పాటించవలసిన మెళకువల గురించి రైతులకు అవగాహన కల్పించారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రభావతి అపరాల పంటలతో విత్తనోత్పత్తి మెళకువల గురించి రైతులకు విపులంగా వివరించారు. డాక్టర్ సుకుమార్, డాక్టర్ స్వర్ణలతలు వరి పంట, మొక్కజొన్న పంటల్లో పాటించవలసిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మి నారాయణమ్మ రైతులు పాటించవలసిన విత్తనోత్పత్తిలో మెళుకువులు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలువురు రైతులు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న ప్రముఖులు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానానికి వీఐపీల తాకిడి రోజు రోజుకి అంతకంతకు పెరుగుతోంది. దేశ నలుమూలల నుండి పేరుగాంచిన ప్రముఖులు భద్రాచలం సీతారామచంద్రస్వామిని దర్శనానికి రావటమే కాకుండా పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్నానాల ఆచరించి ప్రకృతి అందాల నిలయంగా పిలిచే పాపికొండలకు విహారయాత్రకు అత్యంత ఆసక్తి చూపిస్తున్నారు. శుక్రవారం సైతం రామాలయంలో వీఐపీల సందడి నెలకొంది. ఖమ్మం నగర మేయర్ నీరజ తన కుటుంబ సభ్యులతో కలిసి రామయ్య దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేకాకుండా రోహిణి గ్రూప్ అధినేత రామ్‌బ్రహ్మం, కమర్షియల్ ఛాంపియన్ అశోక్ రెడ్డి యూనిట్ లీడ్ జీవీఎస్ నాయుడు క్లస్టర్ కమర్షియల్ లీడ్ ఇండియా మోహన్ బాబు తదితరులు భద్రాద్రి రామయ్య దర్శించుకుని స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. రామాలయ సందర్శనకు వచ్చే యాత్రికులకు ఆలయ అధికారులు చేపట్టిన ఏర్పాట్ల పట్ల భక్తులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు వేసవి నేపథ్యంలో జల ప్రసాదం తో పాటు మజ్జిగను అందించడం భక్తులందరికీ స్వామివారి తీర్థ ప్రసాదాలు అన్నప్రసాదాన్ని సైతం అందించడం అభినందనీయమని అభిప్రాయపడుతున్నారు.

తప్పుడు ప్రకటనతో అమ్లా చూర్ణం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆయుర్వేదిక్ మందు అమ్లా చూర్ణంను తప్పుడు ప్రకటనలు చేస్తూ మార్కెటింగ్ చేస్తున్నారని డ్రగ్ కంట్రోల్ అథారిటీ (డీసీఏ) అధికారులు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో దీనిని గుర్తించి సీజ్ చేసినట్టు శుక్రవారం డీసీఏ డైరెక్టర్ జనరల్ వీ.బీ.కమలాసన్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిని హైదరాబాద్‌లోని మన్సూరాబాద్‌కు చెందిన రినివా ఆయుర్వేద ప్రయివేట్ లిమిటెడ్ తయారు చేస్తున్నట్టుగా గుర్తించారు. కేసు నమోదు చేసిన అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

మనలో చాలా మందికి ప్రేమ అనగానే యువత మాత్రమే కనిపిస్తారు. కానీ ప్రేమ అనేది ఎవరిపైనైనా ఎప్పుడైనా కలిగే ఒక స్వచ్ఛమైన అనుభూతి. దాన్ని మాటల్లో వర్ణించలేము. ప్రేమ అంటే కేవలం శారీరక ఆకర్షణ మాత్రమే అనుకుంటే పొరపాటు. ప్రేమకు భిన్నమైన రూపాలుంటాయి. భార్యాభర్తల ప్రేమ, స్నేహితుల మధ్య వుండే ప్రేమ, తల్లిదండ్రులు, అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములు వీరి మధ్య కూడా ప్రేమ వుంటుంది. కానీ మనలో చాలా మంది నేటి సమాజంలో కూడా ప్రేమ అంటే అదేదో చేయకూడనిది అనే భావనతో ఉన్నారు. అన్ని ప్రేమలు ఒక్కటి కావు. ఒక వ్యక్తి ఇంకో వ్యక్తిపై చూపించే ప్రేమ రకరకాలుగా ఉంటుంది. వారు చూపించే ప్రేమను బట్టే మనం వారి మధ్య వుండే బంధాన్ని అంచనా వేస్తాము. కానీ ఆ ప్రేమను పొరపాటుగా అర్థం చేసుకుంటే మాత్రం చాలా ఇబ్బందులు వస్తాయి. ఎలాంటి ఇబ్బంది? అవి ఏమిటి..? అనేది ఈ వారం ఐద్వా అదాలత్‌లో చదువుదాం...

జిడ్డు పోవాలంటే..

వంట సమయంలో గోడపై గానీ, స్టౌపై, అలాగే కిచెన్‌లో ఇతర ప్రాంతాలపై నూనె మరకలు, ఇతర మరకలు అవుతుంటాయి. వెంటనే శుభ్రం చేయకపోతే జిడ్డు మరకలు మరింత పేరుకుపోతాయి. అయితే ఇలాంటి నూనె మరకలతో కూడిన జిడ్డును పోగొట్టేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. ఇలాంటి మరకలను సులభంగా పోగొట్టే కొన్ని చిట్కాలను చూద్దాం..

వంటగది గోడపై నూనె మరకలు



ఉంటే ఉప్పు నీటితో కడిగితే మరకలు త్వరగా పోతాయి.

కిచెన్ వాల్ మరకలను శుభ్రం చేయడానికి బేకింగ్ సోడా సహాయపడుతుంది. బేకింగ్ సోడాతో శుభ్రపరచడం వల్ల జిడ్డు మరకలు తొలగిపోతాయి.

తెల్లటి టూత్‌పేస్ట్‌ను ఉపయోగించి మరకలను తొలగించడం సులభం. టూత్‌పేస్ట్‌ని ఆయిల్ స్టెయిన్ ఉన్న ప్రదేశంలో అప్లై చేసి ఐదు నిమిషాల పాటు అలాగే ఉంచాలి. ఆ తర్వాత రుద్ది కడిగేస్తే మరకలు పోతాయి.

నిమ్మ, వెనిగర్ కలిపిన మిశ్రమాన్ని గోరువెచ్చని నీళ్లలో వేసి ఈ నీళ్లతో శుభ్రంగా కడిగేస్తే మరక పోయి మెరుస్తుంది.

లిక్విడ్ డిష్ వాష్‌ను గోడపై స్ప్రే చేసి ఒక గంట పాటు వదిలివేయండి. ఆ తర్వాత గుడ్డపై డిష్ వాష్ వేసి తుడిస్తే మరకలన్నీ పోతాయి. ■

ప్రేమకు రూపాలెన్నో..!

ఐద్వా అదాలత్
సెల్: 9490098024



పార్వతికి దాదాపుగా 52 ఏండ్లు ఉంటాయి. ఉద్యోగం చేసి వాలెంటరీ రిటైర్‌మెంట్ తీసుకుంది. భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పాపకు పెండ్లి జరిగి అమెరికాలో ఉంటుంది. ఆమెకు ఇద్దరు పిల్లలు. రెండు మూడేండ్లకు ఒకసారి ఇండియాకు వస్తుంటుంది. రెండో పాప ఉద్యోగం చేస్తుంది. ఉదయం వెళ్లి సాయంత్రం ఇంటికి వస్తుంది. ఇంట్లో గడిపేందుకు ఎక్కువ సమయం ఉండదు. ఎప్పుడైనా సమయం దొరికితే పార్వతితో కొద్దిసేపు గడుపుతుంది. అది ఎప్పుడో ఆరు నెలలకు, ఏడాదికి ఒక్కసారి. ఆమె ఉద్యోగరీత్యా కొంచెం బిజీగా ఉంటుంది. కాబట్టి ఆమెను తప్పుబట్టేందుకు అవకాశం లేదు. పెండ్లి చేసుకో అంటే 'నాకు పెండ్లి చేసుకునే సమయం లేదు. ఇంట్లో ఉన్న మీకే సమయం కేటాయించలేక పోతున్నాను. అలాంటిది పెండ్లి చేసుకుంటే ఇక్కడ మీరు అర్థం చేసుకున్నట్లుగా అత్తగారింట్లో ఉండదు కదా! పెండ్లి అయితే భర్తకు, అత్తమామలకు, వారి కుటుంబ సభ్యులకు కచ్చితంగా ప్రతి రోజూ నేను సమయం కేటాయించాలి. ప్రస్తుతం నా దగ్గర అంత సమయం లేదు. ఇంకా రెండేండ్లు అయితే అప్పుడు నేను ఫ్రీ అవుతాను. ఆ తర్వాత పెండ్లి గురించి ఆలోచిస్తాను' అంటుంది.

ఇకపోతే భర్త సుదర్శన్. ఆయన పార్వతి కంటే మూడేండ్లు పెద్దవాడు. ప్రస్తుతం ఆయన ఉద్యోగం చేస్తున్నారు. ఇంకో ఐదేండ్లలో రిటైర్ అవుతారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆ ఇంట్లో పార్వతితో మాట్లాడేవారు ఎవరూ లేరు. భర్త సుదర్శన్ కూడా ఉదయం వెళితే రాత్రికి వస్తారు. వచ్చిన తర్వాత కూడా ఆమెతో కొంచెం సేపు మాట్లాడాలి అనే ఆలోచనే అతనిలో ఉండదు. ఈ వాతావరణంలో పార్వతికి జీవితంపై ఆశ అనేదే లేకుండా పోయింది.

'అసలు నాకు నా జీవితం నుండి ఏమి కావాలి? నేను ఎవరి కోసం జీవిస్తున్నాను?' అనే ఆలోచన మొదలు అయ్యింది. తీవ్రమైన నిరాశ, నిస్సహాయత ఆమెలో మొదలైంది. ఎవరితో కలిసేది కాదు. వాళ్ల చుట్టుపక్కల వారు కూడా ఒకరితో ఒకరు కలిసి సరదాగా మాట్లాడుకోరు. 'నేను ఇలాగే వుంటే తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్లే అవకాశం వుంది' అనుకొని 'ఎలాగైనా నాకు నేను ఏదో ఒక వ్యాపకం పెట్టుకుంటే కొంత సమయం అక్కడ వెళ్లిపోతుంది. నలుగురితో కలిసినట్టులుగా కూడా ఉంటుంది' అనుకొని పెయింటింగ్ నేర్చుకోవడానికి వెళ్లింది. అక్కడ అందరూ ఆమె కన్న చాలా చిన్న వారు ఉన్నారు. మొదట్లో 'పిల్లల మధ్య నేను ఎలా నేర్చుకోవాలి' అనుకుంది. కానీ 'నేర్చుకోవడానికి వయసుతో సంబంధం ఏమిటి మాకు వచ్చింది మేము నేర్పిస్తాము. అలాగే మీకు వచ్చింది మీరు మాకు నేర్పించండి' అంటూ ఆ గుంపులో నుండి రమేష్ మాటలు వినిపించాయి ఆమెకు. ఇదేదో బాగుంది అనుకొని ప్రతి రోజూ వెళ్లడం ప్రారంభించింది. ఆమెకు రమేష్‌తో మాట్లాడడం, అతనితో సమయం గడపడం బాగా నచ్చింది. అది ఒక అలవాటుగా మారింది. నెమ్మదిగా ఆమెలో మార్పు మొదలయింది.

పార్వతిలో వచ్చిన మార్పును చూసి భర్తకు అనుమానం కలిగింది. ఎప్పుడూ లేనిది ఈమెలో ఇంత మార్పు ఎలా వచ్చింది అని ఆమెను తిట్టడం మొదలుపెట్టాడు. కానీ పార్వతికి విషయం అర్థం కాలేదు. ఒక రోజు ఆమె పెయింటింగ్ నేర్చుకునే దగ్గరకు వెళ్లి అక్కడి వారినందరిని తిట్టడం, దూషించడం లాంటివి చేశాడు. పార్వతికి చాలా బాధ అనిపించింది. అది సరిపోదు అన్నట్టు పార్వతికి విడాకులు ఇవ్వడానికి నోటీసు కూడా పంపించాడు. అది తీసుకొని ఆమె ఐద్వా అదాలత్‌కు వచ్చింది.

మేము సుదర్శన్‌ను ఆఫీసుకు పిలిచి 'ఈ వయసులో విడాకులు ఎందుకు తీసుకోవాలనుకుంటున్నారు' అని అడిగితే 'ఈమె ఈ వయసులో వేరే వ్యక్తితో సంబంధం పెట్టుకుంది. లేకపోతే ఎందుకు ఇంత సంతోషంగా ఉంటుంది. నాతో గడిపిన ఇన్నేండ్లలో ఎప్పుడూ ఇంత ఆనందంగా లేదు. అప్పుడు ఎప్పుడో మాకు పెండ్లి అయిన కొత్తలో కనిపించిన ఆనందం ఇప్పుడు ఆమెలో కనిపిస్తుంది. కాబట్టి నాకు ఆమెపై అనుమానం వచ్చింది. అందుకే నోటీసు పంపించాను' అన్నాడు.

'ఇద్దరూ ఒకే ఇంట్లో ఉంటున్నారు కదా! నువ్వెందుకు ఇంత సంతోషంగా ఉంటున్నావు అని ఆమెనే మీరు నేరుగా అడగాల్సింది. అలా కాకుండా ఈ వయసులో అనుమానించడమే కాకుండా విడాకుల నోటీసు పంపించారు. పార్వతి మధ్యలో కలగజేసుకొని 'నేను పెయింటింగ్ నేర్చుకునే దగ్గర అందరూ చిన్న పిల్లలే మేడం. వాళ్లతో సమయం గడుపుతుంటే నాకు చాలా సంతోషంగా వుంది. మాకు పెయింటింగ్ నేర్పించే రమేష్‌కు కూడా 30 ఏండ్లు ఉంటాయి. అతని మాటలు కొత్తగా ఉంటాయి. అతనితో మాట్లాడాలి అనిపిస్తుంది. కానీ రమేష్ వయసులో చాలా చిన్నవాడు. ఇంట్లో నాతో మాట్లాడటానికి ఎవరికీ టైం ఉండదు. అలాంటప్పుడు నేను బయటకు వచ్చి నాకు నచ్చిన ఆర్ట్‌ను నేర్చుకోవడంలో తప్పేముంది. సుదర్శన్‌కు నచ్చకపోతే 'వద్దు నువ్వు బయటకు వెళ్ళకు' అని చెబితే సరిపోతుంది కదా! మాకు పెండ్లి జరిగి దాదాపు 32 ఏండ్లు అవుతుంది. ఇన్ని ఏండ్లలో ఆయన నన్ను అర్థం చేసుకున్నది ఇంతేనా. అసలు ఎప్పుడైనా నాతో మాట్లాడితే కదా నా గురించి తెలిసేది. ఇంతకు ముందు నేను కూడా ఉద్యోగం చేసే దాన్ని. నాకు కూడా సమయం ఉండేది కాదు. కానీ ఈ మధ్యనే నేను ఒంటరిగా ఫీల్ అవుతున్నాను. అందుకే బయటకు వెళ్లాను. ఆయనకు కావల్సింది విడాకులే అయితే నేను ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను' అంది.

ఇంకా మాట్లాడుతూ 'రమేష్ అంటే నాకు ప్రేమ వుంది కానీ సుదర్శన్ అనుకునే విధంగా కాదు. నేను నా పిల్లలను కూడా ప్రేమిస్తాను. సుదర్శన్‌ను కూడా ప్రేమిస్తున్నాను. కానీ సుదర్శన్‌పై, పిల్లలపై చూపించే ప్రేమలో తేడా ఉంటుంది. అలాగే నా స్నేహితులను కూడా ప్రేమిస్తాను. వాళ్లపై చూపించే ప్రేమలో తేడా ఉంటుంది. స్నేహానికి కూడా వయసుతో సంబంధం లేదు. రమేష్ నాకు మంచి స్నేహితుడు. అతని మీద చూపించే ప్రేమ వేరుగా ఉంటుంది. ఆ తేడాను అర్థం చేసుకోలేని సుదర్శన్‌కు భార్య స్థానంలో ఉండాలి అంటే కష్టంగా వుంది. కాబట్టి ఆయన అడిగినట్లుగానే విడాకులు ఇస్తాను' అంది.

'సుదర్శన్.. మీరు పార్వతికి సమయం ఇవ్వడం నేర్చుకోండి. భార్య అయినంత మాత్రానా ఆమెపై సర్వ హక్కులు నావే అనుకుంటే పొరపాటు. ఇన్ని రోజులు ఆమె సంతోషం గురించే కాదు, డిప్రెషన్‌లోకి వెళుతున్న విషయం కూడా గమనించలేదు. కానీ ఆమె ఇప్పుడు సంతోషంగా ఎందుకు ఉంది అని అనుమానిస్తున్నారు. విడాకులకు నోటీసు కూడా పంపించారు. అసలు తప్పు చేసింది మీరు. ముందుగా పార్వతితో కొంత సమయం కేటాయించి ఆమెతో కాస్త మాట్లాడండి. పెండ్లయిన కొత్తలో ఆమెపై ఎలాంటి ప్రేమ చూపించారో అందులో కొంత భాగమైన చూపించండి. అప్పుడే మీ ఇద్దరి మధ్య ఉన్న మనస్పర్థలు పోతాయి. పార్వతి చూపించే ప్రేమలో తేడాను గమనిస్తే మీకే అర్థం అవుతుంది. ఆమెను అనవసరంగా అనుమానించి మంచి భార్యను దూరం చేసుకోకండి' అని నచ్చజెప్పి పంపించాము.

- వై వరలక్ష్మి, 9948794051

తునికాకు సేకరణకు ఆదేశాలివ్వాలి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో తునికాకు సేకరణ ప్రక్రియను వెంటనే చేపట్టాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 15వ తేదీ దాటాక కూడా టెండర్లను పిలవని పరిస్థితి గతంలో ఎన్నడూ లేదని చెప్పారు. టెండర్లు వేయకపోతే రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా తునికాకు సేకరణ చేపట్టాలనీ, వెంటనే కొమ్మకొట్టుడు ప్రక్రియను మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. తునికాకు సేకరణపై లక్షలాది గిరిజనులు, ఆదివాసీలు, పేదలు ఆధారపడి బతుకుతున్నారని చెప్పారు. ఈ విషయంలో రాష్ట్ర సర్కారు వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ ఈ నెల 17న రాష్ట్ర వ్యాప్తంగా ఐటీడీఏలు, డీఎఫ్ఓ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టనున్నట్టు ప్రకటించారు. హైదరాబాద్‌లో అటవీ శాఖ మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం ఇస్తామని తెలిపారు. అదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తామని చెప్పారు. ఆ తర్వాత దశల వారీగా వ్యకాస ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. తునికాకు సేకరణ విషయంపై వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆర్.వెంకట్రాములు తీర్మానం ప్రవేశపెట్టారు. ఏఐకేఎస్ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ధర్మానాయక్, ఆర్.శ్రీరాం నాయక్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణజ్యోతి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ప్రసాద్, బి.పద్మ, రాష్ట్ర నాయకులు ఆర్.ఆంజనేయులు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మూఢ్ శోభన్‌నాయక్, సీఐటీయూ రాష్ట్ర నాయకులు సోమన్న, రామకృష్ణ, డీవైఎఫ్ఐ నాయకులు జావేద్, తదితరులు మాట్లాడారు. తునికాకు సేకరణపై ఆరు లక్షలకుపైగా, బీడీ పరిశ్రమపై ఏడు లక్షల మందికిపైగా ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. అన్ని లక్షల మందికి జీవనోపాధిని కల్పించే తునికాకు సేకరణపై రాష్ట్ర సర్కారు ఇలా వ్యవహరించడం సరిగాదన్నారు. 14 ఏజెన్సీ జిల్లాల్లో 196 యూనిట్ల పరిధిలోని గిరిజనులు రెండో పంటగా తునికాకు సేకరణపైనే ఆధారపడి జీవిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం అటవీ హక్కుల చట్టానికి తూట్లు పొడుస్తూ క్రమంగా అటవీ ఉత్పత్తుల సేకరణకు అడ్డుపడటం దారుణమన్నారు. కార్పొరేట్లకు అడవులను కట్టబెట్టే ప్రయత్నంలో భాగంగా వారిని పాలకులు క్రమంగా అడవులకు దూరం చేస్తున్న తీరును ఎండగట్టారు. ఫిబ్రవరి మొదటి వారంలోగా ప్రూనింగ్ ప్రక్రియ మొదలు పెట్టకపోతే నాణ్యమైన తునికాకు రాదని ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి సీతక్క చొరవ తీసుకుని వెంటనే సేకరణ ప్రక్రియ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో నాలుగేండ్లుగా పెండింగ్‌లో ఉన్న బోనస్ రూ.18 కోట్లను తునికాకు కార్మికులకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వారికి మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు బీమా సౌకర్యం కల్పించాలనీ, కట్టరేటు రూ.6కు పెంచాలనీ, లోడింగ్, అన్‌లోడింగ్ చార్జీలు పెంచాలని కోరారు.

మిర్చికి కనీస మద్దతు ధర రూ.25 వేలు ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

గుండెపోటుతో మరణించారు. మిర్చి బోర్డును ఏర్పాటు చేసి మద్దతు ధర నిర్ణయించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేయడంతో పాటు మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీగా డిమాండ్ చేస్తున్నాం. పంటకాలంలో వ్యాపారులు మార్కెట్లల్లో ధరలు తగ్గించడం, రైతుల నుండి సరుకు వ్యాపారులకు చేరిన తర్వాత ధరలను రెట్టింపు చేయడం ప్రతి ఏటా జరుగుతున్నది. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో మిరప పంట క్వింటాల్‌కు కనీస మద్ధతు ధర రూ.15,000లు ఇస్తామని ప్రకటించారు. ఒకవైపు వ్యవసాయ ఖర్చులు పెరిగాయి. మరోవైపు దిగుబడులు బాగా తగ్గాయి. ఎకరాకు 30, 40 క్వింటాళ్ళు దిగుబడి రావాల్సి ఉండగా క్రిమీకీటకాల వల్ల ఎకరాకు దిగుబడి 12 క్వింటాళ్ళకు తగ్గింది. రైతులకు ఎకరాకు పెట్టుబడి రూ.1.5లక్షల నుంచి రూ.2 లక్షల వరకు పెట్టారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరల ప్రకారం పెట్టిన పెట్టుబడులు కూడా రాని స్థితి ఉంది. దీంతో వివిధ జిల్లాల్లో రైతులు ఆందోళనలు చేస్తున్నారు.రాష్ట్ర మార్కెటింగ్ శాఖ జోక్యం చేసుకొని క్వింటాల్‌కు రూ.25 వేలు ధర ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ మార్కెట్లలో ప్రభుత్వ నియంత్రణ పెరగాలి. అంతర్జాతీయ మార్కెట్‌లో మిరపకు మంచి ధర ఉన్నందున వ్యాపారులకు పోటీగా మార్క్‌ఫెడ్ ద్వారా రూ.25 వేలకు క్వింటాల్ కొనుగోలు చేసినప్పటికీ ఎలాంటి నష్టం రాదు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి' అని కోరారు.

గుమ్మడిదలను మరో లగచర్ల చేయొద్దు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఆరుగాలం పంటలు పండే పచ్చటి ప్రాంతంగా ఉన్న గుమ్మడిదలను మరో లగచర్ల చేయొద్దని, ప్రజల నెత్తిన చెత్త డంపింగ్ యార్డును తెచ్చి పెట్టొద్దని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. డంపింగ్ యార్డు ఏర్పాటును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు చేస్తున్న నిరసన దీక్షలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, చింత ప్రభాకర్, మాణిక్యరావు, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజుతో కలిసి హరీశ్‌రావు శుక్రవారం మద్దతు తెలిపారు. ప్రజలు చేస్తున్న న్యాయమైన పోరాటానికి బీఆర్ఎస్ మద్దతుగా నిలుస్తుందని హామీ ఇస్తూ దీక్షల్లో కూర్చున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఫార్మా సిటీల పేరుతో లగచర్ల, జహీరాబాద్ ప్రాంతంలోని న్యాలకల్‌లో వేల ఎకరాల్ని రైతుల నుంచి లాక్కోవడం సరైంది కాదన్నారు. గుమ్మడిదల ప్రాంతంలో డంపింగ్ యార్డు పెట్టి ఈ ప్రాంతం ఉనికే లేకుండా చేయొద్దని తెలిపారు. ప్రజలు ప్రజాస్వామ్య పద్ధతిలో డంపింగ్ యార్డును వ్యతిరేకిస్తూ పోరాడుతున్నారన్నారు. జీవనాధారమైన పాడి పశువులు, గొర్రెలు, మేకలతో పాటు పిల్లలు, మహిళలు, రైతులు నిత్యం ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రజాభిప్రాయానికి భిన్నంగా గుమ్మడిదల, ప్యారానగర్ ప్రాంతంలో డంపింగ్ యార్డు పెట్టవద్దని ప్రభుత్వానికి సూచించారు. రాబోయే బడ్జెట్ సమావేశాల్లో గుమ్మడిదల డంపింగ్ యార్డు సమస్య గురించి అసెంబ్లీలో మాట్లాడుతామన్నారు. ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డ్ పెడితే దుండిగల్ ఎయిర్‌లైన్స్‌కు ఇబ్బందులు తలెత్తుతాయని ఎయిర్‌ఫోర్స్ అకాడమి సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. ప్రజలు వ్యతిరేకిస్తున్నా, ఎయిర్ లైన్స్ అధికారులు వద్దని ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా డంపింగ్ యార్డు పనులు చేయడం సరైంది కాదన్నారు. రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ప్యారానగర్ ప్రాంతంలోని రైతుల భూముల్ని సర్వే చేయాలని, అప్పటి వరకు అక్కడ ఎలాంటి పనులు చేపట్టొద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. అయినా సంగారెడ్డి కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్ కోర్టు ఆదేశాల్ని ఖాతరు చేయకపోవడం సరైందికాదన్నారు. వెంటనే పనుల్ని ఆపి టిప్పర్లు, పోలీస్ బలగాలను వెనక్కు రప్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కలెక్టర్, కమిషనర్ ఇద్దరు కూడా కోర్టు బోను ఎక్కాల్సి వస్తుందని, తర్వాత పరిణామాలకు వాళ్లే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. గుమ్మడిదల ప్రాంతంలో ఇప్పటికే ఎయిర్‌ఫోర్స్ కోసం 15 వేల ఎకరాల్ని సేకరించారని, ఉన్న కొద్దిపాటి భూముల్లో ఆరుగాలం పంటలు పండించే రైతులకు అన్యాయం చేసేలా డంపింగ్‌యార్డును అక్కడ పెట్టొద్దని డిమాండ్ చేశారు. ప్రజలకు, రైతులకు ఇతరులకు ఇబ్బందుల్లేకుండా గ్రామాల్లేని దూర ప్రాంతాల్లో డంపింగ్ యార్డు పెట్టాలని సూచించారు. ప్యారానగర్‌లో డంపింగ్ యార్డు పెట్టాలని వైఎస్ఆర్, కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఎవరి ప్రభుత్వంలో నిర్ణయం తీసుకున్నారనేది ముఖ్యం కాదని, ప్రజల అభిప్రాయాలకు భిన్నంగా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ప్రభుత్వం డంపింగ్ యార్డును రద్దు చేయకపోతే ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

నూతన సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ ?

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

నూతన ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)గా జ్ఞానేశ్ కుమార్‌ను ఎంపిక చేయనున్నట్టు తెలిసింది. ప్రస్తుత సీఈసీ రాజీవ్ కుమార్ 18న పదవీ విరమణ పొందుతున్నారు. దీంతో కొత్త సీఈసీ ఎంపిక ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది. 17న సెలక్షన్ కమిటీ సమావేశమయ్యే అవకాశం ఉంది. ఈ కమిటీలో ప్రధాని మోడీ, కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, లోక్‌సభలో ప్రతిపక్ష నేత హోదాలో రాహుల్ గాంధీ ఉన్నారు. సీఈసీ, ఈసీ ఎంపికకు సంబంధించిన కొత్త చట్టానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టడానికి ఒకరోజు ముందు సీఈసీ ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. సీఈసీగా 2022 మేలో రాజీవ్ కుమార్ నియమితులయ్యారు. గత ఏప్రిల్-జూన్‌లో జరిగిన కీలకమైన లోక్‌సభ ఎన్నికలు, దశాబ్దం తరువాత జమ్మూకాశ్మీర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ఆయన ఆధ్వర్యంలోనే జరిగాయి. 2022లో రాష్ట్రపతి ఎన్నికల నిర్వహణ, కర్నాటక, తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలనూ నిర్వహించారు. చివరిసారిగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించారు. రాజీవ్ కుమార్ తన పదవీకాలంలో ప్రతిపక్షాల నుంచి అనేక ఫిర్యాదులు ఎదుర్కొన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల విషయంలో బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఈవీఎంల వినియోగాన్ని నిలదీశాయి. లైవ్ ఓటింగ్ ట్రెండ్స్ పబ్లిష్ చేయడంలో ఈసీ తీవ్ర జాప్యం చేసిందంటూ హర్యానా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఎలక్షన్ కమిషన్ పూర్తిగా బీజేపీకి లొంగిపోయిందని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు ముందు ఆప్ తీవ్ర ఆరోపణలు చేసింది. మరోవైపు మహారాష్ట్రలో 23 లక్షల కొత్త ఓట్ల నమోదుపై రాహుల్ గాంధీ విమర్శలు చేశారు. ఈ ఆరోపణలను సీఈసీ స్వయంగా తిప్పికొట్టారు. ఈవీఎంలను ఎవరూ హ్యాక్ చేయలేరని, ఈసీ నిష్పాక్షికతను ఎవరూ వేలెత్తిచూపలేరని అన్నారు.

వరుస ఎన్నికలు..

కాగా, ఈ ఏడాదిలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా, వచ్చే ఏడాది పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అసోం, కేరళ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. దీంతో కొత్త సీఈసీ ఎంపిక మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

జ్ఞానేశ్ కుమార్ ఎవరు?

జ్ఞానేశ్ కుమార్ కేరళ కేడర్‌కు చెందిన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఇంతకు ముందు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆధ్వర్యంలోని సహకార మంత్రిత్వ శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖల కార్యదర్శిగా పని చేసి పదవీ విరమణ పొందారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఏర్పాటుతో సహా అయోధ్య కేసుపై సుప్రీం కోర్టు తీర్పునకు సంబంధించిన అన్ని విషయాలను చూసేందుకు హోం మంత్రిత్వ శాఖలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగానికి ఆయన నేతృత్వం వహించారు.

దివాలా తీసిన డబుల్ ఇంజిన్ సర్కార్

న్యూఢిల్లీ : మణిపూర్‌లో బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం పూర్తిగా దివాలా తీసిందన్న వాస్తవాన్ని ఆ రాష్ట్రంలో విధించిన రాష్ట్రపతి పాలన తేటతెల్లం చేస్తోందని సీపీఐ (ఎం) వ్యాఖ్యానించింది. రాష్ట్రపతి పాలన సమస్యకు పరిష్కారం కాదని అభిప్రాయపడింది. ఈ మేరకు సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆ వివరాలు... గత రెండు సంవత్సరాలుగా బీజేపీ పాలనలో మణిపూర్ హింసాకాండతో అట్టుడికిపోయింది. ఇప్పుడు అక్కడ రాష్ట్రపతి పాలన విధించింది రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కాదు. అధికార కూటమిలో నెలకొన్న అంతర్గత విభేదాలను పరిష్కరించేందుకు కొంత సమయం అవసరం కనుక ఆ నిర్ణయం తీసుకున్నారు. ప్రధాన అపరాధి అయిన ముఖ్యమంత్రికి బీజేపీ-ఆర్ఎస్ఎస్‌లు వత్తాసు పలికాయి. ఆయన పక్షపాత వైఖరిని ఇప్పుడు న్యాయస్థానం పరిశీలిస్తున్న తరుణంలో రాజీనామా చేశారు. తన జాతి పట్ల ఆయన ప్రదర్శించిన పక్షపాత ధోరణికి సంబంధించి న్యాయస్థానానికి ఆధారాలు సమర్పించడంతో విధిలేని పరిస్థితుల్లో రాజీనామా చేయక తప్పలేదు.

ఈ పరిణామాలన్నింటి నడుమ...తీవ్రమైన సమస్యల నుండి మణిపూర్ ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు అధికార పార్టీ కేంద్ర నాయకత్వం, కేంద్ర ప్రభుత్వం నిరాకరించాయి. ఆ రాష్ట్రంలో పర్యటించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ సైతం సుముఖత చూపలేదు. రాష్ట్రంలో ఒక తెగకు అనుకూలంగా అధికార పార్టీ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన వైఖరికి ఇది అద్దం పడుతోంది. రాష్ట్రం, దాని ప్రజల కంటే తమ సొంత రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని అవి భావించాయి. సమస్యకు రాష్ట్రపతి పాలన పరిష్కారం కాదు. అది విధించినంత మాత్రాన కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతల నుండి తప్పించుకోలేదు. జాతుల మధ్య నెలకొన్న విభేదాల పరిష్కారానికి కేంద్రం వెంటనే చర్యలు ప్రారంభించాల్సి ఉంది. వివిధ సమాజాల ప్రతినిధులతో సంప్రదింపులు జరపాలి. సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు, శాంతి స్థాపనకు, మత సామరస్యం నెలకొల్పేందుకు అవసరమైన న్యాయసమ్మతమైన పరిష్కారాన్ని కనుగొనేందుకు అన్ని రాజకీయ పార్టీలనూ విశ్వాసంలోకి తీసుకోవాల్సి ఉంటుంది. నిర్దిష్ట కాలపరిమితిలో ఎన్నికలు నిర్వహించడం సహా రాష్ట్ర ప్రజల ప్రజాస్వామిక హక్కులకు రక్షణ కల్పించాల్సిన అవసరం కూడా ఉన్నదని సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో ఆ ప్రకటనలో డిమాండ్ చేసింది.

మోడీ బీసీ కాదు

(మొదటిపేజీ తరువాయి)

బీసీ-ఈ గ్రూప్ కింద నాలుగు శాతం రిజర్వేషన్ ఉంది కాబట్టే మైనార్టీల లెక్క తీశామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ ఒక్కరోజే సర్వే చేసి కాకి లెక్కలు చూపించారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ చేసిన సమగ్ర కుటుంబ సర్వే సరైనదే అయితే ఇప్పటిదాకా వివరాలు ఎందుకు వెల్లడించలేదని నిలదీశారు. కులగణనపై విపక్షాలది దుష్ప్రచారం మాత్రమేనన్నారు. సీనియర్ మంత్రులను కులగణన సర్వేలో సభ్యులుగా చేర్చామనీ, నిర్దిష్ట ప్లాన్‌ను రూపొందించాలని ప్రణాళిక శాఖకు అప్పగించామని తెలిపారు. మొత్తం లక్షా నాలుగు వేల మంది ప్రభుత్వ అధికారులు సర్వేలో పాల్గొన్నారన్నారు. మూడు రోజుల్లో 150 ఇండ్లను సర్వే చేసేలా ప్రణాళిక రూపొందించామని చెప్పారు. 95 వేల యూనిట్లుగా విభజించి 95 వేల మంది ఎన్‌రోలర్స్‌ను నియమించామని తెలిపారు. మొత్తం 45 రోజుల పాటు సర్వే చేసి రిపోర్టు తయారు చేయించామని చెప్పారు. అధికారులు ఒకటికి నాలుగు సార్లు ప్రతీ ఇంటికి తిరిగి వివరాలు సేకరించారన్నారు. సర్వే వివరాలను కేటీఆర్ లాంటి వాళ్లు తప్పుబడతారనే ఉద్దేశంతోనే యాజమానుల సంతకాలు తీసుకున్నామని చెప్పారు. అలాగే 36 వేల మంది డేటా ఆపరేటర్లతో సర్వేను ఆన్‌లైన్ చేయించామని పేర్కొన్నారు. కొంత మంది అందుబాటులో లేరనీ, అలాంటి వారి కోసం రెండో విడతలో అవకాశం ఇచ్చామని గుర్తు చేశారు. అనంతరం బీసీ కులగణనపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎస్సీ వర్గీకరణపై మంత్రి దామోదర రాజనర్సింహ్మా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్యవర్గ సభ్యులు, చైర్మెన్లు, డీసీసీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల గడువు పొడిగింపు


(మొదటిపేజీ తరువాయి)

సహకార సంఘాల రిజిస్ట్రార్ నుంచి ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో సహకార సంఘాల పాలకవర్గ గడువును పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

'బాపు'.. ఓ అరుదైన సినిమా



బ్రహ్మాజీ లీడ్ రోల్స్‌లో ఒకరిగా ఆమని, బలగం సుధాకర్ రెడ్డి, ధన్య బాలకృష్ణ, మణి ఏగుర్ల, అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలు పోషిస్తున్న డార్క్ కామెడీ-డ్రామా 'బాపు'. ఈ చిత్రానికి దయా దర్శకత్వం వహించారు.
కాన్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, అథీరా ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై రాజు, సిహెచ్ భాను ప్రసాద్ రెడ్డి నిర్మించారు. ఈ సినిమా ఈనెల 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను ఘనంగా చేశారు. హీరోలు రానా దగ్గుబాటి, తిరువీర్ ఈ ఈవెంట్‌కు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
రానా దగ్గుబాటి మాట్లాడుతూ, 'రెగ్యులర్‌కి భిన్నంగా ఉండే ఇలాంటి జోనర్స్ రావడం చాలా అరుదు. ఒక కల్చర్‌ని చూపించే జోనర్ రావడం ప్రేక్షకుడిగా చాలా ఎగ్జైటెడ్‌గా ఉన్నాను' అని తెలిపారు.
"బాపు' టైటిల్ పెట్టగానే నచ్చేసింది. ఇందులో ప్రమోషనల్ కంటెంట్ నా బాల్యానికి తీసుకెళ్ళింది. ట్రైలర్‌లో మట్టివాసన కనిపించింది. బ్రహ్మాజీని ఇలాంటి పాత్రల్లో చూస్తే కడుపు నిండిపోయింది. దయ చాలా మంచి సినిమా తీశారు. అందరూ ఆదరిస్తారని కోరుకుంటున్నాను' అని హీరో తిరువీర్ చెప్పారు. మధుర శ్రీధర్ మాట్లాడుతూ,' ఇది చాలా అందమైన సినిమా. రెండు సార్లు సినిమా చూశాను. చాలా నచ్చింది. ఇందులో మన కుటుంబంలో పాత్రలు కనిపిస్తాయి. డైరెక్టర్ దయ మనుషుల ముసుగు తొలగించి ఓ కథ చెప్పాడు' అని తెలిపారు. 'ఇదొక మంచి కంటెంట్ ఉన్న సినిమా. అందరూ కలసి మంచి ప్రయత్నం చేశాం. రానా మా ఈవెంట్‌కి రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాకి మంచి పేరు రావాలని ఆశిస్తున్నాను' అని బ్రహ్మాజీ చెప్పారు.



ప్రభాస్, అనుపమ్ ఖేర్

కీలక పాత్రలో అనుపమ్ ఖేర్

హీరో ప్రభాస్, డైరెక్టర్ హను రాఘవపూడి కాంబినేషన్‌లో మైత్రి మూవీ మేకర్స్ ఓ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో బాలీవుడ్ లెజెండ్ అనుపమ్ ఖేర్ చాలా ముఖ్యమైన పాత్ర కోసం ఎంపికయ్యారు. ఈ విషయాన్ని అనుపమ్ ఖేర్ స్వయంగా సోషల్ మీడియా ద్వారా షేర్ చేశారు. గొప్ప పాత్రలు చేయడంలో పేరుపొందిన అనుపమ్, ఈ సినిమా స్క్రిప్ట్‌ను 'అద్భుతం' అని అన్నారు. ప్రభాస్‌తో స్క్రీన్ స్పేస్‌ను పంచుకోవడానికి ఉత్సాహంగా ఉన్నానని, దర్శకుడు హను రాఘవపూడి ప్రతిభ అత్యద్భుతం అని ఆయన ప్రశంసించారు.
1940 హిస్టారికల్ ఫిక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో మాతృభూమి ప్రజలకు న్యాయాన్ని అందించడానికి పోరాటం చేసే ఓ యోధుడి కథగా ఈ సినిమా ఉండబోతోంది. ఇమాన్వి ఈ చిత్రంలో ప్రభాస్ సరసన హీరోయిన్‌గా నటిస్తుండగా, మిథున్ చక్రవర్తి, జయప్రద కీలక పాత్రలు పోషిస్తున్నారు.
నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: హను రాఘవపూడి, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై రవిశంకర్, డీవోపీ: సుదీప్ ఛటర్జీ, సంగీతం: విశాల్ చంద్రశేఖర్, ప్రొడక్షన్ డిజైనర్: అనిల్ విలాస్ జాదవ్, ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వరరావు, లిరిక్స్: కృష్ణకాంత్.

మెప్పించే సరికొత్త కాన్సెప్ట్..



తన తొలి చిత్రం 'మేం ఫేమస్'తో లీడ్ యాక్టర్, దర్శకుడిగానూ మంచి గుర్తింపు తెచ్చుకున్న సుమంత్ ప్రభాస్ హీరోగా తన రెండో చిత్రంతో త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ మూవీ రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ మేడిన్ వెంచర్. ఎంఆర్ ప్రొడక్షన్స్ షార్ట్ ఫిల్మ్‌లతో పాపులరైన సుభాష్ చంద్ర దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.
ఈ చిత్రం సెకండ్ షెడ్యూల్ షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ షెడ్యూల్‌లో హై-ఎనర్జీ సన్నివేశాలు చిత్రీకరించారు. వీటిలో ఆటో రేస్ సీక్వెన్స్, ఇంటెన్స్ యాక్షన్ బ్లాక్‌లు ఉన్నాయి. ఇవి థ్రిల్లింగ్ సినిమాటిక్ అనుభవాన్ని ఇస్తాయి. అలాగే సుమంత్ ప్రభాస్, రాజ్‌కుమార్ కసిరెడ్డి, సుదర్శన్, వివా రాఘవ్, రోహిత్ కృష్ణ వర్మలతో కూడిన కామెడీ ట్రాక్‌లను చిత్రీకరించారు. రేలంగి, భీమవరం, సకినేటిపల్లి లంక, అంతర్వేది ఆలయ ప్రాంగణంతో సహా అందమైన లోకేషన్స్‌లో షూటింగ్ జరిగింది. ఈ షెడ్యూల్‌లో అనేక కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించారు. తాజాగా టీమ్ మూడవ షెడ్యూల్‌కు సిద్ధమవుతోంది. ఈనెల చివరి వారంలో ప్రారంభమై మార్చి ప్రథమార్థం వరకు కొనసాగనుంది. ఇందులో పాటలు, ఇతర కీలకమైన సన్నివేశాల చిత్రీకరించనున్నారు. ఈ చిత్రంతో నిధి ప్రదీప్ హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. జగపతి బాబు మేజర్ రోల్ పోషిస్తున్నారు.



చాంపియన్స్ ట్రోఫీ విజేతకు రూ.19కోట్లు

దుబాయ్: పాకిస్థాన్ వేదికగా జరగనున్న చాంపియన్స్ ట్రోఫీకి ప్రైజ్‌మనీ వివరాలను అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) వెల్లడించింది. టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ 6.9 (రూ.60 కోట్లు)మిలియన్ డాలర్లు. అయితే విజేతకు 2.24 డాలర్ల(రూ.19.45కోట్లు), రన్నరప్ జట్టుకు 1.12 మిలియన్ డాలర్లు(రూ.9.72కోట్లు) ప్రైజ్‌మనీ అందజేయనున్నట్లు తెలిపింది. ఇక సెమీస్‌లో ఓడిన జట్లకు రూ.4.86కోట్లు చొప్పున అందజేయనున్నారు. ఇక చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనే 8 జట్లకు కనీసం లక్షా 25 వేల డాలర్లు చొప్పున ఇవ్వనున్నారు. ఫిబ్రవరి 19వ తేదీ నుంచి చాంపియన్స్ ట్రోఫీ జరగనున్న విషయం తెలిసిందే. చాంపియన్స్ ట్రోఫీలో ప్రతి మ్యాచ్ కీలకం కానుంది. ప్రతి గ్రూప్ స్టేజ్‌లో గెలిచే జట్టుకు 34 వేల డాలర్ల ప్రైజ్‌మనీ దక్కుతుంది. ఇక టోర్నీలో అయిదు, ఆరవ స్థానాల్లో నిలిచే జట్లకు 3.50 లక్షల డాలర్ల ప్రైజ్‌మనీ అందనున్నది. ఏడు, ఎనిమిదవ స్థానాల్లో ఉన్న వారికి లక్షా 40 వేల డాలర్ల ప్రైజ్‌మనీ ఇస్తారు. ఈసారి ఛాంపియన్స్ ట్రోఫీలో అన్ని జట్లకు కలిపి 6.9మిలియన్ డాలర్లు(రూ.59కోట్లు) అందజేయనున్నారు. గ్రూప్ దశలో ఒక్కో మ్యాచ్ గెలిచిన జట్టు రూ.29లక్షలు చొప్పున అందుకోనుండగా.. 5, 6 స్థానాల్లో ఉన్నట్లు జట్లు రూ.3.04కోట్లు చొప్పున, 7, 8 స్థానాల్లో నిలిచిన జట్లు రూ.1.21కోట్లు చొప్పున అందుకోనున్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడే ప్రతి జట్టు కనీసం రూ.1.08కోట్లు చొప్పున అందుకోనున్నట్లు ఐసిసి వెల్లడించింది. ఇది 2017లో జరిగిన చాంపియన్స్ ట్రోఫీతో పోల్చిచూస్తే సుమారు 53శాతం అధికంగా ఉన్నట్లు ఐసిసి పేర్కొంది.
ఫిబ్రవరి 19నుంచి పాకిస్తాన్ వేదికగా 2025 ఛాంపియన్స్ ట్రోఫీ జరగనుంది. ఐసిసి టాప్-8 ర్యాంక్‌లు ఉన్న 8 జట్లు.. రెండు గ్రూపులుగా తలపడనున్నాయి. ప్రతి గ్రూపు నుంచి టాప్ రెండు జట్లు సెమీస్‌కు ప్రవేశిస్తాయి. ఐసిసి చాంపియన్స్ ట్రోఫీ ప్రతి నాలుగేళ్లకు ఒకసారి జరగనున్న విషయం తెలిసిందే.

టాప్‌తో ముగించిన సర్వీసెస్

- ముగిసిన 38వ జాతీయ క్రీడలు
- ముఖ్య అతిథులుగా అమిత్ షా, మాండవీయ



డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ వేదికగా జరిగిన 38వ జాతీయ క్రీడలు శుక్రవారంతో ముగిసాయి. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథులుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా, క్రీడల మంత్రి మన్సుక్ మాండవీయ హాజరయ్యారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధమి వీరిని సాదరంగా ఆహ్వానించారు. మాండవీయ మాట్లాడుతూ.. ఉత్తరాఖండ్ ప్రభుత్వం జాతీయ క్రీడలను దిగ్విజయంగా పూర్తిచేసిందని, అథ్లెట్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించడం హర్షణీయమన్నారు. రాబోయే రోజుల్లో ఉత్తరాఖండ్ స్పోర్ట్స్ హబ్‌గా నిలుస్తుందని కొనియాడారు. 2036 ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యమే లక్ష్యంగా క్రీడలు దిగ్విజయంగా ముగిసాయమని పేర్కొన్నారు. 39వ జాతీయ క్రీడలు మేఘాలయాలో జరగనున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కొంగల్ సంగ్మా ఉత్తరాఖండ్ క్రీడల మంత్రి రేఖా ఆర్యా క్రీడల బారెన్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో భారత ఒలింపిక్ అసోసియేషన్(ఐఓఎ) అధ్యక్షురాలు పిటి ఉష, మహిళల బాక్సింగ్ లెజెండ్ మేరీ కోమ్, ఒలింపిక్ పతక విజేతలు గగన్ నారంగ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముగింపు వేడుకలకు దాదాపు 25వేల మంది ప్రేక్షకులు హాజరయ్యారు.
ఈ క్రీడల్లో అత్యధిక స్వర్ణ పతకాలను సర్వీసెస్ జట్టు సాధించి టాప్‌లో నిలువగా.. రెండో స్థానంలో ఉన్న మహారాష్ట్ర 198పతకాలతో నిలిచింది. ఇందులో 54స్వర్ణ, 71రజత, 73కాంస్యాలుండగా.. మూడో స్థానంలో హర్యానా ఉంది. హర్యానా సాధించిన 153పతకాల్లో 48స్వర్ణ, 47రజత, 58కాంస్య పతకాలుండగా.. కర్ణాటక, మధ్యప్రదేశ్ ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

శ్రీలంక క్లీన్‌స్వీప్

రెండో వన్డేలో ఆస్ట్రేలియాపై ఘన విజయం



కొలంబో: ఆస్ట్రేలియాతో జరిగిన రెండు వన్డేల సిరీస్‌ను ఆతిథ్య శ్రీలంక జట్టు క్లీన్‌స్వీప్ చేసింది. ఆస్ట్రేలియాతో శుక్రవారం జరిగిన రెండో వన్డేలో శ్రీలంక జట్టు 175పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక జట్టు 50ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 281పరుగులు చేయగా.. ఛేదనలో ఆస్ట్రేలియాను కేవలం 107పరుగులకే ఆలౌట్ చేసింది. శ్రీలంక జట్టులో కుశాల్ మెండీస్(101) సెంచరీకి తోడు, మధుష్క(51), కెప్టెన్ అసలంక(78నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. ఇక ఆస్ట్రేలియా బ్యాటర్లలో కెప్టెన్ స్మిత్(29), ఇంగ్లిస్(22) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించగా.. మిగిలిన బ్యాటర్లు నిరాశపరిచారు. దీంతో ఆసీస్ జట్టు 24.2ఓవర్లలో 107పరుగులకే కుప్పకూలింది. శ్రీలంక బౌలర్లలో వెల్లెలగేకు నాలుగు, హసరంగ, ఫెర్నాండోకు మూడేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కుశాల్ మెండీస్‌కు, సిరీస్ అసలంకకు దక్కాయి.

కేంద్రానిది జుమ్లా బడ్జెట్



(మొదటిపేజీ తరువాయి)
సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అధ్యక్షత వహించగా ఆయా జిల్లాల నుంచి కార్మికులు హాజరయ్యారు. ఈ సెమినార్‌కు పలువురు ప్రముఖ ఆర్థిక, సామాజిక విశ్లేషకులు, కార్మిక నాయకుల హాజరై బడ్జెట్‌పై ప్రసంగించారు.

శ్రమజీవుల కష్టంతోనే జీడీపీ పెరుగుదల
సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

శ్రమజీవుల కష్టంతోనే దేశ జీడీపీ పెరుగుతుందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు వ్యాఖ్యానించారు. సంపద పెరుగుతదలకు కారణమైన పేదలను బడ్జెట్‌లో నిర్లక్ష్యం చేశారని చెప్పారు. కార్పొరేట్ల వృద్ధి కోసమే అనేలా బడ్జెట్ ఉందని అభిప్రాయపడ్డారు. బడ్జెట్ అంటే ఆదాయ, వ్యయాలు మాత్రమే కాదనీ, ప్రజల బతుకుతెరువని వివరించారు. మధ్యతరగతికి కొంత మేలు చేసినా, రూ. 55 లక్షల కోట్ల బడ్జెట్‌లో మెజార్టీ ప్రజల సంక్షేమానికి కోతలు పెట్టారని తెలిపారు. సామాన్యులపై పరోక్ష పన్నులు వేసే మోడీ సర్కారు, కార్పొరేట్లపై ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. నయా ఉదారవాద విధానాలతో భ్రష్టుపట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారాన్ని ఉపయోగించుకుని ప్రయోజనాలు పొందడమే కార్పొరేట్ల లక్ష్యమన్నారు. వాస్తవాలు చెప్పడమే కమ్యూనిస్టుల కర్తవ్యమని వ్యాఖ్యానించారు. వ్యవస్థలోని దోపిడిని అంతంచేసేదే కమ్యూనిజమని అభిప్రాయపడ్డారు.




నిజవేతనాలు పడిపోయాయి : సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. వీరయ్య



కార్మికుల నిజవేతనాలు పడిపోయాయని, కేంద్ర బడ్జెట్‌లో వాటికి పరిష్కారం చూపలేదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య అన్నారు. పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో ఉపాధి అవకాశాలు పెంచడంలో మోడీ సర్కారు విఫలమైందని వ్యాఖ్యానించారు. ప్రజల కోసం ప్రభుత్వం కేటాయిస్తున్నదెంత ? ఖర్చుపెడుతున్నదెంత ? అని ప్రశ్నించారు. సరుకులు అమ్ముడుపోవాలంటే ప్రజల కొనుగోలు శక్తి పెరగాలనీ, అందుకనుగుణంగా బడ్జెట్‌లో ఎలాంటి చర్యలనూ ప్రతిపాదించలేదని అన్నారు. జనం జేబులు నింపేలా కేటాయింపులు లేవని గుర్తు చేశారు. విద్యావైద్యం, నివాస అవసరాలకు ఆర్థిక సాయం చేస్తే ప్రజలపై భారం తగ్గుతుందని చెప్పారు. 12 గంటల పనివిధానం దాదాపుగా వచ్చేసిందన్నారు. సంఘం పెట్టుకునే అవకాశాలు లేవని అన్నారు. ప్రభుత్వ రాయితీలను ఇన్నేండ్లుగా కార్పొరేట్లు దోచుకుంటున్నారనీ, పెట్టుబడులు పెట్టకుండా, ఉపాధి అవకాశాలు కల్పించకుండా లాభాలకు అలవాటుపడ్డారని వ్యాఖ్యానించారు. రూ. 7 లక్షల రాయితీలను కార్పొరేట్లకు కట్టబెట్టారని చెప్పారు. ప్రజల నడ్డివిరిచే చర్యలు కేంద్రం కొనసాగిస్తున్న తరుణంలో పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

పదేండ్లుగా ఆర్థిక సర్వేకు బడ్జెట్ భిన్నంగానే
ప్రొఫెసర్ డా. డి.నర్సింహ్మారెడ్డి



కేంద్రంలోని మోడీ పాలనలో గత పదేండ్లుగా ఆర్థిక సర్వే, బడ్జెట్ పరస్పరం భిన్నంగా ఉంటున్నాయని ప్రముఖ ఆర్థిక, సామాజిక విశ్లేషకులు, ప్రొఫెసర్ డాక్టర్ డి. నర్సింహ్మారెడ్డి వ్యాఖ్యానించారు. కేంద్ర బడ్జెట్‌ను 'జుమ్లా' బడ్జెట్‌గా వర్ణించారు. ప్రభుత్వం వ్యవస్థలపై నియంత్రణను ఎత్తివేసేందుకు బడ్జెట్ ద్వారా కుట్ర చేశారని విమర్శించారు.ఆర్థిక సర్వే చెప్పిన విషయాలను కేంద్రం పట్టించుకోవడం లేదని తప్పుబట్టారు. అంతర్జాతీయ పరిస్థితుల మూలంగా దేశ ఆర్థిక పరిస్థితులు కుంటుపడతాయని సర్వే చెప్పిందనీ, అందుకు ఉపశమన చర్యలు బడ్జెట్‌లో ప్రతిపాదించలేదన్నారు. మనుషుల కోసం ప్రత్యేక పథకాలేవి లేవన్నారు. బడ్జెట్ అంటే నిధులు ఒక్కటే కాదనీ, నీళ్లు, భూమి, విధానాల నమూనాగా బడ్జెట్ ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం నీళ్లు కొనుక్కుని తాగుతున్నామనీ, భవిష్యత్‌లో మరింత తీవ్రమైన దుస్థితి ముందుకొస్తుందని చెప్పారు. బడ్జెట్‌లో ప్రజలకు కావాల్సిన కనీసావసరాలకు నిధుల కేటాయింపు లేదన్నారు. రక్షణ, రవాణా, రైల్వేలకు నిధులిచ్చారనీ, కానీ కనీసావసరాలైన విద్యా, వైద్యం, వ్యవసాయం, పీడీఎస్ పట్ల చిన్నచూపు చేశారని గుర్తు చేశారు. జీడీపీని వృద్ధి చేసే రంగాలను మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని చెప్పారు. కేంద్ర బడ్జెట్ సవ్వదిశలో లేదని తెలిపారు. కార్మిక శాఖలో పేరుకే సంక్షేమం కనిపిస్తుందన్నారు. ఉపాధి అవకాశాలను పెంచకపోగా, పాతవాటిని రక్షించే చర్యలూ లేవని వ్యాఖ్యానించారు. దేశం అప్పు రూ. 200 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. రూ. 50 లక్షల కోట్ల బడ్జెట్‌లో ఎలాంటి నిధులు వ్యవసాయ కార్మికులకు ఇవ్వలేదన్నారు. అసంఘటిత రంగాలకు ఒక్క రూపాయి చూపించలేదని తప్పుబట్టారు.

ఈజీ మనీ కల్చర్ ప్రమాదం : ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు డి పాపారావు

సమాజంపై ప్రస్తుతం ఈజీ మనీ కల్చర్ ప్రభావం తీవ్రంగా ఉందనీ, ఇది ప్రమాదకరమని ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు డి పాపారావు వ్యాఖ్యానించారు. షేర్‌మార్కెట్లు, రియల్ ఎస్టేట్ బిజినెస్, బెట్టింగ్‌ల మూలంగా వర్గపోరాటం వెనక్కి తగ్గిందని అభిప్రాయపడ్డారు. గత పదేండ్లుగా వస్తున్న బడ్జెట్ల నేపథ్యంలో కార్మికుల వర్గపోరాటాలకు మళ్లీ అవకాశాలు ఏర్పడుతున్నాయని గుర్తుచేశారు. గతంలో యజమానికి, కార్మికుడికి ఉన్న ఘర్షణ నేపథ్యంలో ఉద్యమాలు ఉత్పన్నమయ్యేవని విరించారు. అలాగే దేశంలో 1991 నుంచి ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ఇప్పుడన్నది బలుపు కాదనీ, వాపు అని చెప్పారు. డాలర్ల వ్యవస్థ రాజ్యమేలుతున్న తరుణంలో ఆయా దేశాలు బతుకుతున్నాయని అన్నారు. ఆస్తుల విలువలు పెరుగుతున్నట్టు అనిపించినా, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని వ్యాఖ్యానించారు. ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిందని చెప్పారు. గణితార్కిక సిద్ధాంతం ప్రకారం పరిమాణాత్మక మార్పు ఏదో ఒక దశలో గుణాత్మక మార్పుకు కారణమవుతుందని చెప్పారు. ఇప్పుడు కరెన్సీ విలువ పడిపోయి ద్రవ్యోల్బణం పెరుగుతున్నదన్నారు. బ్యాంకులో డబ్బు డిపాజిటిట్ చేసినా విలువ తగ్గుతున్నదని వివరించారు. ఈ పరిస్థితుల్లో కార్మికులు, ప్రజలు వర్గపోరాటాలవైపు మళ్లే పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. ప్రాధాన్యతల ప్రకారం బడ్జెట్ కేటాయింపులు చేసే పరిస్థితి లేదన్నారు. మోడీ సర్కారు గత పదేండ్లుగా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నదని గుర్తు చేశారు. సోవియేట్ యూనియన్ ఉనికిలో ఉన్న కారణంగా 1933లో అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ అనేక సంక్షేమ పథకాలను అమలుచేశారనీ, ఆ తరహా చట్టాలను సైతం తెచ్చారని చెప్పారు. కార్మికవర్గంపై అమెరికా, బ్రిటన్‌లు తమ నిరంకుశ విధానాలతో దాడిచేశాయని గుర్తు చేశారు. బ్రిటన్‌లో బొగ్గు గని సమ్మెపై ఉక్కుపాదం మోపారని చెప్పారు. మధ్యతరగతిలో బీజేపీ పట్ల వ్యతిరేకత పెరుగుతున్న క్రమంలోనే పన్నుల భారం కొంత మేర తగ్గిందన్నారు. సంక్షోభం తిరుగుబాటువైపు మళ్లకుండా రాయితీలు బడ్జెట్‌లో ప్రతపాదించారని తెలిపారు.

కార్మిక, కర్షక వ్యతిరేక బడ్జెట్



సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

కేంద్ర బడ్జెట్ కార్మిక, కర్షకులకు వ్యతిరేకమని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ విమర్శించారు. సామాన్యులను నట్టేట ముంచేదని చెప్పారు. కొద్దిమంది కోసం ఆశేష కార్మికవర్గాన్ని బడ్జెట్‌లో నిర్లక్ష్యం చేశారని తప్పుబట్టారు. పనికి గ్యారంటీ లేదు, పనికి తగ్గ వేతనం లేదు, కనీస వేతనాల గురంచి మాటా కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు, వారి హక్కులపై ఈ బడ్జెట్ దాడిచేసిందన్నారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా జిల్లా, మండలస్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు. అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలియజేశారు.

సంక్షేమ పథకాలపై సుప్రీం వ్యాఖ్యలు దురదృష్టకరం
ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో
సంక్షేమ పథకాలపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు దురదృష్టకరమని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యలు శ్రామికుల శ్రమను, సామాజిక తరగతులను అవమానించే విధంగా ఉన్నాయని తెలిపారు. వాస్తవాల ఆధారంగా సుప్రీంకోర్టు తిరిగి పరిశీలించాలని కోరుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం వాస్తవాలను సుప్రీంకోర్టు ముందుంచాలని కోరారు. శుక్రవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలు ఇవ్వడంతో ప్రజల ఇంటి దగ్గరే ఉంటున్నారాన్న సుప్రీంకోర్టు వ్యాఖ్యలు అత్యంత బాధను కలిగిస్తున్నాయన్నారు. "వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు, ఇతర కార్మికులు పని చేయకుండానే రెండు లక్షల కోట్ల జీడీపీ వచ్చిందా? దేశంలో 33 కోట్ల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు పని చేయకుండానే ఉత్పత్తయ్యాయా?" అని ప్రశ్నించారు.
కోర్టు వాస్తవాలను పరిశీలిస్తే శ్రమ చేసే వారు కూర్చోవడానికి ఇష్టపడరనీ, గ్రామాల్లో పనులు లేక కోట్లాది మంది వలసలు వెళ్తున్నారని ఆయన అన్నారు. పట్టణాలలో వారి జీవితం ఎంత దుర్భరంగా ఉందో కోర్టుకు తెలియంది కాదని చెప్పారు. ప్రజా ప్రయోజనాల కేసులు వచ్చినప్పుడు న్యాయమూర్తులు అత్యున్నతంగా వ్యవహరించేవారనీ, దురదృష్టకరంగా ఇటీవల కాలంలో కోర్టులు సామాజిక న్యాయం, మతసామరస్యం, శ్రమజీవులపై హేళనగా మాట్లాడుతున్న ఘటనలు చూస్తున్నామన్నారు. ఇది రాజ్యాంగస్ఫూర్తికి భిన్నంగా ఉన్నదని చెప్పారు. భారత రాజ్యాంగమన్న, న్యాయవ్యవస్థ అన్న తమకు గౌరవమున్నదనీ, కాకపోతే ఇలాంటి వ్యాఖ్యలు సామాజిక తరగతులను అవమానించే విధంగా ఉన్నాయని అన్నారు. శ్రమ చేసే వారికి రెండు ఎకరాల భూమి ఇస్తే రేషన్ కార్డులు అవసరం లేదని చెప్పారు. ఈ వ్యాఖ్యలు పున:పరిశీలించే విధంగా జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా మీనాక్షి నటరాజన్
పలు రాష్ట్రాలకు కొత్త ఇన్‌చార్జిలను ప్రకటించిన కాంగ్రెస్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో
కాంగ్రెస్ తెలంగాణ కొత్త ఇన్‌చార్జిగా సీనియర్ నేత మీనాక్షి నటరాజన్‌ను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నియమించారు. అలాగే తమ పార్టీ భాగస్వామ్యంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని నడుపుతోన్న జార్ఖండ్‌కు ఇన్‌చార్జిగా కె. రాజుకు బాధ్యతలు అప్పగించారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే శుక్రవారం రాత్రి పలు రాష్ట్రాలకు కొత్త ఇన్‌చార్జిలను నియమించారు. ఈ మేరకు పార్టీ జనరల్ సెక్రటరీ (సంస్థాగత) కె.సి గోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందులో త్వరలో ఎన్నికలు జరగనున్న బీహార్‌కు పార్టీ సీనియర్ నేత కృష్ణ అళ్లవారును ఇన్‌చార్జిగా నియమించారు. హిమాచల్, చండీగఢ్‌లకు రజని పాటిల్‌కు బాధ్యతలు అప్పగించారు. హర్యానా ఇన్‌చార్జిగా బి.కె హరి ప్రసాద్, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జిగా హరీశ్ చౌదరిలను నియమించారు. తమిళనాడు, పుదుచ్చేరిలకు గిరిశ్ చోడంకర్, ఒడిశాలో అజయ్ కుమార్ లల్లూలకు పార్టీ బాధ్యతలు కట్టబెట్టారు. ఈశాన్య రాష్ట్రాలైన మణిపూర్, త్రిపుర, సిక్కిం, నాగాలాండ్‌లకు సప్తగిరి సాంకర్ ఉల్కాను ఇన్‌చార్జిగా నియమించారు. వీరితో పాటు పంజాబ్ జనరల్ సెక్రెటరీగా ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ భగేల్, జమ్మూకాశ్మీర్, లఢక్‌లకు సీడబ్ల్యూసీ సభ్యులు సయ్యద్ నాసీర్ హుస్సేన్‌లను పార్టీ జనరల్ సెక్రెటరీలుగా నియమించినట్టు పేర్కొన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886